
# ఆంధ్రసచిత్రవారపత్రిక



7-2-75
60 పైసలు



# ధర్మపథం. సాకారం – నిరాకారం.

భగవంతుని స్వరూపం ఎట్టిది? అది సాకారమా? నిరాకారమా? అనే సందేహం కొందరికి కలుగుతుంది. జ్ఞానులైనవారు దేవునికి ఆకారమనేది లేదని అంటారు. జ్ఞానంతో సంబంధం లేని భక్తులు భగవంతునికి ఆకారం ఉన్నదని తలుస్తారు. వేర్వేరు భక్తులు వేర్వేరు సంప్రదాయాలకు చెంది ఉన్నవారు తమ తమ ఇష్టదైవాలను సేవిస్తారు. తాము సేవిస్తున్న దేవతయే భగవంతుడనీ, ఇతర దేవతలు ఎంత మాత్రమూ కారనీ ప్రగాఢ విశ్వాసంతో ఉంటారు.

అయితే భగవంతుడు సాకారుడా? నిరాకారుడా? అని పరిశీలిస్తే నిరాకారుడే కాని, సాకారుడు ఎంతమాత్రమూ కాడని తెలుసుకోవచ్చును. కొందరికి సాకారుడుగా కానరావచ్చును. ఎవరు ఏ విధంగా తన్ను తలిస్తే వారికి ఆ విధంగానే కానవస్తానని శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో చెప్పియే ఉన్నాడు. కాని, యథార్థానికి పరమాత్మ నిర్గుణుడు — అంటే గుణత్రయానికి అతీతుడు. ఆకారం లేనివాడు.

ఈ విషయం సులభంగా బోధపడడానికి ఒక చక్కని దృష్టాంతం ఉన్నది.

మహా సముద్రం ఉన్నది కదా! అందులో కొంచెం దూరం ప్రయాణం చేశామనుకుందాం. అప్పుడు చూస్తే ఏ వైపునా భూమి కానరాదు. అంతా జలమయంగానే ఉంటుంది. ఆ సముద్రం నీరు కొన్ని ప్రాంతాలలో అత్యధికమైన చల్లదనంవల్ల గడ్డ కట్టిపోయి మంచుముక్కగా తయారవుతుంది. కాని సూర్యుని తీక్ష్ణ కిరణాలు ఆ మంచుగడ్డపయి ప్రసరించగానే అది కరిగిపోయి నీరుగా మారుతుంది.

పరబ్రహ్మమే అంతం లేని జలరాశి. అధికమైన చల్లదనమే భక్తి అనుకోవాలి. మంచుగడ్డలే సాకార స్వరూపాలు. భక్తి ఉన్నంతవరకూ భక్తునికి భగవంతుని సాకార స్వరూపాలు ప్రత్యక్షమవుతాయి. జ్ఞాన రూపమైన సూర్య కిరణాలు వానిపై ప్రసరించగానే అవి కరిగిపోయి యథార్థమైన జల రూపమైన పరబ్రహ్మ స్వరూపం ప్రత్యక్షమవుతుంది.

—*బులుసు వెంకటరమణయ్య*

అయిదవ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం సందర్భంగా భారతదేశం వచ్చిన నటి లొల్లోబ్రిజిదాతో ముచ్చటిస్తున్న ప్రధాని ఇందిరాగాంధీని, వారిద్దరినీ తిలకిస్తున్న శ్రీ సత్యజిత్‌రేని చిత్రంలో చూడవచ్చు.





VEEKAY


వీనస్ మహీజా పిక్చర్స్

# యశోద కృష్ణ

ఈస్ట్‌మన్ కలర్

రచన:
ఆరుద్ర
సంగీతం:
యస్.రాజేశ్వరరావు.
కెమెరా:
జి.కె.రాము

నిర్మాత: సి.హెచ్.ప్రకాశరావు దర్శకత్వం: సి.యస్.రావు.B.A.(L.A)





# ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
( 1938 - 1972 )
శుక్రవారం : 7-2-'75
ఆనందనామ సం. పుష్యమాస ఐ. ద్వాదశి
*సంపుటము : 68 సంచిక : 21*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

★

సంవత్సర చందా – రు. 33-80 పై.
ఆరుమాసాల చందా – రు. 16-90 పై.
విడిప్రతి వెల 60 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520003.


## విషయానుక్రమణిక

అట్టమీద బొమ్మ :
రాజేష్‌ఖన్నా
(ఫోటో : శ్రీ శంకర్)

**కథలు :**


| | | |
|---|---|---|
| తీరని ఋణం | ... | 10 |
| కలలూ—సంకెలలూ | ... | 15 |
| ఇంతకీ నే నెవర్ని | ... | 36 |


**సీరియల్ కథలు :**


| | | |
|---|---|---|
| అహం—అనురాగం | ... | 19 |
| చిగురించిన జీవితం | ... | 28 |


**వ్యాసాలు, శీర్షికలు :**


ధర్మపథం — 2, లోకంపోకడ—4, ఉగాది కథలపై వ్యాసరచన పోటీలో బహుమతి పొందిన వ్యాసాలు—5, హైదరాబాద్ నోట్‌బుక్—7, నారఫలం-8, డాక్టర్‌సలహాలు—14, యువతరం-22, సినిమా—23, ...క్రికెట్ ఆట్టుకు గెలుపు—41, ప్రశ్నావళి — 42, ఫాలాక్షుని డైరీ — 44, ఉత్తరాలు — 46.


పై వారమే
[కథకుడి కథ [కథ]

# * దీపావళి కథలపై వ్యాసరచన పోటీ *

## ప్రథమ బహుమతి రు. 250 లు పొందిన వ్యాసం

కథ కల్పిత వృత్తాంతము అని మనం చెప్పుకున్నా ఆ ఇతివృత్తం అసహజంగా ఉండకూడదు. కొన్ని నిముషాలు పాఠకుల హృదయాన్ని కదిలించేటట్లు ఉన్నకథలు ఉత్తమ కథలుగా నిలబడగలవు.

దీపావళి కథల పోటీలో ఎన్నుకున్న నాలుగు కథలలోను నాలుగు మనస్తత్వాలు కనిపిస్తాయి. వాటిలో పేర్కొన్న సంఘటనలు ప్రస్తుత సమాజానికి ఏమాత్రం దూరంగా లేవు. ఆ నాల్గింటిలోను ఒకటి గొప్పది, మరియొకటి రెండవది అనిచెప్పడం అంత సాధ్యమైన పనికాదు. విమర్శనా దృష్టితో పరిశీలిస్తే తప్ప వాటి వరుస క్రమాన్ని నిర్ణయించలేము.

ఒక సంఘటన తీసుకుని పాఠకులను చివరివరకు చదివించేటట్లు రచన సాగించి చివరికి తన సందేశాన్ని తెలియచేసారు 'దీపావళి' కథా రచయిత. ధరలు ఆకాశాన్నంటుకుంటున్న ఈ రోజుల్లో పొదుపు చేయడం, అనవసర ఖర్చులను తగ్గించుకోవడం ప్రతి మనిషియొక్క కర్తవ్యం. అందుకే దీపావళికి తుపాకి కావాలని కొడుకు కోరినా అతను కొని తీసుకురాలేదు. కాని అతన్ని ఎవరూ అర్థం చేసుకోలేదు—ఈ ఇతివృత్తం నేటి పరిస్థితులకు తగ్గట్టుగా ఉంది. నాల్గింటిలోను దీపావళి కథ ఉత్తమంగా తోచింది.

కుంటికాకి కథలో చక్కని సెంటిమెంటు ఉంది. తండ్రి కుంటికాకిగా తన యింటి కేతించాడని సంబరపడి తనచేతులతో దానికి అన్నం పెడతాడు శివమూర్తి. ఆ కాకి కనబడనిరోజు విచారిస్తాడు. అది చనిపోతే అంత్యక్రియలు జరుపుతాడు. అప్పుడు — దొడ్డితలుపుతీసిన కాంతంకు కన్నీరు కారుస్తున్న శివమూర్తిగారు వెలుగులో కనిపిస్తారు. కాంతం కనుల వెంబడి రెండు కన్నీటిచుక్కలు రాల్తాయి. — ఈ కథలో శివమూర్తిగారి భావప్రకటన పాఠకుల హృదయాలను కదిలించేటట్లు ఉంది. ఈ కథకు రెండవస్థానం యివ్వడం సబబుగా తోచింది.



రావిపల్లి నారాయణరావు స్వస్థలంవిశాఖపట్టణం, పట్టభద్రులు. జననం 1932. 'గురుదక్షిణ' 'విశ్వాసం' కథల ద్వారా ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులకు సుపరిచితులు. ఉద్యోగం రైల్వేలో. ప్రస్తుత నివాసం సికింద్రాబాదు. త్వరలోనే 'కన్నీళ్లు' అనేవీరి కథ ఆంధ్ర సచిత్రవారపత్రిక పాఠకుల ముందుంటుంది.

'పట్టుచీర' కథ ఇతివృత్తంలో నూతనత్వం లేదు. కాని రచన, శిల్పం బాగున్నాయి. ముగింపులో రచయిత కొంత శ్రద్ధ తీసుకుంటే యీ కథయొక్క స్థానం మరోవిధంగా ఉండేది. దీనికి మూడవస్థానం యివ్వడం జరిగింది.

'గృహవిక్రయం' కథ యితివృత్తం బాగుంది. కాని రచనలో, పాఠకులను యిట్టే ఆకర్షించేశక్తి అంతగా కనబడలేదు. నిడివి తగ్గించిఉంటే బాగుండేది. అనవసరమైన సన్నివేశాలు విసుగును కలిగించాయి. అందువలన ఈ కథ మిగిలిన మూడు కథలకంటె ఉత్తమంగా గుర్తింపబడలేదు.

## తృతీయ బహుమతి రు. 150 లు పొందిన వ్యాసం

సంపాదకుల ఎన్నికలోనే ఒక ప్రత్యేకత ఉందనిపించే కథలు ఈ యేటివి.

1. బహుమతి సంపాదించటంకాక (!) రచనకో పరమార్థం, ప్రయోజనం కావాలంటే 'దీపావళి'కి ప్రథమ స్థానం రావాలి. ఈపండగ పేర్న ఏటా 60 కోట్లు బూడిద చేసినట్లన్నమాట వాస్తవం! బాణసంచా బూడిద నుంచి ఆనందం పొందటం — మస్తుగా ఉన్న రోజుల్లో మన పెద్దలు అలవాటు చేశారు. తింటానికి లేకపోయినా — ఇలాంటి దండగ పండగనుంచి అనేకమంది ఓపట్నాన తప్పించుకోలేరందుకనే! 'మూర్తి' అయిన వాళ్ళతోసహా అందరి దృష్టిలో 'పిసినారి'గా మాత్రం మిగిలాడు—పరిస్థితుల్ని బట్టి అలవాట్లు మార్చుకోవాలని పదిమందికి ధైర్యంగా చెప్పగల మరో పంద 'మూర్తు' లయినా పాఠకుల్లో ఉండక పోతారా?

2. తీరే కోరికలుకన్న తీరని కోరికలే మనుషుల కెక్కువ. కాని, 'పట్టుచీర' కథలో దుర్గకి ఆకోరిక తీరనిదికాదు. ఎన్నో ఏళ్ళ నాటి ఆకోరిక తన కన్నకొడుకు తీర్చటానికి సిద్ధంగా ఉన్నా తీరా తీరేనాటికి ఆకోరికమీదనే మనస్సు లేకపోయింది! మాంగల్యం కన్న మరేదీ ఆక్షణంలో ముఖ్యం కాదామెకు. తీరని కోరిక ఎంత హృదయ శల్యమో దుర్గకు స్వానుభవం. అటువంటి స్థితే కూతురు పద్మకి రాకూడదు. నేటి దుర్గ కోరిక ఇదే! ఉత్కంఠతో, విలువలతో నీటుగా నడిచిన కథ ఇది.


3. ఇహంలో గండాల పాలయే నేటి మనుషులకి పరలోక వాసుల్ని జ్ఞప్తికి తెచ్చుకునే తీరికే ఉండదు — రిటైరయిన శివమూర్తిగారి లాంటి వాళ్ళకు తప్ప. ఎంత ముందుకు పోతున్నా — మానవతా విలువలు సాధించలేక పోతున్న నేటి తరానికి సనాతన ధర్మం నిలుపుకున్న జీవితా లెంత గొప్పవో ఈ 'కుంటికాకి' కథ చెబుతుంది. శివమూర్తుల కరుదయిన వాస్తవంలో మరెందరో మహనీయులు పుడితేనే కాని మనుషులు మానవులు కాలేరని చెప్పే కథఇది.



టి. విమలారామం. 'నేను విమలను, వారు రామం కలిస్తే విమలా రామం' అంటూ శ్రీవారితో ఉన్న ఫోటో పంపిన విమలగారు రామంగారు కూడా పోయినసంవత్సరం దీపావళి కథల పోటీలో బహుమతి పొందిన 'భయపెట్టే దేవతల' కథతో పాఠకులకు సుపరిచితులు. ప్రస్తుత నివాసం ఢిల్లీ.

4. అంధునికి దానం, ఓకుర్రాడికి సాయం ఇలా పరులకండనిలిచే శ్రీహరి-నాటిమాటలు

# ద్వితీయ బహుమతి రు. 200 లు పొందిన వ్యాసం



వంగల మోహన్ కుమార్ వయస్సు 25 సం. లు. వృత్తి ఇంజనీరు ఉద్యోగం హైదరాబాద్ హెచ్. ఎం. టి. లో. నాటకాల్లో వేషాలు వేయడం, కథలు వ్రాయడం ముఖ్యమైన సరదాలు. బి. యస్. సి. విజయవాడలోనూ, బి. ఇ. కాకినాడలోనూ చదువుకున్నారు.

నా దృష్టిలో దీపావళి కథలపోటీలో ఎన్నికైన నాలుగు కథలలో 'పట్టుచీర' కథ ప్రథమ స్థానాన్ని అలంకరిస్తుంది. అతి స్వల్పమైన కోరికలు సైతం పేదవారికి గగన కుసుమాలుగా ఎలా మారుతాయో, అలా మారినవాటి మీద భ్రమ ఎలా దినదిన ప్రవర్థమానమౌతుందో, చిట్టచివరకు అవి చేరువలోకి రాగానే వాటిమీద ఆసక్తి ఎలా సన్నగిల్లుతుందో, రచయిత చక్కగా వర్ణించారు. చిన్నతనంలో సినిమాలో చూసిన పట్టుచీర, కట్టుకోవాలన్న కోరిక, తన తల్లితండ్రులు, భర్త ద్వారా తీరకపోయినా, కన్నకొడుకు దానినితీర్చబోయే సరికి, తన కూతురికైనా ఆ ముచ్చట సరైన వయసులో తీర్చాలనే ఉద్దేశంతో దాన్ని కూతురికి ఇచ్చివేసిన దుర్గపాత్ర చిత్రీకరణ ఎంతో నైపుణ్యంతో జరిగింది. సన్నివేశాల అల్లికలో పటుత్వం, వాస్తవికతకు దగ్గరలో ఉన్న సంభాషణలు; సరళమైన శైలి, శిల్ప చాతుర్యం ఈ కథలో ప్రత్యేకతలు.

నరకాసురుడు మళ్ళీ అవతరించి పెరుగుతున్న ధరల రూపంలో వికటాట్టహాసం చేస్తున్నాడా? అనిపిస్తున్న రోజుల్లో; దీపావళిని సరదాల పండుగగా జరుపుకోవడం అవసరమా? అనిపిస్తున్న సమయంలో "దీపావళి" కథ ఎంతో సమయోచితంగా ఉంది. నేను దీనికి ద్వితీయ స్థానం ఇస్తాను. "మనిషి ఒక రూపాయి ఖర్చు చేసినా దాదాపు అరవైకోట్ల రూపాయలు ఈ పండుగ పేరుతో బూడిద చేసినట్టే" అన్న అందరికీ తట్టని సత్యాన్ని రచయిత తమ కథ ద్వారా వెలుగులోకి తీసుకొచ్చారు. అయినా నలుగురితో నారాయణా అన్నట్టు, అందరూ తమ స్థితిగతులు ఎలా ఉన్నా యీ పండుగ ఘనంగా జరుపుకోడానికే ప్రయత్నిస్తారు. అలాచెయ్యని వారిని పిసినారిగా పరిహసిస్తారు. ఎంతో సహజమైన ఇతి వృత్తానికి రచయిత తమ రచనా చాతుర్యంతో జీవం పోశారు. మనస్తత్వాల చిత్రీకరణ, చక్కటిశైలి, ఈ కథలోని ఆకర్షణలు.

తృతీయ స్థానానికి "కుంటికాకి" కథను ఎన్నిక చేస్తున్నాను. ఎంతో వాస్తవంగా ఉన్న సనాతన శ్రోత్రియ కుటుంబ వాతావరణం, ఈ చిన్న కథలో నన్ను ఎంతో ఆకర్షించింది. తండ్రిపై ఉన్న పూజ్యభావాన్ని, తను గుప్పెడన్నం పెట్టకపోయినా, తన చుట్టూ తిరుగుతున్న కుంటికాకి మీద నిల్పి దానికి దహన సంస్కారాలు చేసిన శివమూర్తిగారి పాత్ర చిత్రీకరణ చాలా బాగుంది. సమయోచితమైన వర్ణన, సంభాషణలు ఈ కథకు జీవం పోశాయి.

"గృహ విక్రయం" కథకు నా దృష్టిలో చివరి స్థానం లభిస్తుంది. ఇతి వృత్తం పాతదైనా, కథలో ఏ ప్రత్యేకతా లేకపోయినా, చెప్పిన విధానం బాగుంది. మొత్తం మీద ఇది మంచి కథే అని చెప్పవచ్చు.

---

* తృతీయ బహుమతి పొందిన వ్యాసం

నేటికీ గుర్తుంచుకొని — చివరికి 'గృహ విక్రయ'మే మానుకున్న మంచి మనిషి — ప్రియ కమల సంగతి ఇన్నాళ్లెలా మర్చిపోయాడు? ఆమె దీనగాథ తన్నుంచి తల్లి దాచిందనుకుంటే తను నిర్దోషా? ఈత్యాగధనుడికి ఆమె గురించి తెల్సుకోవాలంటే అంత కష్టమా? నాటి చిన్న శ్రీహరిని ఇన్నేళ్ళ తరువాత 'స్వామి' టక్కున ఎలా గుర్తుపట్టాడు? ఈలోగా బాధలు క్రుంగదీసి వన్నెతగ్గిన మాస్టార్ని శ్రీహరి మాత్రం చటుక్కున గుర్తుపట్టగలడా? ... ఇన్ని లోపాలున్నా — 'సెంటిమెంటల్ వాల్యూ'కి బహుమతి పుచ్చుకున్న కథ.

# హైదరాబాద్ నోట్ బుక్

**సాహిత్య అకాడెమీ వార్షికోత్సవం :**

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వార్షికోత్సవం జనవరి 10వ తేదీ సాయంకాలం సారస్వత పరిషత్తు ఆవరణలో ఎప్పటిలాగే వైభవంగా జరిగింది. విశిష్ట సభ్యులుగా శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి గౌరవించబడివారు. ఆధునిక సాహిత్యంలో సాహిత్య విమర్శకు శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రికి, కవితకు డాక్టర్ ఆరిపిరాల విశ్వంకు బహుమతులు యివ్వబడినాయి. నాటకానికి కీర్తిశేషుడు నార్ల చిరంజీవికి ఇవ్వబడింది. ఈసారి ఎన్నికయిన కథానిక, నవలల రచయితలు అకాడెమీ బహుమతిని తిరస్కరించడం అందరికీ తెలిసిన సంగతే. ఉత్తమ సంస్కృత విద్వాంసులుగా మీమాంసా శాస్త్రానికి శ్రీ వీరేశ్వరశాస్త్రిద్రోంగ్రే, ఉత్తమ రచయిత్రిగా శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి సన్మానించబడ్డారు. అధ్యక్షతవహించిన డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి తవ ప్రసంగంలో రెండు ముఖ్య విషయాలు చెప్పారు. "భాష పతనమైపోయిందని ఎవరూ వగవనక్కరలేదు. భాష ప్రవాహిని నేడు ముందుకన్నా అనేక ప్రాంతాలకు ప్రవహించి, గొప్ప పంటలు పండించింది. ప్రవాహం పై నుంచి కిందికి దూకినప్పుడే విద్యుచ్ఛక్తి పుడుతుంది. అట్లే ఇప్పుడు భాష క్రింది తరగతులలో వ్యాపించినందువల్ల కొత్త వెలుగులు కలిగాయి. ఇది భాషా వృద్ధే కాని, పతనం కాదు" అని ఆయన చాల గొప్పగా చెప్పారు. శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి 78 సంవత్సరాల వారు గనుక దాదాపు ఒక శతాబ్దానికి ప్రతినిధులు గనుక, తమ చిన్ననాటి సంగతులతో, ఇప్పటి అనుభవంతో ఆత్మ కథ వ్రాయాలని డాక్టర్ రెడ్డి కోరారు. పండితులు హిమాలయాలవంటివారు. ఆ హిమాలయాల నుంచి నదీనదాలు, ఆ నదుల నుంచి కాలువలు పుడుతాయి. దేని ప్రాముఖ్యం దానిదే. కొండే గొప్పది. కాలువ తక్కువది అనడానికి అవకాశంలేదు" అన్నారు ఆయన.

**విద్యార్థుల ఆగ్రహం :**

విద్యార్థుల ఉద్యమం 'మెనేస్' అని ఉత్తరప్రదేశ్ గవర్నరు డాక్టర్ చెన్నారెడ్డి అన్నందుకు జనవరి 8వ నగర విద్యార్థులు శ్రీ డి. కాళిదాస్ అధ్యక్షతన సమావేశమై తీవ్రంగా విమర్శించారు. తెలంగాణా ఉద్యమంలో డాక్టర్ రెడ్డి విద్యార్థులను తనకు ఉపయోగించుకొనడమే గాక, ఇప్పటి ఆయన పదవికి విద్యార్థులే కారణమని శ్రీ కాళిదాస్ విమర్శించారు.

# వారఫలం

**7—2—1975 శుక్రవారం మొదలు**
**13-2-1975 గురువారం వరకు**

**మేషం :—** వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. సజ్జన సాంగత్యం లభిస్తుంది. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళా రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

**వృషభం :—** కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. ఆందోళన కలుగుతుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. రావలసిన డబ్బు అందగలదు. ప్రయోజనంగల సంభాషణలను జరుపగలరు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమకలుగుతుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

**మిథునం :—** ప్రయత్నించిన ప్రతి పనీ సులువుగా నెరవేరగలదు. రావలసిన డబ్బు అందుతుంది. వారం మధ్యలో చికాకులు ఏర్పడతాయి. సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. ప్రయాణాలోచనలు చేస్తారు.

**కర్కాటకం:—** వ్యాపారంలో పోటీ వారి పోటీ పెరుగుతుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ఆడంబరంకోసం వ్యయం జరుగుతుంది.

**సింహం :—** మీ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి మిత్రుల సహాయం లభిస్తుంది. ప్రయాణాల్లో ప్రయాసకు గురి కాగలరు. దైవ కార్యాలు నెరవేరతాయి. వారం ఆఖరులో భాగస్వాములతో కలసిచేసే వ్యాపారాలు లాభిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. ఎవరితోను వాద ప్రతివాదాలు తగవు.

**కన్య :—** అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా వుంటుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వారం మధ్యలో సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభి



ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు పురపాలక సంఘాల మంత్రి శ్రీ చల్లా సుబ్బారాయుడు జనవరి 12 వ తేదీన సికిందరాబాదులో మండా మార్కెట్‌ను తనిఖీ చేస్తున్న దృశ్యం.

# హైదరాబాద్ నోట్ బుక్

**మురికిపేటల నిర్మూలన :**

ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు జనవరి 11న పాత నగరంలోని పెక్కు మురికిపేటలను చక్కబరచి అభివృద్ధిపరచడానికి మునిసిపాలిటీవారు చేస్తున్న కృషిని పరిశీలించారు. ఆయన మీర్ ఆలం మండీ, అప్పుగూడ, చార్‌మినార్, దూద్‌బౌల్లి, కమాటిపురా, దేవీబాగ్, యాద్గార్‌హుసేన్‌కుంట, గంగానగర్ మొదలయిన ప్రాంతాలను పరిశీలించి, చార్‌మినార్ వద్ద జరిగిన బహిరంగసభలో ప్రసంగిస్తూ, తను పాత నగరం అభివృద్ధికి తీవ్రంగా పాటుపడతానని, మూడు నాలుగు నెలల కొకసారి వచ్చి పరిశీలిస్తానని అన్నారు.

**మొదటి సమస్య :**

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి జనవరి 11వ తేదీ పాటంచెరువు ప్రాంతంలో అంతర్జాతీయ పంటల పరిశోధన సంస్థ నూతన భవనాలకు శంకుస్థాపన చేస్తూ, ఆహార సమస్య పరిష్కారమైతే, దేశం అభివృద్ధి పథంలో పురోగమించడానికి ప్రాతిపదిక ఏర్పడుతుందని స్పష్టపరిచారు. ఈ భవనాల నిర్మాణానికి పదికోట్ల రూపాయలు వ్యయమవుతాయి. విజ్ఞాన శాస్త్రవేత్తలు ఆహార సమస్యా పరిష్కారం విషయంలో తమ శక్తులను కేంద్రీకరించాలని, గ్రామాల స్వరూపాన్ని పూర్తిగా మార్చివేయడానికి తక్కువ వ్యయంతో సాంకేతిక పద్ధతులను కనుగొనాలని ఆమె కోరారు. ఈ సంస్థకు ప్రభుత్వం సహాయం చేస్తుందని వాగ్దానం చేశారు. మొదట ఆమె 1500 ఎకరాల ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

**శ్రీ ఎల్. ఎన్. గుప్త కాలధర్మం :**


రాష్ట్రప్రభుత్వం మాజీ కార్యదర్శి శ్రీ ఎల్. ఎన్. గుప్త జనవరి 9వ తేదీ రాత్రి కాలధర్మం చెందారు. ఈయన వయస్సు 66 సంవత్సరాలు. 10 వ తేదీన పురానాపుల్ వద్ద ఆయనకు అంత్యక్రియలు జరిగాయి. శ్రీ గుప్త నగర ప్రముఖులలో ఒకరు. లలితకళా అకాడెమీ కార్యదర్శిగా ఉన్నారు. నగరంలోని పెక్కు విద్యా సంస్థలతోను, సంఘసేవా సంస్థలతోను శ్రీ గుప్తాకు ఘనిష్టమైన సంబంధం వుంది. ఆయన కాలధర్మం చెందినందుకు గౌరవ స్మారక చిహ్నంగా పెక్కు సంస్థలకు సెలవు ఇవ్వబడింది. ఆయన సతీమణి శ్రీమతి ప్రేమలతా గుప్త సుప్రసిద్ధ సంఘ సేవిక. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

**ఉపశ్రుతి :**

ఒక ఇంజనీరింగ్ విద్యార్థి— కృష్ణఫణి— సంస్కృతం చదువుతున్నాడు. "ఎందుకయ్యా చదువుతున్నావు?" అని అడిగాను. "ఎప్పటికైనా రాజకీయాలలో ప్రవేశించాల్సి వుంటుందేమో సార్! సంస్కృతం వాసన వుంటే సంస్కృతి గురించి గప్పాలు కొట్టవచ్చుగదా!" అన్నారు ప్రక్కన ఉన్న ఒక పెద్దమనిషి.

—తిరుమల రామచంద్ర

# విటమిన్లు మరియు ఖనిజములు మీ కుటుంబము యొక్క ఆరోగ్యమునకు ఎంతో అవసరము




## వారికి తగినవన్ని లభిస్తున్నాయా?

విటమిన్లు మరియు ఖనిజముల లోపముతో మీ కుటుంబపు ఆరోగ్యము పాడవవచ్చును అలసట, జలుబు, ఆకలి లేకపోవడము, నిరుత్సాహము, చర్మము మరియు పళ్ల బాధలు మొదలైనవన్ని అవసరమైన విటమిన్లు మరియు ఖనిజముల లోపమువల్ల మామూలుగా కలుగుతాయి.

విటమిన్లు మరియు ఖనిజముల లోపము సమృద్ధియైన ఆహారములో కూడ ఉండవచ్చును కనుక మీ కుటుంబములో ప్రతి ఒక్కరికి నిశ్చయముగా యీ అవసరమైన పోషక పదార్థములు కావలసిన పరిమాణములో లభించుటకు. వారికి రోజూ ఒక విమ్‌గ్రాన్ బిళ్ల యివ్వండి.

విమ్‌గ్రాన్‌లో ముఖ్యమైన 11 విటమిన్లు మరియు 8 ఖనిజ పదార్థములు ఉన్నాయి. ఇనుము—రక్త వృద్ధికి, చురుకుదనమును యిచ్చుటకు, కేల్షియమ్—ఎముకలను మరియు పళ్లను బలిష్ఠముగా చేయుటకు, విటమిన్ సి—జలుబు రాకుండా అడ్డుటకు, విటమిన్ ఎ—తేటయైన కళ్లు మరియు ఆరోగ్యమైన చర్మమునకు, విటమిన్ బి$_{12}$—ఆకలిని అధికము చేయుటకు మరియు శరీర ఆరోగ్యమునకు. ఇంకా యితర ముఖ్యమైన పోషక పదార్థములు ఉన్నాయి.

# విమ్‌గ్రాన్®

వివిధ విటమిన్లు మరియు ఖనిజములుగల బిళ్లలు
11 విటమిన్లు + 8 ఖనిజ పదార్థములు



SQUIBB®
SARABHAI CHEMICALS PVT. LTD.

® ఇ.ఆర్. స్క్విబ్ & సన్స్ ఇన్‌కార్పొరేటెడ్ వారి రెజిస్టర్డ్ ట్రేడ్ మార్కుకు చిహ్నం. దీని లైసెన్స్‌డు ఉపయోగదారులు ఎస్‌సిపిఎల్.

## ఒక విమ్‌గ్రాన్ మిమ్మల్ని రోజంతా శక్తివంతముగా ఉంచుతుంది

Shilpi-HPMA 2A/74 Tel

## వారఫలం

స్తాయి. వారం ఆఖరులో అనవసరమైన సందేహాలు కలుగుతాయి. స్త్రీలకు—పుణ్యకార్యాలు చేస్తారు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

**తుల :—** వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగించగలదు. విద్యా వైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. స్త్రీలకు — ఆరోగ్యం బాగుంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.

**వృశ్చికం :—** మీ ఆలోచనలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు అందుతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు హడావుడిగా వుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

**ధనుస్సు :—** మీ కార్యక్రమాలు బాగుంటాయి. ప్రయాణాలోచనలు చేస్తారు. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు: ఆరోగ్యం బాగుంటుంది. నూతన విషయాలను తెల్సుకొంటారు.

**మకరం :—** మీరు శ్రమపడినా, ఫలితం దక్కదు. సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వారం మధ్యలో ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి, మీ ఆలోచనలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు అందగలదు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అధిక వ్యయం జరుగుతుంది.

**కుంభం :—** వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం మధ్యలో వ్యతిరేకమైన వార్తలను వింటారు. మీ తాలూకు వస్తువులు పోవచ్చును. వారం ఆఖరులో మీ కార్యక్రమాల్లో అనుకూలత లభిస్తుంది. స్త్రీలకు-ఆరోగ్యం బాగుండదు. విలాస వస్తువులు కొంటారు.

**మీనం :—** మీ కంటే పెద్దవారు కూడా మీ సహకారాన్ని కోరవలసివస్తుంది. పుణ్యకార్యాలుచేస్తారు. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. సాహిత్య కళా రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. వారం ఆఖరులో వ్యతిరేక పరిస్థితి ఏర్పడగలదు. స్త్రీలకు—దైవకార్యాలు నెరవేరతాయి. ప్రయాణాల్లో శ్రమకలుగుతుంది.

— మహేష్

# తీరని ఋణం

భాగవతుల లలితశర్మ



చల్లగాలికి అప్పుడే కునుకు పట్టిందేమో, బస్సు అనకాపల్లి చేరడం గమనించలేదు. బస్ స్టాండులో కోలాహలానికి త్రుళ్లిపడి లేచేను.

వెంటనే నా కళ్లు అప్రయత్నంగా నాలుగు వేపులా పరికించడం మొదలు పెట్టేయి. సీటులోంచి కదలకుండానే మెడలు నొప్పిపుట్టే దాకా బయటికి చూస్తూ కూర్చున్నాను.

బస్సు ఆగీ ఆగకుండానే హాజరయే కోవా బిళ్లల అబ్బాయి, సోడాలవాడు, చామంతి పూల అమ్మాయి, కర్ర స్టాండుకి తగిలించుకుని రిబ్బన్లు, పిన్నులు, సూదులు అమ్ముకొనే అమ్మాయి, బెల్లం దిమ్మల తోపుడు బండీ...

అబ్బ! ఎంత చూసినా వీళ్లే. ఇవాళ కూడా కనిపించడేమిటి చెప్మా, 'వాడు'?

పోనీ దిగివెళ్లి అలా చూసొస్తేనో అనిపించింది. పనిలో పని, కాస్త కాఫీ తాగివస్తే ఈ నిద్దరమత్తు కూడా వదులుతుంది.

కాళ్లు కాఫీ హోటల్లోకి దారి తీస్తున్నా దృష్టి మాత్రం బస్సు పరిసరాల్ని వదలడం లేదు. యీ అమూల్యమైన క్షణాల్ని వేస్టు చెయ్యడం నా కేమాత్రం ఇష్టంలేదు.

త్వరగా కాఫీ తాగి బయట పడ్డాను. 'వాడు' గాని ఈలోగా వచ్చి వెళ్లిపోలేదు కద! కంగారుగా బస్సెక్కి, కిటికీపక్క సీటులో చతికిలబడ్డాను. టయిమయి నట్టుంది. బస్సులోకి ఒక్కొక్కరే చేరుతున్నారు.

'కాళ్లు లేవు బాబూ, ఒక పైసా ...'

ముష్టివాడి మాట పూర్తవకుండానే కస్సున తిరగబడుతున్నాడు వెనక సీట్లో పెద్ద మనిషి 'వెళ్లు వెళ్లు, తేరగావస్తున్నాయి పైసలు...' వెంటనే చివాల్న వెనక్కి తిరిగి చూసేను. ప్చ్! 'వాడు' కాదు. అయ్యో! బస్సు కదిలిపోతోంది. ఆఖరిసారి బయటికి చూసేను ఆశని కూడగట్టుకుంటూ – ప్చ్! ఈ సారికి మరింతే!

విశాఖపట్నంలో చదువు వెలగబెడ్తున్న నాకు వారం కొకసారి యలమంచిలి వెళ్లి అమ్మ చేతి కమ్మటి భోజనం, నాన్నగారి చేత సన్న సన్నటి చీవాట్లు (బాగా చదువుకోమని) తినందే తోచదు ఆవేళ కూడా ఇలాగే యలమంచిలి బయలుదేరేను. కిటికీ దగ్గర సీట్లో కూర్చొని ఏదో పుస్తకం చదువుకుంటున్నాను. బస్సు అనకాపల్లి వదలడానికి సిద్ధంగా వుంది.

కథ మంచి పట్టులో వుందేమో, 'బాబయ్యా ధర్మం...' అన్నమాట విని చిరాకు పడ్తూనే తల పైకెత్తి చూసేను. రెండు పదులు నిండే వుంటాయి వాడికి. దీనత్వం నింపుకున్న వాడి కళ్లు ఈ జన్మలో మర్చిపోలేను. బ్రతుకుమీద నైరాశ్యం అంతా వాడి చూపుల్లోనే వుందేమో అనిపిస్తుంది. దేశంలో దరిద్రానికి ప్రతినిధిలా వున్నవాడి మురికోడుతున్న చొక్కాలో చిరగని భాగం అంటూ లేదు. తొడుకున్న నిక్కరు వాడి సైజుది కాదు. తైలసంస్కారం ఎరగని, దుబ్బులాంటి ఉంగరాల జుత్తు, చాపిన కుడి చేతికి ఆరువేళ్లు...ముందుకి వంగి చూస్తే తెలిసింది, వాడికి ఒక కాలు కూడా లేనట్టు. బాగా చూస్తే, ఎప్పుడో ఎక్కడో చూసిన పోలికలు కనబడుతున్నాయి వాడి ముఖంలో. జ్ఞాపకం తెచ్చుకుందికి ప్రయత్నిస్తూనే జేబులో చెయ్యి పెట్టేను. అరె! చిల్లరలేదే! ఉన్నవి నాలుగూ రూపాయి నోట్లే. ఏం చెయ్యడం? పోనీ ఓ రూపాయి పడేస్తే? అబ్బే! అందుకుమాత్రం మనసొప్పలేదు. ఐనా ముష్టివాడికి రూపాయి ఇచ్చేసేంత మంచి పరిస్థితిలో వుందా నేటిదేశప్రజ! ఛ! ఒక పది పైసలు బిళ్లలేకుండా పోయింది జేబులో. మనసురాయిచేసుకొని 'చిల్లరలేదోయ్' అన్నాను, వాడి మొహంలోకి చూసేశక్తిలేక ఎటో చూస్తూ. నా మాట వినిపించినట్టు లేదు. పాపం, అలాగే ఆశగా చూస్తూ నిలబడ్డాడు. ఆ చూపుల్తోనే నా మొహంలో ఏదో వెతుకుతున్నాడు పరీక్షగా. ఆ గుండ్రటికళ్లు నాకు బాగా పరిచయమున్నట్లే అనిపిస్తున్నాయి. ఎక్కడో చూసివుంటాను. వాడినే అడిగితేసరి! ఊహూ...అందుకు మాత్రం నా సంస్కారం ఒప్పుకోలేదు. నా ఆలోచనలో నేను వుంటూండగానే బస్సు మెల్లిగా కదిలిపోయింది. తల పైకిపెట్టి వెనక్కి చూసేను. వాడు ఇంకా నన్నే చూస్తున్నాడు.

ఇంటికిచేరి, రాత్రి పడుకున్నా వాడి జాలిగొలిపే కళ్లు మాత్రం నన్ను వదల్లేదు. పొరపాటయి పోయింది... వాడికి ఆ రూపాయి నోటు పడేసినా బాగుండిపోను మనసంతా చిగాకయి పోయింది. ఇప్పుడు బాధపడి ఏం లాభం. పోన్లే, యీసారి కనబడుతాడుగా అప్పుడు ఇచ్చియొచ్చు! ఇంతకూ వీడు–ఆ కళ్లు, ఉంగరాల జుత్తు, కుడిచేతికి ఆరు వేళ్లు...ఆలోచనలు పది సంవత్సరాలు వెనక్కి పరుగెత్తేయి. అబ్బ! ఇప్పటికి జ్ఞాపకం వస్తోంది నెమ్మదిగా.

అప్పుడు నేను నాల్గవ క్లాసు చదువుతున్నరోజులు. మా స్కూలు గేటుదగ్గర వీడు బఠాణీలు, జంతికలు అవీ అమ్ముకుంటూ వుండేవాడు. వాడి పేరేమిటో తెలీదు నాకు. మహా అయితే నాకన్న ఒకసంవత్సరం పెద్దయి వుండొచ్చు. చాల హుషారుగా, చలాకీగా వుండేవాడు. కొన్నా, కొనకపోయినా రోజా వీడి చుట్టూ చేరి వాడిచేతి ఆరువేళ్లు చూసి వెక్కిరిస్తూ, నవ్వుకుంటూ వుండేవాళ్లం మేమంతా. పాపం–వాడు అదేమీ పట్టించుకునేవాడు కాదు.

ఒకసారి ఏం జరిగిందంటే, స్కూలు పిల్లలందర్నీ 'సింహాచలం' ఎక్స్కర్షన్ తీసికెళ్తామన్నారు మా హెడ్ మాష్టరుగారు. ఇంట్లో ఏడ్చి, గోలపెట్టి సంపాదించుకున్న నాలుగు రూపాయలు అతి జాగ్రత్తగా గుప్పెట్లో దాచుకొని స్కూలికి పరుగెత్తాను.

మాష్టారికి డబ్బు కట్టడానికి ఆఖరు తేదీ ఆ రోజే! తీరా క్లాసులోకి వెళ్లి చూసుకుంటే రెండు రూపాయలే వున్నాయి. అరె! మిగతా రెండు నోట్లూ ఏమయినట్టూ! చాల గట్టిగా పట్టుకున్నానే. అయినా ఎక్కడో రాలిపోయాయి దార్లో. సరదాగా అందరితో కలసి సింహాచలం వెళ్లడం దేముడెరుగు! ఈ సంగతి తెలుస్తే నాన్న వీపు చీరెయ్యడూ! ఇప్పుడేంచెయ్యాలి! తల్చుకున్న కొద్దీ నాకు దుఃఖం ఆగడంలేదు. ఏడుపు లోపలే మింగుకుంటూ గేటుదాటి బయటపడ్డాను. దారంతా వెతుక్కుంటూ పోతేమటుకు ఎక్కడ దొరుకుతాయి? ఈ పాటికి అవి ఎవరో అదృష్టవంతుల జేబులో చేరిపోయి వుంటాయి. పది గజాల దూరంవెళ్లి నిరాశగా వెనక్కి తిరిగి వచ్చేసేను. ఆలస్యంఐతే మాష్టారూ కొడతారేమో! డబ్బులు దొరకలేదు! ఏంచెయ్యాలో తోచక భోరుమని ఏడవాలనిపించింది. ఏవరేనా చూస్తే బాగుండదు! చుట్టూ చూసేను తలెత్తి. బఠాణీలబ్బాయి నన్నేచూస్తున్నాడు. బలవంతంగా ఏడుపు ఆపుకున్నాను. నా అవస్థ చూసి వాడికి జాలేసిందేమో 'ఏటయింది బాబూ!' అన్నాడు దగ్గరగావచ్చి. వాడు అలా జాలిగా అడిగేసరికి అంతవరకు కష్టపడి ఆపుకున్న దుఃఖం అంతా కట్టలు తెంచుకుంది. "డబ్బులు పోయేయి, మా నాన్న కొడ్తారు"అంటూ బావురు మన్నాను. 'ఎంత పోయినాయేటి? అన్నాడు వాడు మళ్లీ. 'రెండు రూపాయలు. కొత్తనోట్లు అన్నాను, వాడి చేతివేపే చూస్తూ. వాడు బఠాణీల సజ్జలో అడుగున గుడ్డ క్రింద కాసేపు ఏదో వెతికాడు. నాలో చిన్న ఆశలాంటిది మొలకెత్తింది. వాడు నోట్లుపైకితీసి, 'ఇవేనేటి? నాకు ఇందాక గేటుకాడ దొరికేయి' అన్నాడు. నావే అవి! సరికొత్త నోట్లు. వీడికి దొరికినట్టున్నాయి. ఇది కలా,నిజమా అనిపించింది. కలకాదు నిజమే అని చెప్తున్నాయి వాడి చేతి ఆరువేళ్లమధ్య రెపరెపలాడుతున్న

### పిచ్చెక్కిన విమానం!

డిసెంబరు 2వ తేదీన అమెరికాలో కొలంబస్‌లోని విమానాశ్రయంలో ఓ చిన్న విమానంవచ్చి ఆగింది. పైలెట్ విమానం ఇంజను పనిచేస్తుండగానే కిందికి దిగాట్ట. ఇంతలో ఉన్నట్టుండి ఇంజన్‌లోని ఓ వాల్వు దానంతటదే కదిలి విమానం పరిగెత్తడం ప్రారంభించింది. పరిగెత్తి ఓ 25 గజాలు గాలిలో ఎగిరి తిరిగి కిందకు దిగిందట. విమానం వెనకాలే పరుగెత్తుతున్న పైలెట్ ఎట్టకేలకు దానిరెక్క ఒకటి పుచ్చుకుని వేలాడగలిగాడు. విమానాశ్రయమంతా గజిబిజిగా తిరిగి తిరిగి, ముప్పతిప్పలు పెట్టి చివరకి ఒక స్తంభానికి గుద్దుకుని ఆగిపోయిందట.

కొత్త నోట్లు ... 'ఎంతమంచి వాడు !
దొరికేయి కదాని దాచేసుకో కుండా
ఇంత న్యాయంగా ఎవరు ఇచ్చేస్తారు. వీడు
కాబట్టి ఇస్తున్నాడు. ఇంకెప్పుడు వాడి వేళ

## తీరని ఋణం

నూసి వెక్కిరించ కూడదు' అనుకున్నాను. ఆ
పరిస్థితిలో వాడు నాకుచేసినమేలు ఎలా మర్చి

పోగలను? వాడి నిజాయితీనిమాటల్లో వ్యక్తం
చెయ్యకలిగే వయస్సుకాదది. వాడిమంచితనాన్ని
మెచ్చుకొని వాడిని సంతోష పెట్టాలన్నజ్ఞానం
లేదప్పుడు, 'మరి నా కేటిస్తావు?' అని అడిగేదు

వాడు నవ్వుతూ, నా చేతిలో రూపాయలుంచి. 'ఇప్పుడు నా దగ్గర ఇవే వున్నాయే? మరెలాగ ...పోనీ నేను పెద్దయాక నాన్నగారిలాగే నా దగ్గర బోలెడు డబ్బులుంటాయిగా! అప్పుడు ...అప్పుడు నీకు తప్పకుండా ఇస్తాను'అంటూ స్కూల్లోకి పరుగెత్తేను. వాడిమీద కృతజ్ఞతా భావం మనసులో ఓ మూల మెదుల్తున్నా, వాడు మళ్లీ ఎప్పుడేమిటడుగుతాడో అని చాల రోజులు వాణ్ణి తప్పుకు తిరిగేవాడిని. కాని ఆసంగతి వాడు అప్పుడే మర్చిపోయివుంటాడు. మళ్లీ ఇన్నాళ్లకి ఇవాళ కనిపించేడు. పదేళ్ల క్రిందట ఒకనాడు నాకు నాన్నచేత దెబ్బలు తప్పించిన ఆ ఆరువేళ్ల చేత్తోనే ఈనాడు బస్సుస్టాండులో 'అమ్మా, బాబూ...'అంటూ అందరితో పాటూ నన్నూ యాచించడం... ఇంక ఆలోచించలేకపోయాను.

పాపం, బఠాణీలు, జంతికలు అమ్ము కుంటూ వుంటే బాగానే వుందిగాని, ప్రపంచంలోని అనేకమంది ముష్టివాళ్లలో వీడూ ఒకడయి, అందరిచేత తిట్లు తింటూ... పైగా ఆ కాలు కూడా ఎలా పోయిందో, ఈ సారి కనబడితే తప్పకుండా అడగాలి. ఆ వేళ సంఘటన వాడకి జ్ఞాపకముందో లేదో! మళ్లీకనబడినప్పుడు అదీ అడగాలి. ఓ విధమైన తృప్తి మనసులో నిండగా నిద్రపోయేను.

అప్పటినుండి బస్సు ఆగినప్పుడల్లా ఆ జాగాలో చూస్తూనే వున్నాను. అలా చూడ్డం ఒక అలవాటుగా మారిపోయింది. ఎలాగేనా వాడిని ఒక్కసారి కలుసుకోవాలన్న పట్టుదల నాలో పెరుగుతూన్నకొద్దీ వాడు కనిపించక పోడం మరీ విచిత్రంగా వుంది. ఐనా నేను వారానికొకసారి వెతుకుతూ వుంటే వాడేం కనిపిస్తాడు. నేనిలా ఎదురు చూస్తున్నానని కలగాదుకద! వాడు ఎప్పటికేనా కనిపిస్తాడనే అనిపిస్తోంది నా కెందుకో!


పరీక్షలయిపోయేయి. నా అన్వేషణకి కూడ తాత్కాలికంగా అంతరాయం కలిగింది. శలవు లన్నీ సరదాగా గడిచిపోయేయి. పరీక్షాఫలితాలు తెలిసినరోజు సంతోషంతోపాటు చిన్న నిరాశ లాంటిది కూడా చోటుచేసుకుందినామనసులో. ఇంక ఉద్యోగాల వేటలో పడాలి. ఎవరి కెక్కడ నీళ్లు ప్రాప్తమో. ఇక 'వాడిని' చూడ్డం పడదేమో - వాడి ఎండిపోతోంది అనుకున్న నా ఆశాలతకి కొత్త చిగుర్లు వేశాయి, నాన్నగారు తెచ్చిన శుభవార్త. నాకు అనకాపల్లిలోనే వుద్యోగం అవబోతోంది. నాన్నగారి స్నేహితుడి ఆఫీసులోనే ఏదో టెంపరరీ వేకెన్సీ వుందిట. నా కోరిక తీరడానికి యీ చిన్న అవకాశం చాలు. 'నా ముఖంలో వెలుగుతున్న సంతోషానికి కారణం ఉద్యోగమే కాదర్రోయ్, ఇంకోటి కూడా వుంది' అని గట్టిగా అరిచి చెప్పాలనిపించింది అందరికీ. కానీ ఇలాంటి విషయాలు ఎంత మంది కర్ధమవుతాయి? పైగా పిచ్చివాడి కింద జమకట్టే ప్రమాదం కూడా వుంది. అందుకని ఆ ప్రయత్నం విరమించుకొని నా సంతోషాన్ని నా గుండెల్లోనే దాచుకున్నాను రహస్యంగా.

నా అనకాపల్లి ప్రయాణానికింక అట్టే వ్యవధిలేదు. అమ్మా, చెల్లాయి కలసి సామాన్లు సర్ది ఇవ్వడంలో మహా యిదై పోతున్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరబోయే మొగపిల్లడూ, కొత్తగా కాపురాని కెళ్లబోతూన్న ఆడపిల్లా ఒకటేనట. ఎవరికి తోచినవి వాళ్లు బోధిస్తున్నారు.

కష్టపడి పనిచేస్తే, యీ వుద్యోగం పెర్మనెంటు అయే అవకాశాలు కూడా వున్నాయట. నాన్నగారు 'ఉద్యోగం—దాని బాధ్యతలు' అనే టాపిక్ మీద అంచె లంచెలుగా ఉపన్యాసమిస్తున్నారు. ఆయన చెప్పే ప్రతిమాటకు భక్తిగా తల వూపుతున్నా కాని నా మనసు దూరంగా ఎక్కడో ఊహాలోకాల్లో తేలుతోంది. యీ సారి 'వాడు' కనబడితే, 'అమ్మా, బాబూ' అంటూ ముష్టెత్తుకోనివ్వకూడదింక. వాడిని ఇంట్లో పెట్టుకుంటే ఆ మాత్రం చిన్న చిన్న పనే వేనా సాయం చేస్తాడు. అమ్మకి కూడా లాంటి వాళ్లని చూస్తే చాల జాలి. అందుకని తప్పకుండా ఒప్పుకుంటుంది. వాడిది క్రకాలు ఐతే మాత్రమేం! మనసు మంచిది. చాలమంది కన్నా చాల ఉన్నతమైన మనసుంది వాడికి. చిన్నప్పుడు వాడి మంచితనం మూలంగా తను పొందిన ఆ మధురమైన క్షణాలు ఏ దుకాణంలోనూ, ఎంత ఖరీదు పెట్టీ కొనలేనివి తను వాడికి ఒక దారంటూ చూపించగలిగితే, అప్పుడు... వాడి కళ్లలో ముందున్న నైరాశ్యమంతా కరిగిపోయి ఆ స్థానంలో భవిష్యత్తుమీది బంగారు కలల నీడలు కదులుతూవుంటే, వాడి చురుకైన చూపుల్లో ఆనందం మెరుస్తూ వుంటే... అప్పుడే, తన మనసుకి తృప్తి. అప్పటికిగాని తాను ఋణ విముక్తుడు కాడు. నా యీ ఆలోచనల తీరు ఎవరికేనా చెప్తే వింతగా, వెర్రిగా అనిపించవచ్చు. కాని నాకుమాత్రం చాల న్యాయంగానూ, సబబుగానూ అనిపిస్తోంది. ఎవరి వెర్రి వాళ్ళకానందం మన ఆనందం మరొకళ్ళకి వెర్రి అనిపించవచ్చు.

'ఇంకా ఏమిటాలోచిస్తున్నావురా? బయలుదేరు. మళ్లీ దుర్ముహూర్తం వచ్చేస్తుంది. ఇంకో అరగంటలో!' అమ్మ కేకలతో ఈలోకంలా కొచ్చి పడ్డాను.

"యీపాటికి బామ్మ వస్తూ వుండాలి కదమ్మా—ఆవిడని రానీ!" మాకు చిన్నప్పటి నుంచీ అమ్మకంటే బామ్మదగ్గరే ఎక్కువ చనువు. ఆవిడ మూడురోజుల క్రితమే పొలం వ్యవహారాలు చూసుకుందుకి స్వగ్రామం వెళ్లింది. ఇవాళ ఎలాగేనా రావలి! మొట్ట



# డాక్టరు సలహాలు

**డాక్టర్ కె. వెంకటేశ్వరరావు**

**టి. వి. — సంతనూతలపాడు**

నా భార్యకు 4 మాసముల క్రితం మెన్సెస్ బ్లీడింగు అధికముగా అవుతూ చాలా రోజులవరకూ ఎక్కువగా వుండేది. మరల ఇప్పుడు 15 రోజుల నుండి ఓవర్ బ్లీడింగు అవుతున్నది. దీనివల్ల ఆవిడకు ఏమైనా ప్రమాదమా? మా వివాహము అయి 1 సం. కూడా అవలేదు. ఇలా వున్నచో సంతానం కలిగే అవకాశము వున్నదా?

ఇలా ఋతు క్రమం ఎక్కువగా అవటాన్ని "మెనొరేజియం" అంటారు. దీనికి కారణాలు చాలా ఉన్నాయి. వీటిని లేడీ డాక్టర్లు పరీక్ష చేసితీర్మానిస్తారు. అలా పరీక్ష చేసి కారణం కనుగొని తగిన చికిత్స చేస్తే — తప్పక పిల్లలు కలిగే అవకాశం ఉంటుంది. (మిగిలినవన్నీ సరిగా ఉంటే)

**డి. ఎస్. ఎస్. — నాగ్‌పూర్**

నాకు 8 సం. లుగా 'హైపర్ ఆసిడిటీ'ఉన్నది. కడుపులో వాయువు, తల తిరగటం, గుండెలలో మంటగా ఉంటున్నది. మాత్రలు వాడితే కొద్దిగా తగ్గుతుంది. భోజనం చేసిన 2 గం. కు మొదలవుతుంది. ఆహారం విషయంలో ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి? ఏ మాత్రలు వాడాలి?

'డుయోడినల్ అల్సర్' అనే ఈ రోగం పలువురిలో కనపడుతున్నది. సకాలానికి ఆహారం తీసుకోకపోవటం, ఆందోళన, ఎక్కువగా పులుపు, కారం, వాడటం— ఈ రోగం రావటానికి కొన్ని ముఖ్య కారణాలు.

భోజనమయిన తరువాత నెప్పి రావటం 'డుయోడినల్ అల్సర్' ఉందని తెలియజేస్తోంది. పైన వ్రాసిన విషయాలలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారంలో కారం, పులుపు తగ్గించాలి. "ఆల్బిట్స్" మాత్రలు పూటకి 2 వంతున, రోజుకి 3 సార్లు 3 నెలలు వాడండి. మరి ఎక్కువగా ఉంటే శస్త్ర చికిత్స శరణ్యం.

**బి. వి. — మహబూబ్‌నగర్**

మా బాబు వయస్సు 1సం. 6 మాసాలు.పుట్టినప్పటి నుండిటెస్టికల్సు క్రింది సంచిలో ఒకటి పైననే వున్నది. ఇంతవరకు అవి సరియైన పొజిషన్ లోకి రాలేదు. డాక్టరుకి చూపిస్తే అవి ఆపరేషను చేసి సరిచేయవచ్చు అన్నారు. ఇంత చిన్న వయస్సులో ఆపరేషన్ అంటే భయముగా వున్నది. వేరే ఏదైనా మార్గము తెలియచేయ ప్రార్థన.

ఇలా 'టెస్టికల్స్" (బీజములు) వాటి స్థానాలకు చేరక పోవటం, ఎంతో మందికి ఏర్పడుతుంది. శిశువు తల్లి గర్భంలో ఉన్నప్పుడు ఇవి శిశువు కడుపులో వుంటాయి. అక్కడినుంచి క్రమంగా పుట్టబోయే ముందు బీజముల సంచిలోకి చేరతాయి ఇల్లా చేరనప్పుడు —"అన్ డిసెండెడ్ టెస్టిస్" అంటారు. 3 వ సంవత్సరంలో ఇలా ఉన్నవారికి చిన్న శస్త్ర చికిత్స ద్వారా వాటిని యథాస్థానానికి చేర్చటం ఉత్తమం.

**బి. ఎ. ఎస్. కె. — ఢిల్లీ**

నాకు 43 సం. లు నాకు ఒకసారి గుండె నొప్పి వచ్చినది. రెండు మూడు సెకండ్లలలో స్పృహ తప్పినట్లు అయినను వైద్యుని ట్రీటుమెంటువల్ల వెంటనే బాగయినది. గవర్నమెంటు ఆస్పటల్‌లో చూపించిన నాళ్లు వారం రోజులు ట్రీటుమెంటు ఇచ్చినారు. రెస్టు తీసుకోమంటున్నారు. ఈ జబ్బుకు తగిన జాగ్రత్తలు తెల్పకోర్తాను.

ఇలా గుండె నెప్పి రావటం హృదయపు కండరములకు రక్త సరఫరా తగ్గటం వల్ల అయివుండవచ్చును. అలా ఒకసారి వచ్చినవారు, ఆహారంలో ఎక్కువ కొవ్వు పదార్థములను తీసుకోవటం తగ్గించాలి. ఆందోళన, ఎక్కువగా కష్టపడటం, మొదలయిన వాటికి తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నెత్తురులోని గ్లూకోజు పరిమాణం, కొలెస్ట్రరాల్. రక్తపుపోటు తరచూ పరీక్ష చేయించుకోవాలి.

**కె. సీత— విజయవాడ.**

మా తమ్ముడికి కొన్ని నెలలుగా 100F డిగ్రీల వరకూ జ్వరము వస్తున్నది. కొన్ని నెలల తరువాత మందులువాడగా తగ్గి తిరిగి అదే విధంగా వస్తున్నది. ఎన్నిమందులు వాడినా గుణం కనిపించటంలేదు. . . .

'హాంటో టెస్టు'— ఛాతీ ఎక్స్‌రే తీయించి చిన్న పిల్లల వైద్య నిపుణులకు చూపించండి. వారు రోగాన్ని నిర్ణయించి వైద్యం చెయ్యగలరు. మెడ మీద గ్లాండ్స్ కూడా వాచి వుండటం వల్ల పైన చెప్పిన టెస్టులు అవసరం. ప్రైమరీ కాంప్లెక్స్, లేక టి. బి. గ్రంథులు ఉన్నప్పుడు ఇలా తరచూ జ్వరం రావటం, ఆకలి లేమి, శరీరం క్షీణించటం జరుగుతుంది. ●

---

# తీరని ఋణం

మొదటిసారి ఉద్యోగమాయే! పెద్దావిడ ఆశీర్వాదం లేకపోతే ఎలా?

బామ్మకోసం వీధి గుమ్మంలో నిల్చుని అసహనంగా చూస్తున్న నాకు, దూరంనుంచి బామ్మరిక్షా చూడగానే దేవుడు దిగొచ్చినట్టు అనిపించింది బామ్మతో చిన్నతమ్ముడుకూడా వెళ్లినట్టున్నాడు. పెద్ద ఘనకార్య మేదో సాధించుకొచ్చినట్టూ రిక్షా దిగేడు. నిండా పదేళ్లు లేనివాడు బామ్మకి పి. ఏ. లాగ, వెనకాలే అంటిపెట్టుకు తిరుగుతాడు. అమ్మ అడుగుతోంది! 'ఇంత ఆలస్య మయిందేమీ, బస్సు లేటా?'

'బామ్మా నీకోసమే ఎదురు చూస్తున్నా, మరి నేవెళ్లిరానా?'అంటూవంగి బామ్మకాళ్లకి దండం పెట్టేను. 'క్షేమంగా వెళ్లిలాభంగా తిరిగిరా నాయినా'అంటూ దీవించింది. అమ్మ అడిగిన దానికి జవాబుగా బామ్మ చెప్తున్న మాటలు గుమ్మం దిగబోతున్న నన్ను మంత్రం వేసినట్టు ఆపేశాయి. 'అనకాపల్లి బస్ స్టాండులో ఎవడో బస్సుకింద పడ్డాడు. వాడ్ను, మరోడూ కలిసి దెబ్బలాడుకున్నారు, ఎవరో పడేసిన పదిపైసల కోసం. ఆ దెబ్బలాటలో పడి వెనక వస్తూన్న బస్సు చూసుకోలేదు— ముష్టివాళ్లకు కూడా ఊరంతకావేషాలు. ఇంతకీ వాడికి ఇవాళతో నూకలు చెల్లిపోయి నట్టున్నాయి! బామ్మమాటలు కర్ణకఠోరంగా వినపడుతున్నాయి 'యిదుగో! యీ వెధవని మరెప్పుడూ నాతో తీసుకెళ్లను! ఆ వచ్చిన వాడి చుట్టూ జనంపోగయినారా! వీడుకూడా ఆ జనంలో జొరబడి ముందుకుపోయి నిల్చున్నాడు. వీడిని వెతికి తీసుకొచ్చేసరికి నా ప్రాణాలు పోయాయంటే నమ్మే! వెళ్లరా వెధవా! ముందు స్నానం చెయ్యి వెళ్లి' తమ్ముడిని తిడుతోంది బామ్మ!

కొన్ని క్షణాలపాటు మనసు మొద్దుబారి పోయింది. జరగకూడనిదేదో జరిగిపోయినట్టూ మనసు శంకిస్తోంది.'లేదు, అలా జరిగివుండదు-అలా జరగడానికి వీల్లేదు-అంతా పట్టిభయమే' అంతరాత్మ సర్ది చెబుతోంది.

స్నానంచేసి తల తుడుచుకుంటూ వచ్చేడు తమ్ముడు.

'ఒరేయ్,నువ్వుచూసేవా వాడిని,అదే.బస్సు కింద పడినవాడిని! ఎలా వున్నాడు' గుండెల్ని అదుపులో పెట్టుకుంటూ వీలయినంత ముద్దుగా అడిగేను. కంగారు పెడితే సరిగా చెప్పడు.

'నేను బాగా చూసేను అన్నయ్యా! మరేం వాడికి ఓ చేతికి ఆరువేళ్లున్నాయి. ఓ కాలు కూడా లేదు. నేను బాగా దగ్గర్నుంచి చూసేను. నిజం!'

'ఐపోయింది–'వాడి'కథపూర్తయిపోయింది. వాడి ఋణం తీర్చుకో లేకపోయాను. అది తీరేదికాదు. ఎలా తీర్చగలను? నాచేతికి ఐదు వేళ్లే. వాడిచేతికో ఆరు వేళ్లున్నాయి... ఆలోచేతికి ఏముక కూడా లేదేమో! ... వాడు ఎవరికీ కనిపించని లోకానికి వెళ్లి పోయేడు'...భోరున ఏడ్చింది నా మనసు! ●

# కలలూ - సంకెలలూ

అవసరాల రామకృష్ణారావు

ఒక్కనిట్టూర్పుతో ముందుకి సాగి, బీచిరోడ్డున నడక ప్రారంభించింది శకుంతల. అలా రెండు ఫర్లాంగులు నడిచిందో లేదో, గింగురుమనే హారన్ తోపాటు సడెన్ బ్రేకుతో స్కూటరొకటి తనపక్కని ఆగడం జరిగింది.

స్కూటర్ మీది పురుషుడి వెనక స్త్రీ ఒక గెంతుగెంతి రెండుచేతులూ పట్టుకుని 'నువ్వటే శకూ'! అనడం జవాబుగా ఈమె 'నువ్వాఇందూ, ఇవాళ ఎంత అదృష్టం!' అనడం ఒక్కనిముషంలో జరిగిపోయాయి.

'ఇది శకుంతలఅని మా స్నేహితురాలండీ! మీరు కాకినాడ పిల్లకి కాకినాడ ముద్దు—అంటూంటారే. అక్కడిసరుకే నేమంతా! నువ్వు మా వార్ని చూడనేలేదుకదు శకూ, అవును, మా పెళ్ళికి వచ్చే తీరికేది తమకి? పేరు శ్రీధర్. ఉద్యోగం కాల్టెక్స్‌లో'

శకుంతల ఇందిర మాటల్ని సరిగా వింటున్నట్టులేదు. మెర్క్యురీస్ట్రీట్ లైట్‌క్రింద ధగాధగా మెరిసిపోయే స్కూటర్ ముందు ఆరోగ్యమూ, ఐశ్వర్యమూ పక్కపక్కని నిలబెట్టినట్టున్న ఆజంటని చూడగానే ఆమె కన్ను తిప్పుకోలేకపోయింది.

'ఏమిటి అలా ఎగాదిగా తెగచూస్తున్నావ్, ఏముంది మాలో?' అని స్నేహితురాలితో అని—మొగుడివైపు తిరిగి అంది ఇందిర.

'మీరలా రామకృష్ణాబీచ్‌దాకా స్కూటర్ మీదవెళ్ళి కేంటిన్‌లో వెయిట్‌చేస్తూ ఉండండి. మేమిలా నడుచుకుంటూ వస్తాం'

'ఏం. నేనుకూడానడిచివస్తే మీ ఏకాంతాని కేమైనా అభ్యంతరంటండీ?' అని శ్రీధర్ అనడం కొత్తదనంతోపాటు కాస్త వెగటుగా కూడా తోచినా — ఆ నడకలో ఠీవి, ఆ తల ఎగరేసి మాట్లాడ్డంలో దర్పం-వాటిని కాదనలేక ఆమోదముద్రగా చిన్ననవ్వు విసిరింది శకుంతల.

'నామటుకు నాకు అభ్యంతరమే' అంది ఇందిర. కాని ఆమాట విని విన్నట్టు శ్రీధర్ ఊరుకుని, వాళ్లతో నడకసాగించాడు.

'అయితే యీ సాయంత్రపువేళ తను ఊరుగాని ఊరులో ఈగారి షికారుకు అంతర్యం?' అంది ఓగడి ఊరుకుని ఇందిర. ఎలా మొదలెడితే బాగుంటుందా అని కాక ఏం చెబితే బాగుంటుందా అన్నట్టు ఆలోచిస్తూ, నడకసాగించింది శకుంతల.

'వినపడిందా నేనడిగింది? తమరి భర్తగారికి తెనాలిలో కదూఉద్యోగం, ఉన్నట్టుండి ఇక్కడికెప్పుడు తరలి వచ్చావని?'

'ఏం నీతో చెప్తేగాని యిక ఎవరూ ఎక్కడికీ రైలెక్కకూడదాయేం?' అన్నభర్తని

'అట్టే తనురు కలుగచేసుకుంటే గాని సంగతులు బయటపడవనీ!' అని అదమాయించి 'మాట్లాడవేమే ముంగిశ్వరీ!' అని స్నేహితురాల్ని మోచేత్తో పొడిచింది ఇందిర.

'చెప్తాను ఒకటీ ఒకటీ, అలా తొందర పడితే ఎలా? మా రేవతిని ఇక్కడే కదూ యిచ్చారు, దాని దగ్గరికే వచ్చాను, రమ్మని చంపేస్తూంటె'


'ఏమిటే, మీ చెల్లికి పెళ్ళైపోయిందా! ఎక్కడ అది పెళ్లి కాకుండా ఉండిపోతుందో అని పాపం మీ అమ్మగారు ఎంత గోలపెట్టేవారో! ఇక్కడే ఉందా తను? మీ మరిదికి ఏం పనిటా?

'రేవతి మొగుడు ఇక్కడే నేవీలో ఉన్నాడు. నెలకి పదిహేనువందల పైనే వస్తుందట.'

ఆ అంకె వినగానే శ్రీధర్ మొహంలో మార్పు కనిపెట్టి మరింత ఉత్సాహంతో చెప్పుకుపోయింది శకుంతల.

'వాళ్ల క్వార్టర్స్ ఎంత బాగున్నాయను కున్నావ్ ఇందూ! ఫుల్ ఎయిర్‌కన్డిషన్డ్. ఓ చీమగాని దోమగాని వెతికినా కనపడదనుకో'

'ఇంట్లో ఓ చీమగాని దోమగాని కనపడితే వచ్చిన పెద్దనష్టమేమిటి గాని వాళ్లి





హనీమూన్‌కి తిరపతి వెళ్దాం అని మటుకు మొక్కుకోకు డియర్ !

అక్కడనుండి గుండుతో తిరగాలి నేను నీవెనక !

ద్దా మా సరదాగా కలివిడిగా ఉంటారా ఉండరా. ముందది చెప్పు.' అన్న ఇందిర మాటలకి నవ్వి—

'అయితే వాళ్ల కబుర్లేగాని మా కబుర్లు అక్కర్లేదన్నమాట !' అంది శకుంతల.

'అవునవును, అలా అడగండి' అని అందిం చాడు శ్రీధర్.

'ఏదీ నీ నోటవెంట ఓ పట్టాన ఊడి పడందే !'

'ఏదో మా మరిది హోదాకయితే అందుకో లేకపోవచ్చుగాని ఈమధ్య మా పనీ మెరుగ్గానే ఉందే ఇందూ ... ఎదుగూ పొదుగూ లేని ఆయనగారి ఉద్యోగానికి అహోరాత్రాలు పోరాడి తిలోదకాలు యిప్పించాను. రెండేళ్లైందనుకుంటాను, అక్కడే ఫేన్సీ షాపు పెట్టేరు. మొదట్లో కొంచెం భయ పడ్డాంగాని ఏడాదైై నిలదొక్కుకుంది. నిల దొక్కుకోడమేమిటిలే, నీతో చెప్పకేం, లాభాలు బాగానేఉన్నాయి. మరి నా బంగారం అంతా కొట్టుమీద పెట్టెయ్యబట్టే గదా యిలా బోసిమెడతో మిగిలాను! ఇక్కడే షాపులో మంచి రకాలు దొరుకుతాయని చెక్కిచ్చి పంపేరు ఆయన. నేనిలా పిల్లల్ని యింట్లో వదిలేసి అప్పుటికప్పుడు బయల్దేరి రాడానికి యిదికూడా ఓ కారణం అనుకో'

'ఎన్ని రూపాయలి కిచ్చారండీ చెక్కూ ?' అడిగాడు శ్రీధర్ ఆతృతగా ...'

'ఏదో యిచ్చారుగాని, పదివేలకి యిప్పుడే మంత బంగారం వస్తుంది గనక !' అని చప్పరించింది శకుంతల.

'పోన్లే మొదట్లో చికాకులుపడ్డా మీవాళ్ల

## కలలూ — సంకెలలూ

యిప్పటికేనా ఎత్తిరిల్లారన్నమాట. పాపం ఈ ముసలి కాలంలో మీ అమ్మగారికీ నాన్న గారికీ కొంత మనశ్శాంతి' అంది ఇందిర.

ఓ అరగంట బీచిలో కూచుని అవీ యివీ చెప్పుకుని వాళ్లు ముగ్గురూ కేంటీన్ చేరు కున్నారు. శ్రీధర్ ఐస్‌క్రీమ్ ఇప్పించాడు.

'పదమూడో నెంబరు బస్సు ఎక్కి ద్వారకానగర్ స్టాప్ దగ్గిర దిగిపోండి. అక్క డికి స్టేట్‌బ్యాంక్ దగ్గిరే. ఎవర్నడిగినా చెబు తారు. దానికి రెండిళ్లవతల ఉన్న పోకచెట్ల యింట్లో మేడమీద వాటామాది. ఇంకా ఉంటారుగా, ఎప్పుడేనా రండి, అని ఆహ్వానిం చాడు శ్రీధర్.

'ఎప్పుడో ఏమిటి, సంసారాన్ని ఒదిలి వచ్చింది,ఏక్షణాన్న వైరొచ్చినా అది రైలెక్క వలసిందే... రేప్పొద్దుటే వచ్చెయ్యవే శకూ... అన్నట్టు మీ రేవతిని కూడా తీసుకు రావే... ఎన్నాళ్లైందో మనం ముగ్గురం మళ్లీ కలుసుకుని !'

ఏం చెప్పి తప్పించుకుందామా అని శకుం తల కంగారు పడుతూండగా శ్రీధర్ ఆమెకా బాధలేకుండా చేశాడు.

'ఏం మనిషండీ బాబూ మీ ఫ్రెండు, అప్పుడు మీ రెలా వేగేవారో గాని ఇంత మంద మతితో గడుపుకు రాడం నా దుంప తెగుతోం దనుకోండి'

శకుంతల 'ఏం?' అన్నట్టూ ఇందిర 'ఏం ఎలా ఉందేం!' అన్నట్టు ఒకేసారి శ్రీధర్ వైపు చూశారు. అతని జవాబు ఇదీ:

'ఆదివారం రాత్రి మా స్నేహితుడి చెల్లెలికి సింహాచలం కొండమీద పెళ్లండీ. రేపు మాకు హాఫ్‌డే కదా... ఆఫీసునుంచి వస్తూనే ఏ నాలుగ్గంటలకో స్కూటర్ మీద

### నిజాయితీ

అమెరికాలోని హనోవర్‌లో ఒకావిడ ఒక పుస్తకాన్ని యీ మధ్యనే లైబ్రరీకి తిరిగి యిచ్చివేసిందట. ఈ పుస్తకాన్ని ఈవిడ బంధువు ఒకరు 1907లో లైబ్రరీ నుంచి తీసుకున్నాట్ట. ఆయన మరణా నంతరం యీ పుస్తకం బయటపడిందట. ఈ పుస్తకంలో 106 పేజీలు ఉన్నాయట. "ఒక్కొక్క పేజీ 231 రోజులపాటు చదివినా ఎన్నేళ్ళు పట్టుదు" అని లైబ్రే రియన్ వ్యాఖ్యానించాట్ట !

వెళ్లిపోతున్నాము. తిరిగి సోమవారం రాత్రికి వాడు వదుల్తే అదే గొప్ప. మీరు మంగళ వారం దాకా ఉండలేరూ?'

'ఎందుకు ఉండలేదూ ? ఉండలేనని మీతో చెప్పిందా ఏం ? వచ్చి వారం రోజులు తిష్ఠవేసిగాని వెళ్లకే శకూ' అంది ఇందిర.

'ఈ సారి వచ్చినప్పుడు అలాగే... ఇప్పటికి మాత్రం నన్ను వదిలెయ్యి... ఎల్లుండి మెయిలుకి అప్పుడే నాకు బెర్తు రిజర్వ్ అయి పోయింది'ఉన్నట్టుండి ఇందిర లేచినిలబడింది.

'ఇప్పుడే వస్తాం. మరోలా అనుకోకు... చిన్న కబురుంది'అని మొగుడు చెయ్యి పట్టు కుని దూరంగా తీసికెళిపోతున్న ఇందిర్ని చూసి నిర్ఘాంత పోయింది శకుంతల.

అనుకున్నంత తొందరగా రాలేదు వాళ్లు. ఏదో ఘర్షణ పడినట్టు స్పష్టంగా తెలు స్తూనే ఉంది. లేని నవ్వు తెచ్చి పెట్టుకుని శ్రీధర్ అన్నాడు:

'దీనోస్తు మీ చిన్నప్పుడు ఎలా పడేవారో ఏమిటో... ఈ చిన్నవిషయానికి వేరే తీసు కెళ్లాలా ? మీరు కాబట్టి సరిపోయింది కాని యింకోరయితే ఏమనుకుంటారు ! మా ఫ్రెండు చెల్లెలికి ఏమిస్తే బాగుంటుందని... వెండి గంధపు గిన్నె యిస్తే బాగుంటుందని... నేనూ, అలా కాదు చీర పెడదామని తనూ... ఆఖరికి తన మాటే నెగ్గించుకుందనుకోండి, ఆడాళ్లకి లోబడిపోయాక తప్పుతుందా మరి ! ఈఊళ్ళో తొందరగా షాపులుమూసేస్తారు— పైగా యీ పవర్‌కట్ ఒకటీ, చస్తున్నాం! చెప్పాలంటే అసలు మేం బయలు దేరిందే అందుకు...అన్నట్టు మీరొక్కరూ ఎలా వెడ తారు అంతదూరం?'

'బాగుంది ! నన్నిక్కడ డ్రాప్ చేసి కదా అతను మార్కెట్‌కి వెళ్లింది. ఇంక అరగంట లోగా మా మరిది కారులో రాడూ ?'

'అయితే బాధ లేదులెండి. మరి మేం వెడతాము. మీరు ఎలాగైనా రెండు రోజులు మా యింట్లో గడిపి మరీ వెళ్లమని మా కోరిక. మీరేమో కుదరదు పొమ్మంటున్నారు. అలా అంటే ఎలా ? ఆలోచించండి.'

మొగుడి వెనకే స్కూటర్‌ఎక్కి కూచుంది. ఇందిర. వాళ్లా కనుమాపుమేర దాటి పోయాక నర్సింగ్‌హోమ్ వైపు నడక సాగిం చింది శకుంతల. ఆలోచించిచూస్తే ఎప్పట్లా ఉన్న ఇందిర చిలిపితనం, పెంకితనం కాక ఇంకేదో అతి బలమైనది — వాళ్లిద్దర్నీ ఆవ


# కలలూ — సంకెలలూ

రించి ఉన్నది — తనని తీవ్రంగా అటువైపు ఆకర్షిస్తోంది. పైపై చూపులకే యింతగా భోగభాగ్యాలతో తులతూగుతున్నారే, యిక వీళ్లున్న యిల్లు ఎలా వుంటుందో! ఆ కోరిక అధిగమించలేక ఎలాగో వీలు చూసుకుని మర్నాడు మధ్యాహ్నానికి శ్రీధర్ ఇంటికి వెళ్లింది శకుంతల.

‘మీరా, రండి, రండి! ఇల్లు సుళువుగా తెలిసిందా?’ అంటూ ఆహ్వానించాడు అతను.

‘ఎలాగా రేపు వెళ్లిపోతాను. మళ్లీ ఎన్నాళ్లకో...! నిన్న మా ఇందుతో ఏమీ గడిపినట్టే అవలేదు. మరోసారి చూడందే ఉండబట్టలేదు నా ప్రాణానికి. మీరు నాలుగికిగాని బయల్దేరమన్నారుగా!’

‘పోన్లెండి మంచి పని చేశారు. తనూ




గోలపెడుతూనే ఉంది. తీరా ప్రాణ స్నేహితుడు, మాట ఇచ్చాం, ఎలా కాదనడం చెప్పండి?’

‘మీరు ప్రయాణపు హడావిడిలో ఉన్నారో ఏమిటో!’

‘ఫరవాలేదులెండి. మరేం దూరంకాదుగా, ఓ సూట్‌కేస్ తీసికెడితే సరిపోతుంది.’

‘ఇందు ఏదీ?’

‘అదా? ఇంట్లోలేదండీ!’

‘ఎక్కడకెళ్లిందీ?’

‘చెప్తాను... వినండి మరి...’ అంటూ టీనివ్వు తెచ్చిపెట్టుకుని శ్రీధర్ ఆరంభించాడు.

‘ఏమిటో ఇంతదూరం మీారు అభిమానపడి వచ్చినందుకు అది లేకపోడం... ఏదో శాపంలా ఉంది... రాత్రి పట్టుపట్టి ఆ చీర తెచ్చిందా. విప్పి చూసేసరికి అక్కడక్కడ యింతింత తూట్లు. ఆ షాపువాడి మొహాన్ని కొడదామని యిప్పుడే వెళ్లింది. మరోటి తీసుకుని అక్కడే ఉంటుంది. నేను యిల్లు తాళం వేసుకుని స్కూటర్‌మీద బయలుదేరి దాన్ని షాపులో పికప్ చేస్తాను. అయ్యో లేచి పోయేరేం, కూచోండి. ఫ్లాస్కులో కాఫీ ఉంది, ఇస్తానుండండి. అంత మొహమాటమయితే ఎలా? మీ ఫ్రెండేగాని ఫ్రెండు యిల్లు ఓమారు చూడరాదా యేం?’

నిజానికి శకుంతల వచ్చింది ఆ ముచ్చట తీర్చుకుందామనే. ఆ మేడమీది మూడు గదులూ చూడగానే అందులో సామానుల వివరణ అతను చెప్పింది వినగానే — యింకా మతి అనేది ఏమైనాఉంటే అది కాస్తా ఊడిపోయినట్టయింది.

మరో పావుగంటకి ఆ యిల్లు దాటి, ఆ వీధి మలుపుతిరిగి, వంద గజాలు సిటీబస్ స్టాప్‌వైపు నడిచింది శకుంతల.

ఎవరో చప్పట్లుకొట్టి తన పేరుపెట్టి పిలిచినట్లై వెనక్కుతిరిగి చూసింది. దూరంగా ఇందిర! పక్కని సంచీనిండా కూరలు పట్టుకుని ఓ కుర్రాడు! వాడికేదో చెప్పి అలాగేవంపేసి ఇంచుమించు పరిగెత్తుకు వచ్చి శకుంతల రెండుచేతులూ పట్టుకుంది ఇందిర.

‘చిన్నప్పుడు అమ్మ వద్దని ముందుగా చెప్పినా సినిమాకి చెక్కేసేదాన్ని. తిరిగివచ్చాక వీపు బద్దలైపోయేదనుకో ... నాలుగుదెబ్బలు తింటే ఏంనష్టం, సినిమాచూసిన ఆనందాన్ని అమ్మ వెనక్కి తీసేసుకోలేదుగదా! ఇవాళా అలాగే చేయదల్చుకున్నాను, నేను ఇంతతొందర్లో ముసల్దాన్నయిపోడం నాకే కష్టంగా ఉంది... పద పద’

తెల్లబోయి చూస్తున్న శకుంతల్ని చెయ్యిపట్టుకు లాగినంత పనిచేస్తూ మళ్లీ అంది ఇందిర ...

‘పద...పద...ఇంకా చూస్తావేం? సిటీ బస్సు అందుకుని ఎల్లమ్మతోట జంక్షన్లోదిగిపోయి సింధియావైపు వెళ్లే మరో బస్సు ఏదందుకున్నా నేవల్‌బేస్ చేరుస్తుంది. ఈ రాత్రికి నీతోపాటు నేనూ రేవతిఇంట్లోనే...’

శకుంతల ఏదో చెప్పబోతే నోరెత్తనివ్వలేదు.

‘మొగుడిలో ఫ్రెండ్‌ని చూద్దామని యిన్నాళ్ళూ ఎంతో ట్రైచేసి ఫెయిలయ్యాను నేను. ఆఖరికి ఎన్నాళ్లకో దొరికిన ఫ్రెండ్‌వి కదా అని నిన్నుచూసి ముచ్చట పడదామనుకుంటే నువ్వుకూడా మొగుడిలాతయారయ్యావెమిటే శకూ!’

ఇద్దరూ బస్‌స్టాప్ చేరుకున్నారు. ఆఎండవేళ అక్కడ వాళ్లిద్దరూ తప్ప మరెవ్వరూ లేరు. ఉన్నా ఇందిర లక్ష్యపెట్టేది కాదేమో!

‘నిన్నసాయంకాలం నిన్నుచూసి చూడగానే నామనసు తిన్నగా ఎక్కడికి వెళ్లిపోయిందో తెలుసా! మన కాకినాడకి. ఇంచుమించు ఒకే యీడు వాళ్లమైన నువ్వూ నేనూ రేవతీ— అక్కడ ఎన్నెన్ని ఆటలు ఆడుకునే వాళ్లమో— పదేళ్లు అయిపోతే యేంగాక, నిన్నా మొన్నా జరిగినట్టుంది నాకు. అన్నిటికన్న మనం మనసుపడి ఆడుకునే పండుగొకటి ఉంది గుర్తుంది కదూ! ఆడపిల్లల కలల తేనియ, అట్లతదియ! ముందురోజు నుంచే ఎన్ని ఏర్పాట్లు. ఎంతహడావిడి! పదిమందిసిపాయిల పొడుపుకథ నీకు గుర్తుందీ? రాత్రిపూట ఆకుపచ్చ టోపీలలో బంధింపబడి పడుకుంటారు, తెల్లారేసరికి పోలీసులుగా మారిపోతారు! జ్ఞాపకం వచ్చిందా? ఇంతకీ ఒక్కవేళ్లకేనా ఆ గోరింటాకు ముస్తాబు! అరచేతినిండా గుండ్రంగా చీపురుపుల్లలతో చుక్కలు. మధ్య అమర్చిన గుండ్రని చందమామకి కానుకగా, మచ్చగా, లోపల ఓ బంతి ఆకు.

(31 వ పేజీ చూడండి)

## సీరియల్

# అహం - అనురాగం

### జి. పరిమళా సోమేశ్వర్

*(గత సంచిక తరువాయి)*

''ఆ దుర్మార్గుడు మన యింటికి ఎందుకు వచ్చేడో అర్థమయిందా? నా భర్త ఉద్యోగం సద్యోగం లేనివాడనీ తనవంటి పెద్ద ఆఫీసర్‌ని పెళ్లి చేసుకోనందుకు తగిన శాస్తి జరిగిందనీ నాకు గుర్తు చెయ్యటానికే అతనిక్కడకు వచ్చేడు'' అంది వెక్కుతూ శ్యామల.

''దానికి నువ్వు అంత ఉద్రేకం తెచ్చుకోవలసిన అవసరమేమిటో నాకర్థం కావటంలేదు. అతనన్న దాంట్లో తప్పేం లేదు. అతనేమన్నా తప్పు చేసేడంటే అది నీ మనసులో వున్న మాటను తన నోటితో బయటపెట్టటమే!''

''అంటే ?''

''ఇంకా వివరంగా ఏం చెప్పను శ్యామలా ? నీ భర్త ఉద్యోగం సద్యోగం లేనివాడన్న బాధ నీలో లేదా ? చంద్రని అనవసరంగా తిరస్కరించేనే అన్న పశ్చాత్తాపం నీలో లేదా ? ఆ మాటలే అతనంటే నీకెందుకంత కోపం ?''

''రవీ ! ఏమిటా మాటలు ? నువ్వు ... నువ్వుకూడా నన్నింత హింసపెడ్తావనుకోలేదు. నీలో యింత కాఠిన్యం ఎక్కడినుండి వచ్చింది రవీ ? నేను నీకేం అన్యాయం చేసేనని నన్నిలా బాధ పెడ్తావు ?'' అంటూ ఏడ్చింది శ్యామల.

''శ్యామలా ! ఊరికే ఏడిచి ఆరోగ్యం పాడుచేసుకోకు. కన్నీళ్లు చాలా విలువైనవి శ్యామలా! వాటిని వృథా చేసుకోకు.'' అంటూ అక్కడనుండి లేచిపోయేడు రవి.

రవి యీమధ్య ఒక నవల వ్రాయటం ప్రారంభించేడు. ఒక నవల వ్రాసిన రచయితకు వచ్చే పేరు ప్రతిష్టలలో సగంకూడా వంద కథలు వ్రాసిన రచయితకు రావని అనుభవపూర్వకంగా తెలుసుకున్న రవి ఎలాగైనా ఒక నవలను వ్రాసి తీరాలి అన్న పట్టుదలతో వ్రాయటం మొదలెట్టేడు. నవలను వ్రాస్తున్న రోజుల్లోనే అతనికి కొందరు రచయితలతో పరిచయమయింది.

అందులో ఒకాయన పేరు సుందర రామయ్య. సుందర రామయ్య రచనలను రవి ఎప్పుడో తన చిన్నతనంలో చదివేడు. మధ్య తరగతి కుటుంబాలలోని ఆర్థిక బాధలు, వాళ్లకు వచ్చే కష్టాలు, కలహాలు అన్నీ సవిస్తరంగా వ్రాసేవాడు. ఇప్పుడాయన రచనలు తనకి నచ్చకపోవచ్చుకాని ఆ రోజుల్లో – అచ్చులో ఉన్న ప్రతి అక్షరాన్నీ ఆసక్తిగా చదివే వయసులో ఆయన పేరును మాత్రం బాగా గుర్తుంచుకున్నాడు.

ఈ రోజుల్లో తెలుగు దేశంలోని ప్రతి ముగ్గురు పాఠకుల నుండీ ఒక రచయిత పుట్టుకు వస్తున్నాడు కాని తను స్కూల్లో చదువుకుంటున్న రోజుల్లో విద్యావంతులకు చదవాలన్న కోరిక ఉన్నంత గొప్పగా వ్రాయాలన్న కోరిక ఉండేదికాదు. మంది ఎక్కువయితే మజ్జిగ పలచన అన్నట్లు అందరూ వ్రాసేవాళ్లే అయేసరికి రచనా స్థాయికూడా అంతకంతకూ దిగజారిపోతోంది యిప్పుడు.

ఆ రోజుల్లో ఎన్ని పత్రికలున్నా ప్రఖ్యాత రచయిత లనబడేవాళ్లు పది పదిహేను మందికి మించి ఉండేవారు కాదు. ఏ పత్రికలో చూసినా ఆ పది మంది కథలే ప్రత్యక్ష మవుతూండేవి. ఒక రకంగా రచయితల సంఖ్య పెరగటంవల్ల వెరైటీ కూడా సాహిత్యంలో ఉంటుందని ఆశించవచ్చు. కాని ఎంత మంది వ్రాసినా ఒకే యితివృత్తాన్ని కొద్ది మార్పులతో వ్రాస్తున్నారు తప్ప నూతన కోణాలలో ఆలోచించే శక్తి తెలుగు రచయితలలో ఉండటంలేదు.

తెలుగు నవలలకీ తెలుగు సినిమాలకీ ఎంతో పోలిక ఉంది. ఏ రచయితైనా కాస్త కొత్త థీము తీసుకుని ప్రజాదరణ పొందేడంటే యింక అదే ఫక్కీలో వందలాది నవలలు ఒక్క సంవత్సరంలో వచ్చిపడతయ్. తెలుగు సినిమా కనుక ఒకటి విజయవంతమైనదంటే ఐదారేళ్లవరకు అదే సినిమా నటీ నటులలోను, కథా గమనంలోను చేయబడిన కొద్దిపాటి మార్పులతో మరల మరల ప్రేక్షక లోకానికి అందివ్వబడుతూ ఉంటుంది.

ఇప్పుడు సాంసారిక సమస్యలను చిత్రిస్తూవచ్చిన రచనలు వందల సంఖ్యలో వస్తున్నయ్ కాని ఆ రోజుల్లో సుందర రామయ్య నవలా రచన ప్రారంభించిన దినాలలో ఆ రకమైన నవలలు తెలుగు సాహిత్యానికి కొత్తనే చెప్పవచ్చు. అందుకే మిగతా పాఠకులందరిలానే రవికూడా ఆ రచనలను కొంతవరకు అభిమానించేవాడు.

కాని పది పన్నెండేళ్లుగా ఎక్కడా అతని రచనలే కనపట్టంలేదేమా యేం ఆయన యిన్నాళ్లూ అజ్ఞాతవాసంలో ఎందుకు ఉన్నాడా అని ఆశ్చర్యపోయేడు రవి.

వాళ్లవల్లా వీళ్లవల్లా అతనికి తెలిసింది ఏమిటంటే సుందరామయ్య యిప్పుడు రచనావ్యాసంగాన్ని రాజకీయాల్లాగా మార్చుకున్నాడుట. అంతేకాదు. అసలైన రాజకీయాల్లోకి ప్రవేశించటానికి సాహిత్యాన్ని ఒక సాధనంగా కూడా మార్చుకున్నాడట.

> **జరిగిన కథ 9 :** స్త్రీల కళాశాల లెక్చెరర్ శ్యామల, విద్యార్థినులతో నెహ్రూ జూలాజికల్ పార్కుకు వెళ్లివచ్చి, అక్కడ తనను ప్రమాదం నుంచి కాపాడిన వ్యక్తి బి ఎ. తప్పిన పేద నిరుద్యోగని అతనిద్వారా తెలుసుకుంటుంది. చంద్రను పెళ్లి చేసుకోవటానికి కూతురు శ్యామల నిరాకరించగా దిగులుతో ఆరోగ్యం చెడి మరణిస్తారు వెంకటేశ్వరరావుగారు. చంద్ర హెచ్చరిక లెక్కచేయక రవినే వివాహం చేసుకుంటుంది శ్యామల. ఇతరుల సూటీపోటీ మాటలవల్ల మనస్తాపం చెందిన శ్యామల వత్తిడితో అయిష్టంగా బి. ఏ. పరీక్షకు కట్టి తప్పుతాడు రవి. తను పనిచేస్తున్న కంపెనీలో రిట్రెంచిమెంటువల్ల వుద్యోగం పోయి మానసికంగా దిగజారిపోతాడు రవి.

ఎలాగంటే ''కళానికేతన్'' ''కళావని'' ''కళారాధన'' ''కళారంగం'' వగైరా పేర్లతో దాదాపు పది సంస్థలను తానే స్థాపించి నామ మాత్రంగా ప్రతిసంస్థలోనూ పదీ పరకా సభ్యులను చేర్చుకున్నాడు. అందులో కొన్ని గురుసంస్థలు. మరి కొన్ని చిరుసంస్థలు. కొన్నిసంస్థలకు ప్రసిడెంటుగాను, కొన్ని సంస్థలకు సెక్రటరీగాను, కొన్ని సంస్థలకు గౌరవనీయ డైరక్టరుగాను, కొన్ని సంస్థలకు గౌరవనీయ డిప్యూటీ డైరక్టరుగాను తననుతానే నియమించుకున్నాడు. ఇన్ని తంటాలు పడటానికి కారణం అతనికి 'ఫలానా సంఖ్య' లోని సాహితీ సంస్థలతోను, కళాసంస్థలతోను సంబంధముందని పదవిలోఉన్న పెద్దమనుషులకు తెలియబరచటానికే!

తనకి వ్రాసేఓపిక, తీరిక లేకపోవటంతో ఎక్కడా అచ్చుకాని రచయితల గ్రంథాలను అడిగి తీసుకుని అచ్చువేయించే నిమిత్తం ఒక ప్రెస్సుని కూడా కొన్నాడు. అలా తాను అచ్చువేయించిన గ్రంథాలకు స్వయంగా తానే ఒకసభ ఏర్పాటుచేసి ఏ మంత్రిచేతనో డిప్యూటీ మంత్రిచేతనో ప్రారంభోత్సవం చేయించేవాడు. అలా సాహిత్యానికీ రాజకీయాలకీ మధ్య ఒక నిచ్చెనవేసి ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ, అడపాదడపా క్రిందికి జారుతూ మళ్లీ పైకెగ్రాకుతూ కాలక్షేపం చేస్తున్నాడు. ఎప్పుడో ఒకప్పుడు గవర్నర్ నామినేట్ చేసే ఎమ్మెల్సీల లిస్టులో తన పేరును ఎవరో ఒకరు సూచించక పోరనీ, కొన్నాళ్లు ఎమ్మెల్సీ పదవి ఆపైన ఛాన్సు ఉంటే మంత్రిగిరిని కూడా పొందవచ్చునని ఆయన ఆశ.

మరొక రచయిత పేరు నరసింహారావు. ఆయనను చూడగానే ఎవరికైనా కీర్తిని సుష్టుగా భుజించిన సంతృప్తి ఆయన ముఖంలో కనపడక మానదు. ఒక సంవత్సరం ఆయనకు ఉత్తమ కవిత్వానికి అకాడమీ బహుమతి లభించటంతో ఆయన కవిగా తన జన్మ సార్థకత చెందినట్లే భావించి ఇంక మళ్లీ వ్రాయటం మానివేసేడు. అకాడమీ బహుమతిని పొందిన తరువాత తను ఏమి వ్రాసినా, వ్రాయకపోయినా ప్రజలు పట్టించుకోరనీ, తెలుగు సాహిత్యంలో తన పేరు చిరస్థాయిగా నిల్చిపోతుందనీ ఆయన నమ్మకం.

కవిగా తన జన్మ సార్థకత అయిందని గ్రహించిన తరువాత వ్యక్తిగా కూడా జన్మ సార్థకత చేసుకునే నిమిత్తం ఆయన మూడుసార్లు వివాహం చేసుకున్నాడు. మొట్టమొదట ఎప్పుడో చిన్నతనంలో బాల్య వివాహాలు అమలులో ఉన్న కాలంలో అతనికి పదహారేళ్ల వయసుండగా ఎనిమిది సంవత్సరాల అమ్మాయి నిచ్చి తల్లిదండ్రులు అతనికి వివాహం చేసేరు. తల్లి తండ్రులు చేసిన ఆ వివాహాన్ని పదిహేను సంవత్సరాలకంటె ఎక్కువ కాలం నిలుపుకోలేకపోయేడు ఆ రసిక చక్రవర్తి. అందువల్ల భార్యని, ఐదుగురు పిల్లలనీ ఆమె పుట్టినింట్లోనే వదిలి అద్భుతమైన అందం గల ఒక బాలికను బంధువర్గంలో నుండి ఏరికోరి లేవనెత్తుకు వచ్చి గుళ్లో

పెళ్లి చేసుకున్నాడు. ఆ అందాన్ని పది సంవత్సరాల పాటు అనుభవించి ముగ్గురు పిల్లల్ని కని మొహం మొత్తేసరికి చివరికి ఆమెనుకూడా వదిలి అష్టైశ్వర్యాలతో తులతూగే ఒక జమీందారు వంశంలోని స్త్రీని వివాహ మాడేడు.

అలా తల్లిదండ్రుల కోసం ఒకసారి, అందం కోసం ఒకసారి, ఐశ్వర్యంకోసం ఒకసారి — ముచ్చటగా మూడుసార్లు పెళ్లి చేసుకుని ఎంతో జీవితానుభవం, సౌందర్యానుభవం గడించిన నరసింహారావు యిప్పుడు ఏభయ్యో పడిలోకి ప్రవేశించేడు. వయసు మళ్లినా అతనిలోని వ్యామోహం మాత్రం చెక్కుచెదరలేదు. ఇప్పటికీ కొత్త పెళ్లికొడుకులా కులుకుతూ "ఛాన్సు తగిలితే నాల్గవ పెళ్లికి కూడా సిద్ధం సుమా!" అన్నట్లు కనపడతాడు.

రవికి ఆశ్చర్యం వేసిన విషయం యేమిటంటే నరసింహారావు తను చేసిన యీ నిర్వాకపు పనులకు సిగ్గుపడినట్లు కనపడేవాడు కాదు సరికదా పైపెచ్చు ఎంతో గర్వపడుతున్నట్లు కూడా కనపడేవాడు. తోటి రచయితలు కూడా చాలామంది అతని "అదృష్టాన్ని" చూసి అసూయ పడేవాళ్లే తప్ప "ఇది తప్పు పని. ఇలా చెయ్యకూడదు." అని ఎవ్వరూ అతనికి సలహా యిచ్చేవాళ్లు కాదు. అదంతా చూసేక శీలవంతులుగా భావింపబడే పురుషులలో చాలామంది ఎంతో నీచులనీ, కేవలం సమాజానికో, నీతికో వెరచి మాత్రమే పైకి సచ్చీలురుగా కనపడతారనీ రవి భావించేడు.

మరొక రచయిత పేరు "విప్లవం"."విప్లవం" అనేది అతని కలం పేరు. అతని అసలు పేరు ఏమిటో ఎవరికీ తెలియదు. అతనెప్పుడూ విప్లవాన్ని గురించే కవిత్వం వ్రాస్తాడు. అందులో తప్పేం కనపడలేదుగాని అసలు విప్లవ ధోరణిలో వ్రాసే కవిత్వమే కవిత్వం అనీ యితరమైన యితివృత్తాలేవీ కవిత్వానికి అర్హము కావనీ అంటే మాత్రం రవికి అంతగా రుచించేది కాదు. "కొట్టండి. నరకండి. చంపండి" అంటేనే కవిత్వం లేకపోతే అది "పైత్యం" అనే విప్లవం ధోరణితో రవి ఏకీభవించలేకపోయేడు.

నేడు సమాజంలో అన్ని రంగాలలోను తిరుగుబాటు ధోరణి కనపడుతోంది. నిజమే! ప్రస్తుతం అమలులో ఉన్న వ్యవస్థనంతటినీ కూలద్రోసి ఒక నవ సమాజాన్ని నిర్మించాలన్న కోరిక ప్రగతిశీలురైన యువకులు చాలామంది ప్రకటిస్తున్న మాట వాస్తవం. దీనికి సాయుధ పోరాటమే శరణ్యం అని భావిస్తున్నవారి సంఖ్య కూడా అధికంగానే ఉంది.

ఐతే యిది సమాజంలో వినబడుతున్న అనేక ధోరణులలో ఒకటి మాత్రమే! అంతేకాదు. కేవలం నినాదాలను చిత్రించటమే సాహిత్యం యొక్క ప్రయోజనం అని అనుకోడు రవి. వివిధ రకాల సాహిత్యపు పోకడలలో అదికూడా ఒకటి. సమాజంలోని వివిధ భాగాలలో ఉన్న వివిధ ప్రజల మనస్తత్వాలను, వారి సమస్యలను, జీవన విధానాన్ని ప్రతి రచయితా తనకు ఆయా భాగాలతో గల సంబంధాన్నిబట్టి పరిచయాన్ని బట్టి, తనకి వారియెడల గల సానుభూతిని బట్టి వ్రాయాలి. అలా కాకుండా ప్రతి రచయితా తాను వ్రాసిన ధోరణిలోనే మిగతా రచయిత లందరూ వ్రాయాలనుకోవటం, తనలాగా వ్రాయనివారు అసలు రచయితలే కాదనటం తెలివి తక్కువ. "విప్లవం" యొక్క అభిప్రాయాల కనుగుణంగా రచయితలందరూ వ్రాయటం మొదలెట్టేరంటే ఒకప్పుడు ప్రేమ సాహిత్యంతోను, ఆ తరువాత సాంసారిక సాహిత్యంతోనూ విసుగెత్తిన పాఠకులు యీ విప్లవ సాహిత్యానికి కూడా విముఖులు కాక తప్పరు.

అంతేకాదు, సాహిత్యం అనేది ఏ సమస్యలనైనా కళాత్మకంగా చిత్రించే సాధనం, "కళ" అనగానే అందులో వాస్తవికతకు తోడు కల్పన, నగ్నతకు తోడు కొంత సౌందర్యం కూడా ఉండాలి. అప్పుడే సాహిత్యానికి సమగ్రత అబ్బుతుంది. ప్రచారంకోసం నినాదాలకోసం సృష్టించబడిన సాహిత్యం తాత్కాలికంగా కొంత ప్రయోజనాన్ని సాధించినా విశ్వజనీనత లేని యితివృత్త మయినప్పుడు అది అనతి కాలంలోనే అడుగంటిపోయే ప్రమాదం ఉంది.

ఈ అభిప్రాయాలను రవి వెల్లడి చేసినపుడు "విప్లవం" కి చాలా కోపం వచ్చింది.

"అంటే యేమిటి మీ ఉద్దేశ్యం? రచయిత తన చుట్టూ ఉన్న సమాజంలోని సమస్యలన్నిటినీ చూడకుండా కళ్లు మూసుకుని తన యిష్టం వచ్చిన యితివృత్తాలను తీసుకుని వ్రాసుకుపోవాలనా మీ అభిప్రాయం? సమాజంలోని లోపాలని ఎత్తి చూపి, వీటికి పరిష్కార మార్గాలను చూపటం రచయిత యొక్క బాధ్యత కాదా?" అనడిగాడు.

"సమాజంలోని సమస్యలకు రచయిత దూరంగా ఉండాలని నేననటంలేదు, కాని ఆ సమస్యలను అర్థం చేసుకునే విధంలో దానికి చూపే పరిష్కార మార్గాలలోను బేధాభిప్రాయాలుండవచ్చు. అంతేకాదు, సమస్యలనేవి రచయిత యొక్క సంస్కారాన్ని బట్టి, విద్యా సంపదని బట్టి, పుట్టి పెరిగిన పరిస్థితులను బట్టి ఒక్కొకరికి ఒక్కొవిధంగా 'అప్పీల్' అవ వచ్చును. మీరు వ్రాసేది కవిత్వం కాదని నేననను. మీరు వ్రాసినట్లు యితరులు వ్రాయనంత మాత్రాన వాళ్లది కవిత్వం కాదు అని మీరనటంకూడా నేను సహించలేను." అనేవాడు రవి.

"మనిషిలో కేవలం విప్లవ భావాలేకాదు. ఇంకా చాలా సున్నితమైన భావాలు అనేకం ఉన్నయ్. ఆర్థికావసరాలను మించిన మానసికావసరాలు మనిషికి చాలా ఉన్నయ్. ఆకలి తీర్చుకోవటం జీవలక్షణ



మని నాకూ తెలుసు. కాని కడుపు నిండినంత మాత్రాన యింక మనిషికి సమస్యలనేవేవీ వుండవని నేననుకోను. ఇతర జంతువులకీ మనుష్యులకీ తేడా అక్కడే వుంది. భౌతికావసరాలు తీరటంతో జంతువుల జీవితం ధన్యమవుతుంది. కాని మనిషి విషయంలో అలాకాదు. మానసికంగా, ఆధ్యాత్మికంగా మరెన్నో విషయాలు అతనిని కలవరపరుస్తుంటాయ్. అతనిలో జ్ఞానపిపాస వుంది. సౌందర్యపిపాస ఉంది. ప్రేమపిపాస వుంది. ఇందులో ఏ ఒక్కటి తీరక పోయినా అతనికి మిగిలేది ఆవేదనే! ఆ ఆవేదనే, ఆ తృష్ణే అతనిచేత కవిత్వం చెప్పిస్తుంది. కథలు వ్రాయిస్తుంది. శిల్పాలను చెక్కిస్తుంది. చిత్తరువులను చిత్రింపజేస్తుంది. వీటన్నిటి మాటయేమి? ఇవేవీ కథావస్తువులు కాదగ్గవి కాదంటారా? అనిడిగేవాడు రవి.

ఇలా వివిధ రచయితలతోను అతని కేర్పడిన పరిచయం అతనికి గృహ సమస్యలనుండి కొంత ఉపశమనాన్ని కలుగజేస్తూండేది.

కాని బయట అతను మనశ్శాంతిని వెతుక్కోవటం ప్రారంభించిన దగ్గరనుండి యింట్లో అశాంతి మరింత ఎక్కువవసాగింది.

రవికి ఉద్యోగం లేదన్న బాధకుతోడు అతను తనకి మానసికంగా దూరమవుతున్నాడన్న సత్యం శ్యామలను బాధించటం ప్రారంభించింది.

సున్నితమైన వైవాహిక జీవితం యిలా రకరకాల 'కాంప్లెక్సు'లతో, భయాందోళనలతో, అహంభావంతో చితికి చితికి సర్వనాశనం అయ్యే స్థితికి వచ్చింది. రోజు రోజుకీ శ్యామలలోని అసహనం ఎక్కువవుతోంది. తన చుట్టూవున్న ఉద్యోగినుల ధోరణీ, తనని గురించి వాళ్లు చాటుగా మాట్లాడుకునే పద్ధతీ అంతా ఆమెకు పిచ్చెత్తించినయ్. తను రవిని పెళ్లి చేసుకోవటంలో పొరపాటు చేసేనన్న నమ్మకం ఆమెలో ధృవపడి, వేళ్లు పాతుకుపోయింది. రవిమీద తనకి తెలియకుండానే ఒక రకమైన కసినీ, ద్వేషాన్నికూడా పెంచుకున్నది శ్యామల. ఒక్కొక్క సమయంలో ఒంటరిగా, ప్రశాంతంగా కూర్చుని ఆలోచిస్తుంటే తనలోని భయంకరమైన ఆలోచనలకు తనకే అసహ్యం వేసేది. కాని తరువాత ఏ చిన్న సంఘటనకో చలించిపోయి, ఏవేవో ఊహించుకుని రవిని తాను ద్వేషించటానికి గల కారణాలు సమంజసమేనని తనని తాను సమర్థించుకోజూసేది.

ఒకరోజు కాలేజీలోని లెక్చెరర్లందరూ కలిసి ఆగస్టు పదిహేనుకు అందరూ తెల్లని బెనారస్ చీరలు కట్టుకుందామని తీర్మానించుకున్నారు. దాని కోసం అందరివద్దా తలా నూట డెభై రూపాయలు వసూలు చేస్తుంటే "నేనంత డబ్బు యిచ్చుకోలేను. ప్రస్తుతం మా యింటి పరిస్థితులు అంతగా బాగా లేవు." అని చెప్పింది శ్యామల.

పైకి సహజంగా అలా అన్నదేకాని లోపల మాత్రం అలా అనవలసిన పరిస్థితులు ఏర్పడినందుకు ఎంతగానో కించపడింది.

"ఏం? మీ యింటి పరిస్థితుల కేమయింది?" ఒకామె అన్నీ తెలిసికూడా, ఏమీ ఎరగనట్లే అడిగింది.

శ్యామల ఏదో సమాధానం చెప్పేలోగా అందుకుని మరొకామె "పాపం! వాళ్లాయనకి ఉద్యోగం లేదట," అన్నది సానుభూతిగా.

"ఉన్నప్పుడు మాత్రం ఆయన ఏం ఒరగబెట్టేడులే! ముష్టి మూడువందల రూపాయలు ఏమూలకు చాలతాయ్? ఆ మూడువందలు కూడా పాపం శ్యామలకి యిచ్చేవాడుకాదట. ఫస్టుతారీకు రాగానే సరాసరి ఆ డబ్బంతా తల్లికే యిచ్చేవాడట."

"అలాగా! ఈ సంగతి నీకెలా తెలుసు?"

"శ్యామల చెప్పనంత మాత్రాన మనకి తెలియకుండా వుంటుందా? వాళ్లాయన యింటి ప్రక్కనే మా చెల్లెలుంటుంది. శ్యామల పెళ్లయిన దగ్గర నుండీ వాళ్ల కుటుంబం కాస్త బాగుపడిందట. అంతకుముందు వాళ్లు చాలా పేదగా ఉండేవారట."

"బాగుపడక ఏం చేస్తుంది? సంపాదించే కోడలు కదా అని ఆయన తల్లికూడా ఈ పెళ్లికి అడ్డు చెప్పలేదు. మరో బుద్ధున్న ఆడదైతే "నీ అంతస్తెక్కడ? ఆ అమ్మాయి అంతస్తెక్కడ? ఆ అమ్మాయిని చేసుకోవటంవల్ల మనకీ బాధ, ఆమెకీ బాధ అని కొడుక్కి నచ్చచెప్పి పెళ్లి ఆపుచేసేదికదూ?"

"ఈమధ్య మగవాళ్లు, వాళ్ల తల్లిదండ్రులు మంచి లౌక్యం నేర్చారోయ్. కట్నం అక్కర్లేదు అని పైకి గొప్పగా చెప్పుకోవటం. నెలనెలా సంపాదించే అమ్మాయిమాత్రం కావాలనటం మొదలెట్టేరు. ఆ రవికి తల్లక్రిందులుగా తపస్సు చేస్తేమాత్రం యిలాటి సంబంధం వచ్చేదా? పాపం! శ్యామల పిచ్చిదికాబట్టి అతని వలలో పడిపోయింది."

"అబ్బ! శ్యామలలో యింత దుఃఖం ఉందా? పైకి మనకెవ్వరితోనూ చెప్పుకోదు చూడు."

"ఇంకా ఏ ముఖం పెట్టుకుని చెప్తుంది? చేసిన సిగ్గుచేటు పనికి జీవితాంతం బాధపడవలసిన మనిషి యింకా ఏం చెప్పుకోవాలి?"

ఆ సంభాషణ వింటుంటే శ్యామలకి కళ్లుతిరిగినంత పనయింది.

వీళ్లందరూ తమ వైవాహిక జీవితాన్ని గురించి యింత లోతుగా ఆలోచిస్తున్నారా? తనని చూసి అంతగా జాలిపడుతున్నారా? తన బ్రతుకు సర్వనాశనమయిందనే వీళ్లంతా భావిస్తున్నారా?

వీళ్లు వెల్లడిచేసిన అభిప్రాయాలన్నీ తన మెదడులో కూడా అప్పుడప్పుడు పాముపిల్లల్లా మెదిలి తనని హింసించకపోలేదు. అందుకే ఆ అభిప్రాయాలను వినేసరికి శ్యామలకి దుఃఖం ఆగలేదు.

తన జీవితంలో వున్న దౌర్భాగ్యంకంటె తన దౌర్భాగ్యాన్ని చూసి యితరులు జాలిపడుతున్నారన్న భావమే ఆమెను క్రుంగదీసింది.

వాళ్ల సానుభూతి దృక్కులకు తట్టుకోలేక ముఖాన్ని రెండు చేతులమధ్యా దాచుకుని వెక్కి వెక్కి ఏడిచింది శ్యామల.

ఆమె అలా ఏడిచేసరికి మిగతావాళ్లందరి ప్రాణాలు కుదుటపడ్డాయి. "ఫరవాలేదు. మనం అనుకుంటున్నట్లుగానే శ్యామల తను చేసిన పొరపాటు పనికి పశ్చాత్తాపపడుతోంది. తమ అంచనా సరియైనదే!" అనుకుని తృప్తిపడ్డారు.

ఎవరికి తోచినట్లు వారు ఆమెను ఓదార్చటానికి ప్రయత్నించేరు.

ఆ ఓదార్పు వాక్యాలవల్ల ఆమె బాధ మరింత ఎక్కువయిందేతప్ప ఏమాత్రం తగ్గలేదు.

**అమెరికాలోనూ ఇంతేనా?**

న్యూయార్క్ నగర రవాణా సంస్థ తమ ఎగ్జిక్యూటివ్‌లు తరుచుగా ప్రభుత్వ ఖర్చులపై విదేశాలకి టూర్లు వెడతారని కనిపెట్టింది. ఈ మధ్య ఒకాయన ఇటలీలోని ఫ్లారెన్సులో భూగర్భ రైల్వే దగ్గిరకు "ఇన్‌స్పెక్షన్ టూర్"కి వెళ్లాట్ట. ఇందుకు గాను 4 వేల డాలర్లు సంపాదించ గలిగాట్ట. పెళ్లాన్ని తీసుకుని లండన్, స్టాక్‌హోమ్, మ్యూనిచ్, రోమ్ మొదలయిన ప్రదేశాలన్నీ చూసి వచ్చాట్ట. ఇంతకీ అసలు విషయం ఏమంటే అసలు ఫ్లారెన్స్‌లో భూగర్భ రైల్వే లేనేలేదట.

ఇంటికి వెళ్లిన తరువాతకూడా ఆమె చెవుల్లో వాళ్లందరూ అన్న మాటలే గింగురుమనసాగినయ్.

ఆమె యింటికి వెళ్లేసరికి రవి యింట్లో లేడు. "ఉద్యోగం లేకపోయినా తిరుగుళ్లకి మాత్రం తక్కువేంలేదు" అని విసుక్కుంటూ డూప్లికేటు తాళంచెవితో తాళం తీసి లోపలికి ప్రవేశించింది శ్యామల.

వంటా అదీ పూర్తిచేసేసరికి రాత్రి ఏడయింది. కాసేపు నవల చదువుకుంటూ కూర్చుంది. ఇంట్లో రాత్రి ఒంటరిగా వుండాలంటే ఆమెకు ఒకరకమైన భయం, చిరాకుకూడా.

ఎనిమిదయినా భర్త యింకా రాకపోయేసరికి "ఛీ! పాడుమనిషి. ఏం తిరుగుళ్లో యేమో!" అని పుస్తకాన్ని మంచంమీదకు గిరవాటువేసి, లేచి గదిలో పచార్లు చేయసాగింది.

ఆమె అలా అసహనంగా తిరుగుతుండగానే తొమ్మిదీ, పదికూడా అయింది.

పదిన్నర ప్రాంతంలో రవి యింటికి వచ్చేడు.

అప్పటికే ఆమెలోని అసహనం తారాస్థాయి నందుకుని వున్నది.

"ఇంతసేపూ ఎక్కడ వున్నారు? పగలల్లా కాలేజీలో అరచి అరచి యింటికి వచ్చేక కాస్త వండుకున్న అన్నం వేళకి తినటానికికూడా వీల్లేకపోయింది. ఉద్యోగం వూడిందే చాలుకదా అని బలాదూర్లు తిరగటం ప్రారంభించేరన్నమాట!"

"శ్యామలా! వూరికే నోరు పారవేసుకోకు. ఏదో మీటింగు వుంటే వెళ్లేను..."

అతనింకా వాక్యం పూర్తి చేయకుండానే శ్యామల విరుచుకుపడింది. "ఔను మనకి సభలకీ సమావేశాలకీ ఏం తక్కువ? పూట గడవటమే కష్టంగాని. పెళ్లాం సంపాదనమీద పడి తినటం, తరువాత వూరుమీద పడి తిరగటం..."

"నోర్ముయ్! దేనికైనా హద్దనేది వుండాలి" అంటూ చెళ్లున ఆమె చెంపమీద దెబ్బవేసేడు రవి.

భార్యమీద చెయ్యి చేసుకోవటం అదే మొదటిసారి రవికి.

కోపంలో కొట్టేడన్న మాటేగాని వెంటనే పశ్చాత్తాపంతో అతని తల వాలిపోయింది.

# యువతరం

కుమారి వేదుల ఎస్. భారతి జంషెడ్‌పూర్ కాలేజీ నుంచి వచ్చి ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఎమ్మెస్సీలో చేరింది. అన్ని ప్రాంతాల తెనుగువాళ్లు ఒకచోట కలుసుకున్నారు కనుక ఆంధ్రా యూనివర్శిటీ ''గార్ల్స్ హాస్టలు'' జీవితం బాగుంటున్న దన్నది. బాడ్‌మింటన్ ఆడాలనీ, టేబిల్ టెన్నిస్ కూడాఆడాలని సరదా పడే భారతి జాతీయ క్రీడ విషయం ఏం చెప్పలేనంది. కాని శాస్త్రీయ సంగీతం మీద, వయోలిన్ మీద అభిరుచి గల యీ అమ్మాయికి సైన్సులో రీసెర్చి చేసి,లెక్చరర్ఉద్యోగం లాంటిది చేయాలన్న ఆశయం గట్టిగా వుంది.



ఇరవై రెండేళ్ల యీ అమ్మాయి వార్తా పత్రికలపట్ల, అందులోని రాజకీయాల మీద కొంత ఆసక్తిని కనబరుస్తుంది. రూపాయి చిల్లర దొరక్కపోతే అరటిపళ్లు ఒకటో రెండో కొనుక్కొని చిల్లర మార్చుకుంటుంది. లైబ్రరీలలో సైన్సు పుస్తకాలు తీసుకుంటుంది. సినిమాల విషయం వస్తే బి. ఎన్. రెడ్డి, బాపు, భానుమతి మున్నగు డైరెక్టర్లమీద చాలా అభిమానం వుంది. 'ఓ సీత కథ' నచ్చిన చిత్రం —

'సినిమా స్టార్స్‌ని చూడాలనే వుంటుంది కాని ... ... అయితే వాళ్ల హాస్టల్‌కి రోజారమణి వచ్చిందిటోసారి ...

ప్రధానమంత్రి మారితేమాత్రం మన దేశ పరిస్థితులు యింతకన్నా ఎక్కువగా మారుతాయా? అని అనుమానిస్తున్న భారతి శ్రీమతి గాంధీ హయాంలో అణ్వస్త్ర పాటవ పరీక్ష అయిన విషయాన్ని గొప్పగా భావిస్తున్నది. దేశంలో ధరలు విపరీతంగా పెరిగిపోటానికి కారణం ''శిక్ష'' పడుతుందనే భయం, 'పాపభీతి' లేకపోవటం, ప్రజల్లో [అంటే వ్యాపారస్తులలోనా?] ధనాశ పెరగటం ప్రధాన కారణాలని వాదించే యీ అమ్మాయి సిటీ బస్‌లోనే ప్రయాణం చేయటానికి యిష్టపడుతుంది బాగుంది కాని 'బ్లాకు'లో సినిమా టిక్కెట్లు కొనడం మంచిదికాదు కనుక, బెటర్ స్టాండ్ యిన్ ది క్యూ అండ్ గెట్ ది టికెట్ — ఔనా?

[వీరాజీ]

---

## అహం – అనురాగం

కాని ఆ దెబ్బ శ్యామల చెంపకు తగల్లేదు. ఆమె అహంకారంమీదనే దెబ్బతీసింది.

''రవీ! నువ్వు... నువ్వు ... నన్ను కొట్టేంత మొనగాడివయ్యావా? రాక్షసుడా! నన్ను కొట్టే అధికారం నీకెవరిచ్చేరు? భార్యని పోషించే ఆర్థిక స్తోమతులేని మగవాడికి భార్యని కొట్టే హక్కు కూడా వుండదు. ఆ సంగతి తెలుసుకో. భార్యని కొట్టటానికికూడా మగవాడికి కొన్ని అర్హతలుండాలి. ఆ అర్హత నీకు లేదు. అంతేకాదు. నా యింట్లో వుండి, నా ఉప్పు తింటూ నన్నే కొడతావా? ఫో! నా యింట్లో ఒక్క క్షణంకూడా వుండకు. నీ యిష్టమొచ్చినచోటుకి పో. నిన్ను ప్రేమించి, నీకోసం ఎన్నో కష్టాలు పడినందుకు మంచి శాస్తే చేసేవు. నా జీవితాన్ని సర్వనాశనం చేసింది చాలక నామీదే అధికారం చెలాయిద్దామనుకుంటున్నావా? ఫో! ఇక్కడినుండి కదులూ'' అంటూ అరిచింది శ్యామల ఉద్రేకంగా.

''శ్యామలా!'' అని అతను ఏదో చెప్పేలోగానే

''నాతో మాట్లాడకు. తక్షణం నా కళ్ల ఎదుటినుండి ఫో!'' అంటూ ముఖం పక్కకు తిప్పుకుంది శ్యామల.

''సరే. వెళ్లిపోతున్నాను. నన్నిలా వెళ్లగొట్టేనందుకు నువ్వు పశ్చాత్తాపపడే రోజు చాలా త్వరలోనే వస్తుంది. ఆ సంగతిమాత్రం మర్చిపోకు. నాకు ఉద్యోగం, హోదా లేకపోయినా సిగ్గూ, అభిమానం వున్నయ్. నీ యిష్టమొచ్చినట్లు మాట్లాడితే పడివుండటానికి నేనేమీ నీ నౌకరును కాను. నీ భర్తను. ఈ సంగతి నీకు త్వరలోనే తెలిసి వస్తుందిలే!'' అని చరచర బయటకు వెళ్లి ఆ నిశీధిలో కలసిపోయేడు రవి.

శ్యామల నిస్సత్తువగా మంచంమీద వాలిపోయింది.

### 7

అలా నిస్సత్తువగా ఒకరకమైన మూర్ఛావస్థలో పడుకునివున్న శ్యామలకి మెలకువ వచ్చేసరికి తెల్లవారుఝామున మూడుగంట లయింది.

చుట్టుపక్కల అంతా నిశ్శబ్దంగా వుంది. పక్కనే టేబులుమీద వున్న అలారం టిక్కుటిక్కుమంటూ చేస్తున్న శబ్దంతప్ప మరే శబ్దమూ వినపడటంలేదు. ఆ నిశిరాత్రి, నిశ్శబ్దతను చీల్చుకుని వినబడుతున్న లయబద్ధమైన శబ్దం ఆమె గుండెమీద సుత్తిపోటులా తగలసాగింది.

వివాహమైన తరువాత రాత్రి ఒంటరిగా యింట్లో వుండటం అదే మొదటిసారి. ఆ చీకటి, ఆ నిశ్శబ్దం ఆమెను భయవిహ్వలురాలిని చేసినయ్. అప్పటికామెకు నిండునెలలు. దానికితగ్గట్టు ఈ రకమైన అనుభవాలు ఆమెనరాలను కృంగదీయసాగినయ్.

రవి ఎక్కడకు వెళ్లేడు? అతను మళ్లీ తిరిగి వస్తాడా, రాడా? రాకపోతే తన భవిష్యత్తు ఏమిటి? రకరకాల ప్రశ్నలు ఆమె మెదడును కలవరపరచినయ్. అయ్యో! ఆవేశంలో తను ఎంత పని చేసింది! అతనిని ఎంతగా తూలనాడింది! ఇప్పుడతనేమయినాఅఘాయిత్యంచేస్తే తనగతేంకాను?

ఎవరినైనా రవిని వెతుక్కురమ్మని పంపిద్దామనుకుంది. కాని యింత రాత్రిపూట ఎవరిని పంపుతుంది? అసలు ఏ ముఖంపెట్టుకుని పంపుతుంది?

''నా భర్తను యింట్లోనుండి గెంటివేసేను. మీరు వెళ్లి ఆయనను వెతికి, పట్టుకురండి'' అని సిగ్గు లేకుండా ఎలా అడగగలదు?

తెల్లవారేవరకు వెక్కి వెక్కి ఏడుస్తూ కూర్చుండిపోయింది శ్యామల.

పనిమనిషి వచ్చి తలుపు తట్టేవరకు ఆమెకు స్పృహ వున్నట్లే లేదు.

వెలుగురేఖలను చూసేక, మనుష్యుల అలజడి విన్నాక ఆమెకు కొంత ధైర్యం వచ్చింది కాని. గుండెలోని దిగులుమాత్రం దట్టంగానే వుంది.

''ఏందమ్మాయిగారూ? అలా వున్నారే? అయ్యగారేరీ?'' అనడిగింది పనిమనిషి.

''అయ్యగారేరీ?'' అన్న ప్రశ్న ఆమె గుండెలో బాకులా దూసుకుపోయింది.

''అయ్యగారేదో పనిమీద వూరు వెళ్లేరు. రాత్రి పన్నెండుగంటల బండికి వెళ్లేరు. అందుకే నిద్ర చాల్లేదు'' అంది శ్యామల.

''ఇక అబద్ధాల జీవితానికి ఇది నాందికాబోలు'' అని మనసులో అనుకుంది.

యాంత్రికంగా కాఫీపెట్టుకుని తాగింది. వంట పనికూడా పూర్తిచేసింది. రోజులాగానే యిద్దరికోసం వంటచేసింది శ్యామల.

పనిమనిషి పనులన్నీ చేసుకుని తొమ్మిదింటి కల్లా వెళ్లిపోయింది.

ఆరోజు కాలేజీకి వెళ్లటం యిష్టంలేక సెలవు చీటీ పంపింది. మరో పదిరోజులలో కాన్పు రావచ్చునని లేడీ డాక్టర్ చెప్పింది మొన్ననే. అందువల్ల నాలుగురోజుల తరువాత మెటర్నిటీ లీవుకు అప్లై చెయ్యాలనుకుంటోంది శ్యామల.

ఆరోజు పన్నెండుగంటల వరకు రవి వస్తాడేమోనని ఆశగా ఎదురుచూసింది.

కాని అతను వచ్చే జాడలేవీ కనబడకపోయేసరికి యిక చేసేదిలేక ఆకలి బాధకు తట్టుకోలేక భోజనం ముందు కూర్చుంది. కాని ఒక్క ముద్దకూడా నోట్లోకి పోలేదు.

ఏదో తిన్నాననిపించి చెయ్యి కడుక్కుని లేచింది. అతను వస్తాడన్న ఆశతో అతనికోసం వేరే భోజనం మూతపెట్టి వుంచింది.

సాయంత్రంకూడా అయింది.

చీకటి పడబోతుందనుకోగానే మళ్లీ రాత్రి గడిపిన ఒంటరి రాత్రి గుర్తుకువచ్చి ఆమెను భయం ఆవహించింది.

''ఈ రాత్రికి అతను తప్పక వస్తాడు'' అని తనకి తానే ధైర్యం చెప్పుకుంది.

ఉదయం అతనికోసం వండిన భోజనాన్ని పనిమనిషి కిచ్చివేసింది.

మళ్లీ రాత్రి అతనికోసం వేరే కూర, పచ్చడి, చారు తయారు చేసింది.

పదకొండు గంటల వరకు ఎదురు చూసినా రవి రాలేదు.

ఆమెకు కాళ్లూ చేతులూ చల్లబడినట్లయింది. భయంతో, శంకలతో ఆమెకు నాలిక పిడచగట్టుకుపోయింది.

సరిగా క్రితం రాత్రి యిదే సమయానికి అతను యిల్లు విడిచి వెళ్లిపోయేడు. [ఇంకా వుంది]

### హిందీ పూర్ణచంద్రరావు !

శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్ అందించిన "దేవుడు చేసిన పెళ్లి" ఆంధ్ర ప్రేక్షకుల హృదయాలను ఆకర్షించింది నవ్యత వున్న కధలకు ప్రజాదరణ ఎప్పుడూ లభిస్తుంది అని "దే చే పె" నిరూపించింది

ఆ చిత్ర నిర్మాత పూర్ణచంద్రరావును ఈమధ్య కలిసినప్పుడు, 'దేవుడు చేసిన పెళ్లి'ని హిందీలో నిర్మించే వుద్దేశ్యం వున్నట్టు చెప్పారు అమితాబ్ బచన్ — జయభాదురి అయితే చక్కగా వుంటుందన్న నా సలహాతో ఆయన ఏకీభవించారు

"దేవుడు చేసిన పెళ్లి" చిత్రంయొక్క తమిళ హక్కులను కధకుడు బాలమురుగన్ కొన్నారట ముత్తురామన్ — కె ఆర్ విజయ ప్రధాన పాత్రలను పోషించగలరట

దర్శకుడుగా తాతినేని రామారావు ఈ చిత్రం ద్వారా ఎంతో ఎదిగాడు "జీవనతరంగాలు" తెచ్చి పెట్టిన పేరును పెళ్లి చిత్రం యినుమడింపచేసింది



"జేబుదొంగ"లో శోభన్

### సూర్యునికి కృతజ్ఞత

సమత ఆర్ట్సువారి "జేబుదొంగ" వర్ణ చిత్రం షూటింగు పక్షం రోజులు ఏకధాటిగా ఊటీలో జరిగింది ఈ షెడ్యూలులో నాలుగు పాటలు, కొన్ని ముఖ్య దృశ్యాలు చిత్రీకరించబడ్డాయి

పగలంతా విపరీతంగా ఎండ వచ్చేది, రాత్రంతా భయంకరమైన చలి వుండేది మకాం పెట్టిన పక్షం రోజులూ సూర్యుడు తన సంపూర్ణ సహకారాన్ని యిచ్చినందుకు, నిర్మాతలు ఛటర్జీ, యాచేంద్ర కృతజ్ఞతలు తెలుపుతున్నారు

నాలుగు పాటలను గ్లామర్ హీరో శోభన్, మంజుల మీద చిత్రీకరించారు సూర్యుని సహకారం వుండకపోతే, షూటింగు ఆగిపోయేది మళ్లీ హీరో, హీరోయిన్ల తేదీలు లభించడానికి కష్టపడాల్సివచ్చేది

సమత ఆర్ట్సు "జేబుదొంగ" చిత్రానికి విక్టరీ మధుసూదనరావు వెంకటరత్నం, చక్రవర్తి, ముళ్లపూడి లాంటి వుద్దండులు వుండడంవల్ల, సాంకేతికంగా వున్నత ప్రమాణాన్ని అందుకొంటుంది

## సినిమా విశేషాలు

### తారల వినోద యాత్ర !

ప్రపంచ తెలుగు మహాసభలు జరిగే నెల దగ్గర్లోనే వున్నది ఈ సభా కార్యక్రమానికి సినిమా వాళ్ల సహకారం అవసరమైంది

రాబోయే ఫిబ్రవరి 15 నుంచి 24 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది కేంద్రాలలో మన తారలు వినోద కార్యక్రమాన్ని జరపడానికి నిశ్చయించారు

ఈ ప్రోగ్రామ్సులో తెలుగు సినిమా కళాకారు లనేకులు పాల్గొంటారని తెలిసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "ఆర్టిస్టుల సంక్షేమనిధి"కి మూడు లక్షలు యివ్వడానికి అంగీకరించినట్టు వార్త

ఆంధ్రులకు అత్యంత ప్రీతిపాత్రులయిన రామారావు, నాగేశ్వరరావులు యీ కార్యక్రమంలో లేకపోవడం, కార్యక్రమానికి నిండుదనాన్ని యివ్వక పోగా, విజయవంతమయ్యేది కష్టసాధ్యమే అవుతుంది

### గౌతమ్ చిత్రం !

పత్రికా రచయితగా వుంటూ, దర్శకత్వం చేపట్టిన గౌతమాచార్యులు తన "వనజ—గిరిజ" చిత్రాన్ని పూర్తి చేశారు ఈ చిత్రంలో జమున ద్విపాత్రాభినయం వుంది రెండు జన్మలకు సంబంధించిన కధ అని తెలిసింది

వనజగా అల్లరి చెయ్యడం, గిరిజగా మందులివ్వడం (డాక్టరు) యీ రెండు పాత్రలకు గల వైవిధ్యానికి ప్రత్యక్ష నిదర్శనం

ఈ చిత్రంలో రామకృష్ణ, సత్యనారాయణ, రావు గోపాలరావు, ప్రభాకరరెడ్డి, పద్మనాభం, కృష్ణకుమారి, సురభి బాలసరస్వతి, చంద్రమోహన్, భవానీ ముఖ్య పాత్రధారులు సంగీతాన్ని చలపతిరావు, ఛాయను అశోక్‌కుమార్ నిర్వహించారు నిర్మాత ఇ కుప్పుస్వామి



"బలిపీఠం"లో అల్లు రామలింగయ్య

### "స్వతంత్రం వచ్చింది"

డాక్టరు ప్రభాకరరెడ్డి అందించే చిత్రాలలో నవ్యత, ప్రత్యేకత వుంటుందన్న నమ్మకం ప్రేక్షకులకు వున్నది ఆ నమ్మకాన్ని వమ్ము చెయ్యడం రెడ్డికి చేతకాదు

" కొడుకు పుట్టాల పావలా " నాటక రచనలకు మార్పులు, చేర్పులు జోడించి గణేష్ పాత్రో సృష్టించిన సరికొత్త కథయే "స్వాతంత్ర్యం వచ్చింది "

మనకు స్వాతంత్ర్యం వచ్చి యిరవై ఎనిమిది ఏళ్లు గడిచాయి కానీ సామాన్య మానవుడికి ఆర్థిక



"యశోద కృష్ణ"లో వరలక్ష్మి, రంగారావు

స్వాతంత్ర్యం లభించలేదు దేశంలో ఎక్కడ చూచినా అశాంతి, ఎక్కడ విన్నా శాంతికి భిన్నమైన శబ్దం "నేడు కనిపిస్తున్న విప్లవ ధోరణికి విముక్తి లేదా ? రాదా ?" అనెడి ప్రజాహిత అంశంపై అతి రమ్యంగా అల్లబడిన కథయే "స్వాతంత్ర్యం వచ్చింది"

## "సముద్రంలో షూటింగు"

జయప్రద మూవీస్ రంగుల్లో నిర్మిస్తున్న యీ ప్రయోజనాత్మక చిత్రంలో చాలా భాగం సముద్ర తీరాన, సముద్రంలో చిత్రీకరించబడింది ఇలాంటి సాహస కృత్యాన్ని తలపెట్టిన నిర్మాత అభినందనీయుడు

"స్వాతంత్ర్యం వచ్చింది" చిత్రానికి దర్శకుడు లక్ష్మీదీపక్ చూపెట్టిన శ్రద్ధాశక్తులకు తగిన ప్రతిఫలాన్ని ప్రేక్షకులు యివ్వగలరు ఈ చిత్రంలో కృష్ణంరాజు కొత్తరకం పాత్రను పోషించారు ఈ వేషాన్ని వెయ్యడానికి సంశయించిన కృష్ణంరాజు యింత మంచి వేషాన్ని వేసినందుకు పుప్పొంగి పోతున్నారు ఈ చిత్రం నుంచి అందాల బరిణె జయప్రద పరిచయం అవుతున్నది ముఖ్య పాత్ర లను గుమ్మడి, నాగభూషణం, రావు గోపాలరావు, అల్లు రామలింగయ్య, రాజబాబు, త్యాగరాజు, సాక్షి రంగారావు, మాడ, షావుకారు జానకి, శుభ, ప్రభ, రమాప్రభ మరియు ప్రభాకరరెడ్డి పోషిస్తున్నారు

కొత్తదనాన్నికాంక్షించే ప్రేక్షక మహాశయులకు, ప్రభాకరరెడ్డి అందిస్తున్న వినూత్న చిత్రం అతి త్వరలో నవయుగ ద్వారా విడుదలవుతుంది



"అభిమానవతి"లో కృష్ణ, వాణిశ్రీ



"అమ్మాయిల శపథం"లో హలం

## ఎస్వీ ఆర్ వారసుడు

మహానటుడు యశస్వి ఎస్వీ రంగారావు స్థానాన్ని ఆక్రమించగల నటుడు తెలుగు గడ్డకు లేదేమో అనుకొన్నవాళ్లలో నేనొకడ్ని కానీ ఆయన అందుకొన్న ప్రజాభిమానాన్ని చూరగొంటున్న నటుడు ఉత్పన్నమయ్యాడు

గడుసరి దాసరి దర్శకత్వంలో విడుదలైన "ఎవరికివారే యమునాతీరే" చూచిన తరువాత సత్యనారాయణకు రంగారావు హోదాను యివ్వడం న్యాయం అనిపించింది

1974లో పుత్తమోత్తమంగా నటించిన ఏకైక నటుడు సత్యనారాయణ అన్నది నిర్వివాదాంశం

నటనను తపస్సుగా పూజించే ఎన్టీ రామారావు, నాగేశ్వరరావు కోవకు చెందిన నటుడు కైకలూరు సత్యనారాయణ

1975లో మాయలఫకీరు పాత్ర, సత్యనారాయణకు కొత్త కిరీటాన్ని తెచ్చిపెడుతుంది దర్శకుడు పి ఎస్ రావు మలచిన ఫకీరు పాత్రకు, సత్యనారాయణ ప్రాణం పోస్తున్న నిజాన్ని నా కళ్లారా చూశాను

## మా యా బ జా ర్ !

ఇది పౌరాణికం కాదు సాంఘిక చిత్రానికి యీ పేరు పెట్టారంటే, యిందులో గమ్మత్తయిన ఘట్టాలు ఎన్నో వుంటాయని వూహించవచ్చు

అజంతా మూవీస్ నిర్మించే యీ చిత్రానికి ఎస్ రామచంద్ర దర్శకుడు ఇతడు మీనాకు సహాయకుడు విషయం వున్న వివేకవంతుడు "మీనా" లో పార్టనర్ అగు జి పి మల్లయ్య సమర్పించు "మాయాబజార్" చిత్రంలో చలం, లత ముఖ్య పాత్రధారులు ఈ చిత్రానికి ఆరుద్ర రచనను, సత్యం సంగీతాన్ని, గోపీకృష్ణ ఛాయను, జగదీష్ కూర్పును నిర్వహిస్తున్నారు సి సుబ్బయ్య నిర్వహణలో నిర్మితమయ్యే యీ చిత్రానికి ఎస్ పి వెంకన్నబాబు, సత్తిరాజు తమ సంపూర్ణ మద్దతును యిస్తున్నారు

## లక్ష్మి ప్రారంభించిన రామారావు చిత్రం

జనవరి ఆరున వాహినీ స్టూడియో రంగు రంగుల తోరణాలతో విలసిల్లింది పరిశ్రమలో మెలుపును తెచ్చిన మంచిరోజు వైజయంతీ మూవీస్ వారి షూటింగు రోజు

లక్ష్మి ఫిలింస్‌లో నటరత్న నటిస్తున్న మొదటి చిత్రం యిది దీనిని అశ్వినీదత్ నిర్మిస్తున్నారు శివరామకృష్ణయ్య క్లాప్ కొట్టగా, త్రివిక్రమరావు స్విచ్ ఆన్‌చెయ్యగా, తొలి షాటును ఎన్టీరామారావుపై, దర్శకుడు బాపయ్య చిత్రీకరించారు ఈ చిత్రానికి ఎస్ వెంకటరత్నం ఛాయాగ్రాహకుడు

ఈ చిత్రంలో అగ్రనటి వాణిశ్రీ ధరిస్తున్న పాత్రలో ప్రత్యేకత వున్నది ఎన్టీఆర్ — జగ్గయ్య అన్నదమ్ములుగా నటిస్తున్న యీ చిత్రానికి భమిడి పాటి రచనను, మహదేవన్ సంగీతాన్ని సంజీవి కూర్పును, కృష్ణారావు కళను నిర్వహిస్తున్నారు ఇతర ముఖ్య పాత్రలను సత్యనారాయణ, కాంతారావు, రాజబాబు, రమాప్రభ పోషిస్తున్నారు

లక్ష్మిలో రామారావు ప్రవేశించిన యీ చిత్రం ప్రేక్షకుల ప్రీతిని, ప్రేమను పొందుగాక !

## మార్చి నుంచి జులై వరకు !

జగపతి ఆర్ట్ పిక్చర్స్ రంగుల్లో నిర్మించనున్న "పిచ్చిమారాజు" షూటింగు మార్చి 18న ప్రారంభ మవుతుంది ప్రతి నెలా పది రోజులు చొప్పున జులై వరకు యీ చిత్రం షూటింగు జరుగుతుంది

తన సంస్థలో ఎంతో కాలంగా పని చేస్తున్న సిబ్బందికోసం యీ చిత్రాన్ని తలపెట్టిన రాజేంద్ర ప్రసాద్ వితరణ గూర్చి ఎంతేని వ్రాయొచ్చు

పిచ్చిమారాజు పాత్రను శోభన్‌బాబు పోషిస్తారు ఆయనకు యిది కొత్తదనం వున్న పాత్ర అవుతుంది ఆయన్ను నవ్విస్తూ, కవ్విస్తూ, వలపు తలపులతో తనవాడ్ని చేసుకొన్న వనితగా మంజుల నటిస్తున్నది హాస్య పాత్రను రాజబాబు పోషించే యీ చిత్రానికి సత్యానంద్ రచనను, మహదేవన్ సంగీతాన్ని, వెంకటరత్నం ఛాయను, సంజీవి కూర్పును, కృష్ణారావు కళను నిర్వహిస్తారు

జనావళిని ఆకర్షించే శక్తిని బడసిన రాజేంద్ర ప్రసాద్ యీ చిత్రానికి దర్శకుడు అన్నపూర్ణా విడుదల

## కోనసీమలో జీవన జ్యోతి

డి వి ఎస్ ప్రొడక్షన్స్‌వారి వర్ణ చిత్రం "జీవన జ్యోతి" షూటింగు జనవరి పది నుంచి యిరవై వరకు కోనసీమ ప్రాంతంలో జరిగింది

ప్రకృతి రామణీయకతతో శోభిల్లే అల్లవరం, కోడూరుపాడు, బెండముర్లంక, గన్నవరం, బలుసుతిప్ప ప్రదేశములందు "జీవన జ్యోతి" అవుట్ డోర్ షూటింగు జరిగింది ఈ షెడ్యూలులో శోభన్, వాణిశ్రీ పాల్గొన్న యుగళగీతం, రాజబాబు, ముక్కామల, పి వెంకటేశ్వరరావు, సీతాలత, పద్మశ్రీ, బేబీవరలక్ష్మి పాల్గొన్న ముఖ్యసన్నివేశాలుకొన్ని చిత్రీక రించబడ్డాయి ఈ చిత్రానికి కె విశ్వనాథ్ దర్శకుడు

## నిర్మాత కృతజ్ఞత !

పై నుదహరించిన ప్రదేశాలలో షూటింగు నిర్విఘ్నంగా సాగడానికి సహాయపడిన గ్రామ పెద్దలకు, ప్రజలకు, అధికారులకు, పోలీసు శాఖవారికి నిర్మాత డి వి ఎస్ రాజు పత్రికాముఖంగా కృతజ్ఞతలు తెలుపుతున్నారు

శోభన్‌బాబు, వాణిశ్రీ అభిమాన సంఘ సభ్యులు షూటింగుకు వచ్చి, తమ ప్రేమాభిమానాలను ప్రదర్శించినందుకు వారికికూడా నిర్మాత థ్యాంక్స్ తెలుపుతున్నారు

ప్రేక్షక జనరంజకంగా నిర్మిత మవుతున్న యీ చిత్రం త్వరలో విజయా పిక్చర్స్ ద్వారా విడుదలవుతుంది



"సంతానం సౌభాగ్యం"లో
విజయనిర్మల, విజయ నిర్మల





ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఫాన్స్ అసోసియేషన్ పాలకొల్లు మహాసభలో 1974 వ సంవత్సరపు ఉత్తమ నటుడుగా ఎన్నికైన నాగేశ్వరరావు, ఉత్తమ నటిగా ఎన్నికైన వాణిశ్రీ అవార్డులని అందుకుంటున్న దృశ్యం.

## సినిమా

### వసంతకు ప్రమోషన్ !

ఒకనాడు పెండ్యాల నాగేశ్వరరావు వసంతను నేపథ్య గాయనిగా "వాగ్దానం" చిత్రం ద్వారా పరిచయం చేశారు. అప్పట్నుంచి యిప్పటికి రెండు వేల అయిదువందల పాటలను వసంత పాడింది. తెలుగు, తమిళం, హిందీ, కులు, కన్నడం భాషా చిత్రాలలో ఎన్నో మధురమైన పాటలను పాడి, అందరి చేతా సెహభాష్ అనిపించుకొనియున్నది.


మొన్నటిదాకా సింగర్‌గా వున్న వసంత యిప్పుడు మ్యూజిక్ డైరెక్టర్ అయింది. ఎస్. ఎస్. మూర్తి ఆశీర్వాదబలంతో, గబ్బిట వెంకట్రావు ప్రోత్సాహ బలంతో పద్మలక్ష్మి పిక్చర్స్ వారి మొదటి చిత్రానికి సంగీత దర్శకురాలైంది.

వసంతకు బాధ్యత పెరిగింది. పెద్ద బరువును మోయవలసి వచ్చింది. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొన గలిగితే, యీ కొత్త హోదాలో ఆనందాన్ని అనుభవించ వచ్చు.

(47 వ పేజీ చూడండి)

"బ్రతుకే ఒక పండుగ"లో రాధిక, ఆనంద్




విశ్రాంతి పొందండి! చార్మినార్ త్రాగండి.
అచ్చమైన మేలిరకం
పొగాకుల పరిమళము
కమ్మదనం అనుభవించండి
65* పైసలకు
10
CHARMINAR
చార్మినార్
భారతదేశపు అత్యధికంగా
అమ్ముడుబోయే సిగరెట్
వి ఎస్ టి తయారీ
* సిఫారసు చేయబడిన అధికతమ చిల్లర ధర (స్థానిక పన్నుల అనుసారం)
CMVS 133-234 TEL

# చిగురించిన జీవితం

## ముద్దంశెట్టి హనుమంతరావు

*(గత సంచిక తరువాయి)*

ఓ రోజు, రామరాజే కొడుకుని వుద్దేశించి అన్నాడు.

"శ్రీనివాస్ పదిహేను రోజులై అగుపించడమేలేదురా! వూళ్ళో లేడంటావా ?" అని.

"అదే నాకూ ఆశ్చర్యంగా వుంది నాన్నా? రోజూ తప్పనిసరిగా వచ్చే వ్యక్తి, హఠాత్తుగ రాకపోవడానికి తప్పకుండా యేదో కారణం వుంటుంది. వాళ్ళ వూరు వెళ్ళాడేమో !" అన్నాడు, శ్రీధర్.

"నేనూ అదే అనుకుంటున్నా(రా ? అయినా, వూరెళ్ళినవాడు అక్కణ్ణించి ఓ వుత్తరంముక్క రాస్తే పోయేదిగా !"

"మన అడ్రసు అతనికి తెలియొద్దూ ?"

"అదీ నిజమే అనుకో ! అయినా మవ్వు ఓసారి వెళ్ళి వాకబు చేసిరారా."

"అలాగే నాన్నా !"

"అన్నట్టు నీ డిస్పెన్సరీ ప్రారంభోత్సవానికి యేర్పాట్లన్నీ జరిగినట్టేనా ?"

"సుమారు పూర్తయినట్టే నాన్నా !"

రామరాజు తృప్తిగ ఓ నిట్టూర్పు విడిచాడు.

### 4

రోజులు గడుస్తున్నాయి. కాని, శ్రీనివాస్ జాడలేదు. శ్రీధర్ ఆరాతీస్తే, శ్రీనివాస్ వూళ్ళో వున్నాడన్న విషయం తెలిసిందిగాని, అతడు యెందుకు రావడంలేదో, యెవరికీ అర్థంకాలేదు. సీత కంగారు అధికమయ్యింది.

ఓ రోజు సీత బాత్‌రూమ్‌లోకి వెళ్ళి వాంతి చేసుకోవడం, యశోదమ్మ గమనించి, నీరైపోయింది. ఆమె హృదయంలో యేదో అనుమానం మెరుపులా తళుక్కున మెరిసేసరికి, కూతురు దగ్గరకి ఆతృతగా వెళ్ళింది.

"ఏమయ్యిందే అమ్మాయ్? ఒంట్లో బావుండటంలేదా ?" అంది మెల్లగా.

సీతకి, కళ్ళు చిమ్మ చీకట్లు క్రమ్మినయ్. భయంతో వొళ్ళంతా కంపించింది. దుఃఖం వెల్లువలా పొంగుకొచ్చింది. నోట మాట రాలేదామెకి. ఏం చెప్పాలో తెలీని విషమ స్థితి యేర్పడింది.

"అమ్మా..." అంటూ, చిన్నపిల్లలా బావురుమంటూ తల్లి ఒడిలో వాలిపోయింది. సీత కళ్ళ నుండి రాలిన వెచ్చని కన్నీటి బిందువులు యశోదమ్మ మెడమీద పడేసరికి, గతుక్కుమంది. ఆ తల్లి హృదయం మంచులా కరిగిపోయింది. ఆమెకి, పరిస్థితి యేమిటో అర్థమైపోయింది. ఈసారి కళ్ళు తిరగడం, ఆమె వంతయ్యింది. కూతురు మొహాన్ని తనకేసి తిప్పుకుని, కన్నీటిని తుడుస్తూ.

"చదువుకున్నదానివి... నువ్వా యింత తెలివిహీనంగా ప్రవర్తిస్తావని యెవరనుకుంటారమ్మా ? నీమీద మా కెంతో నమ్మకం, విశ్వాసం వుండేవి. మా నమ్మకాన్ని వమ్ముచేశావు. ఇంతకీ, నిన్ను మోసగించినవాడు, శ్రీనివాసేనా ?" మెల్లగా అంది, యశోదమ్మ. ఆ పరిస్థితుల్లో తల్లి హృదయం యెంతగా తల్లడిల్లిపోతుందో, యశోదమ్మ కంపిత స్వరమే చెప్పక చెబుతుంది.

సీత, ఔనన్నట్టు తలూపింది, వెక్కి వెక్కి యేడుస్తూ. మరింకేమీ చెప్పడానికి ఆమెకి శక్తి లేకపోయింది.

యశోదమ్మ, బరువుగా ఓ నిట్టూర్పు విడిచింది. "శ్రీనివాస్ యెంతో వుత్తముడని, సంస్కారం గలవాడని అనుకున్నామమ్మా! అతడిపై యింకా మీ నాన్నకి అభిమానం వుంది. నమ్మకం వుంది, యిన్నాళ్ళనించి అగుపించకపోయినాను ! ఎందుకోమరి, నాకు మాత్రం అతణ్ణి చూస్తుంటే, నమ్మకం యేర్పడ్డంలేదు."

"ఆయన మంచివాడేనమ్మా ! కాని, పరిస్థితులేమిటో, మనకి అర్థం కావడంలేదు." నీరసంగా అంది, సీత.

"ఏం జూసుకొని నువ్వంత ధైర్యంగా మాట్లాడుతున్నావో నాకు బోధపడ్డం లేదు సీతా ! ఇప్పుడేం చెయ్యడమో, నాకు కాళ్ళూ చేతులాడ్డం లేదు. ఈ విషయం బైటికి పొక్కిందంటే, మన కుటుంబానికి యెంతో అప్రతిష్ట ! నీ జీవితానికో మాయని మచ్చ ! కన్నతల్లిగా, యిప్పుడేంచెయ్యాలో నాకు బోధపడ్డంలేదు." అంది అయోమయావస్థలో, యశోదమ్మ.

సరిగ్గా అదే సమయంలో 'యశోదా... యశోదా...' అంటూ రామరాజు వస్తూ వుండటం, వాళ్ళిద్దరూగమనించారు. సీతకంగారు అధికమైంది.

"అమ్మా... యీ విషయం నాన్నతో చెప్పకమ్మా !" రుద్ధస్వరంతో మెల్లగా అంది సీత.

యశోదమ్మ చాటుగా కళ్ళొత్తుకుని, భర్తకి యెదురుగా వెళ్ళింది.

"ఏం చేస్తున్నారూ తల్లీకూతుర్లు యిక్కడ...?" అన్నాడు రామరాజు.

"అబ్బే ! ఏమీ లేదండీ ! ఏమిటి విశేషం...?"

"మరేం లేదుగాని, మన లాయరు పరమేశం గారింటికి వెడదామనుకున్నాం కదూ — ఆలస్యమేమిటి ? బైలుదేరు... అమ్మాయ్ సీతా, నువ్వూ తయారుకావమ్మా !"

ఏడుపొచ్చింది సీతకి. అయితేనేం — ధైర్యాన్ని కూడదీసుకుని, కృత్రిమమైన మందహాసాన్ని తెచ్చి పెట్టుకుంది.

"మర్చిపోయాను నాన్నా ! నా స్నేహితురాలి బర్త్ డే పార్టీకి వెళ్ళాలి" అంది.

"సరే... నువ్వు బైలుదేరు యశోదా !"

"నాకు వొంట్లో యేం బావుండటం లేదండీ ! ఇందాకట్నుంచీ ఒహటే తలనొప్పి... మీరు వెళ్ళి రండి..." అనేసింది యశోదమ్మ.

"సరే, నాకు తప్పదుకదా ! వస్తున్నామని ఫోను చేశాను కూడాను. నేనయినా వెళ్ళకపోతే బావుండదు." అంటూ అక్కణ్ణించి నిష్క్రమించాడు, రామరాజు

కనుపాపల్లాంటి పిల్లల్ని సర్వదా కనురెప్పల్లా కాపాడే వ్యక్తి, తల్లి. అందుకే తల్లికి వుండే స్థానం గౌరవం, ప్రాధాన్యత, మరే యితర వ్యక్తికి వుండదు సాధారణంగా. సీత, తల్లికి మనసులో కృతజ్ఞత చెప్పుకుంది. "అమ్మా, నేనలా వెళ్ళొస్తాను...' అంది, సీత సాలోచనగా.

యశోదమ్మ గతుక్కుమంది. కూతురు ఆ క్షణంలో యే అఘాయిత్యానికి పూనుకుంటుందోనన్న అనుమానం, భీతి, ఆమెని ఆవరించాయి.

"ఎక్కడికమ్మా ?" ఆమె గొంతు జీరవోయింది.

తల్లి కంగారు పడ్డంలోని అంతరార్థం గ్రహించింది, సీత. బరువుగా ఓ నిట్టూర్పు విడిచింది.

"నువ్వేమీ కంగారు పడకమ్మా ! నువ్వూహించినట్టు, నాలో నిరాశ పూర్తిగ నిండలేదు. నేనేదో అఘాయిత్యానికి పూనుకుంటానని నువ్వూహిస్తే, అది పొరపాటే. శ్రీనివాస్ పట్ల నా కింక నమ్మకం పోలేదు. ఆయన నన్ను వంచించడన్న విశ్వాసం నాలో పూర్తిగా వుంది. అతనింటికి వెళ్ళొస్తాను. అసలు జరిగిందేమిటో తెలుసుకుని వస్తాను." అంది.

"నీ మాట మీద నాకు నమ్మకం వుందమ్మా! వెళ్ళిరా ! వేగిరం వచ్చేసెయ్. నువ్వు వచ్చేవరకూ నాకు ఆతృతగానే వుంటుంది." అంది యశోదమ్మ, యెంతో ప్రయత్నం మీద దుఃఖాన్ని ఆపుకుంటూ.

సీత చరచరా తన గదిలోకి వెళ్ళి, పర్సు చేత పట్టుకుని బైటికి నడిచింది. ఆమె బస్సు స్టాప్‌కేసి నడుస్తోందేగాని, ఆమె మెదడులో అసంఖ్యాకమైన ఆలోచనలు ఒకదాన్నొకటి ఢీ కొట్టుకుంటున్నాయి. తనకి వివాహం కాకుండ తల్లి కాబోతుంది... అన్న ఆలోచన ఆమె నవనాడుల్ని కృంగదీసింది. భగవాన్, యేమిటీ పరీక్ష? శ్రీనివాస్ మాటల్ని నమ్మి తనెందుకు కరిగిపోయింది. ఇంతకీ, శ్రీనివాస్ తనని చేవడతాడా ? లేక మోసగిస్తాడా ?... యింక ఆలోచించలేకపోయింది. నుదుటిమీద చిరుచెమటను చీర చెంగుతో ఒత్తుకుంది. బస్సు అప్పుడే వచ్చి ఆగింది. లోపలికి వెళ్ళి కూచుంది. తనలో యేపాటి వుత్సాహం లేనట్లుగానే ఫీలవుతోంది. బస్సు కదిలింది...

### 5

సీత, శ్రీనివాస్ ఇల్లు చేరుకునేసరికి, అప్పుడే అతను బైటికి బైలుదేరాడేమో, తలుపులు వేస్తున్నాడు. సీతను చూసి, పెద్దపులిని చూసినంతగా బెదిరిపోయి, వేసిన తలుపులు తీసి, లోపలికి నడిచాడు శ్రీనివాస్. "రా, సీతా !" అన్నాడు సభ్యతకి భంగంలేకుండా, మందహాసంతో.

ప్రాణం లేచివచ్చినట్టయ్యింది సీతకి, శ్రీనివాస్‌ని చూడగానే.

"హమ్మయ్య ! మరికాస్త ఆలస్యమైతే మీరు దొరక్కపోదురు." అంటూ సోఫాలో కూలబడింది.

"మనం బైటికిపోయి మాట్లాడుకుందామా సీతా ?" అన్నాడు శ్రీనివాస్. అక్కడుండి మాట్లాడ్డం అతనికి యిష్టంలేదో యేమో !

"తరువాత వెళ్దాం. కాస్సేపు కూర్చోండి..."

శ్రీనివాస్‌కి కూచోవడం తప్పలేదు.

"మీ దర్శనం లేదేమిటండీ చాలా రోజులై..." అంది సీత.

సీతను మొదట చూసినప్పుడే, శ్రీనివాస్ చురుకైన మెదడు, మెరుపులాంటి ఆలోచనలు సాగించి, ఒక ప్లాను రూపొందించుకుందేమో — మనిషి యేమీ కంగారుపడ్డేదు. తొణకలేదు. సన్నని మందహాసం చేశాడు.

"నువ్వా ప్రశ్న వేస్తావని, ముందే వూహించాను సీతా! నేనీమధ్య వూళ్లో లేనని నీకు తెలీదుగా! అందుకే నీకు అగుపించలేదు. నిజం చెప్పాలంటే, యిప్పుడు నేను మీ యింటికే బైలుదేరాను." ఫస్టుక్లాసయిన అబద్ధాన్ని, అదో పచ్చి నిజం అన్నట్టుగ చెప్పేశాడు.

శ్రీనివాస్ మాటల్ని నిజంగానే నమ్మింది సీత. అతణ్ణి అనుమానించడంలేదుకదా, అందుకనే నమ్మింది.

"అయితే మన వివాహానికి, మీవాళ్ళ అంగీకరించినట్టేనా?" అంది ఆసక్తికరంగా. అతను వూళ్లో లేడంటే, బహుశా వాళ్ల వూరు వెళ్లివుంటాడనే ఆమె భావన.

"అఫ్‌కోర్స్! మా అమ్మ అంగీకరించిందనుకో! కాని..." అని కాస్త నీళ్లు నమిలేసరికి, సీత కంగారుగా కళ్లింతవి చేసుకొని, ముందుకి వొంగుతూ,

"కానీ ... యేమిటండీ?" అంది. అప్పుడే ఆమె హృదయస్పందన అధికమయ్యింది.

శ్రీనివాస్ నిండుగా నవ్వేడు.

"ఎందుకా కంగారు సీతా? పూర్తిగ నన్ను చెప్పనిస్తావా? విషయం యేమిటంటే, మా నాన్నగారు వూళ్లో లేరు. ఏదో పనిమీద హైదరాబాద్ వెళ్లారుట. ఆయన తిరిగొచ్చేసరికి, మరో నెల రోజులైనా అవుతుందని అమ్మ చెప్పింది. అందుకే తిరిగి వచ్చేశాను. మళ్లీ వెళ్లాలి. రోజూ మీ యింటికొచ్చి యీ కబురు చెప్పాలనే అనుకుంటున్నాను. అయితే, ఏదో ఒక అవాంతరం వచ్చి పడుతుంది. ఇవ్వాళ పనిగట్టుకుని బైలుదేరాను." తడుముకోకుండా చెప్పాడు, శ్రీనివాస్.

సీత, నిస్పృహతో ఓ నిట్టూర్పు విడిచింది. తన దురదృష్టం కాకపోతే, వాళ్ల నాన్నగారు యిప్పుడే హైదరాబాద్ వెళ్లాలా?

"అంతా నా దురదృష్టమండీ?" నీరసంగా అంది.

"నువ్విలా నిరుత్సాహపడితే యెట్లా సీతా! వారం పదిరోజులు యిటూ అటూగా ఆలస్యమైనా, మనం పెళ్లి చేసుకోవడం ఖాయంకదా! నువ్వు నన్ను నమ్మాలి. నువ్వు అసలు నన్నెందుకు అనుమానిస్తున్నావో నాకు బోధపడ్డంలేదు సీతా!"

"అనుమానించడంలేదండీ! పూర్తిగ మిమ్మల్ని విశ్వసిస్తున్నాను. కాని, ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా, నేను ఆతృత చెందాల్సి వస్తోంది." అంది



*జరిగిన కథ 1:* డాక్టర్ రామరాజు యశోదమ్మల సంతానం శ్రీధర్, సీతలు. మెడిసిన్ చదివిన శ్రీధర్ ప్రయివేట్ డిస్పెన్సరీ ప్రారంభించాలనుకుంటాడు. తనని ప్రేమించి, అమాయకంగా నమ్మిన సీతను పెళ్లి చేసుకొనటానికి సంశయిస్తాడు శ్రీనివాస్.

నీరసంగా. ఆమె మొహంలో భయాందోళనలు లీల మాత్రంగా అగుపించాయి శ్రీనివాస్‌కి.

"ఏమిటూ పరిస్థితి...?" ఆమె మొహంలోకి చూస్తూ అడిగాడు.

"ఎలా చెప్పనండీ..." అంటూ రుద్ధస్వరంతో 'నేను తల్లిని కాబోతున్నానండీ! ఈ విషయం మా అమ్మకి తెలిసిపోయింది. ఇప్పుడేం చెయ్యడమో, నాకు అర్థంకావడంలేదండీ! నా కంగారుకి యిదే కారణం...'' అంది.

శ్రీనివాస్, గతుక్కుమన్నాడు. అతని మొహం హఠాత్తుగ పాలిపోయింది. -యినా, సంభాళించుకొని, చిన్నగా నవ్వేశాడు.

"ఓస్... దీనికేనా కంగారు? ఇప్పుడేం మించి పోయిందని? పెద్దల సమక్షంలో పెళ్లి జరగక ముందే మనం రిజిష్టర్డు మారేజ్ చేసుకుందాం. అప్పుడెవ్వరూ నోరెత్తడానికి అవకాశం వుండదు..." పరిష్కారమార్గం కనుగొన్నట్టుగా. యెంతో అభిమానంతో అన్నాడు.

నిజం చెప్పాలంటే సీత మనస్సు ఆనందంతో వుక్కిరిబిక్కిరయ్యింది ఆ క్షణంలో. ఆమెలోని భయం, కంగారు, పటాపంచలయ్యాయి. శ్రీనివాస్ చెప్పింది వుత్తమ మార్గంగా తోచిందామెకి.

"మీరు చెప్పింది బావుంది మేష్టారూ! మనం జాప్యం చెయ్యకుండా రిజిష్టర్డు మారేజ్ చేసుకుందాం. అప్పుడుగాని నా మనస్సు కుదుట పడదు."

"రేపు ఆ యేర్పాట్లన్నీ చేసి, మీ యింటికొస్తాను."

"సరే! బైలుదేరండి. మా ఇంటికెడదాం. మా అమ్మా, నాన్నా మీ కోసం ఎదురు చూస్తున్నారు."

"కాదు సీతా, రేపు యెలాగూ మీ యింటికొస్తానుగా! నాకు తెలిసిన ఓ లాయరున్నాడు. అతణ్ణి కలుసుకొని, రేపటికోసం యేర్పాట్లు చేసుకోవాలి. ఇప్పటికి నువ్వెళ్ళు..." అంటూ లేచాడు, శ్రీనివాస్.

సీత కూడా లేచింది.

"రేపు తొందరగా రండి... మీకోసం యెదురు చూస్తుంటా."

"అలాగే! పద అలా బస్సు స్టాప్ వరకు వచ్చి అక్కణ్ణించి నా పనిమీద నేను పోతాను." అంటూ యింటికి తాళం వేసి ఆమె వెంట బస్సు స్టాప్ వరకూ వచ్చాడు, శ్రీనివాస్. సీతని బస్సెక్కించి 'టా టా' చెబుతూ యింటి ముఖం పట్టాడు.

ఇంట్లోకి అడుగు బెట్టి, సోఫాలో కూలబడిపోయాడు, శ్రీనివాస్. అతని మస్తిష్కం, పని చెయ్యడం మానేసింది. సిగరెట్ వెలిగించాడు. అనిశ్చలంగా పొగ వదుల్తూ, క్షణాలు గడిపాడు. ఇప్పుడేం చెయ్యడం? సీత సమస్యను యెలా యెదుర్కోవడం? ఆమెకీ, తనకీ, యే విధమైన సంబంధం లేదని, ఒక్క ముక్కలో త్రెంచి పారేస్తే...? అబ్బే... అంత సులువుగా తాను బైటపడలేడు. డాక్టర్ రామరాజు, అతని కుమారుడు డాక్టర్ శ్రీధర్, వూళ్ళో బాగా పలుకుబడిగల వ్యక్తులు. వాళ్లు తనని సర్వనాశనం చేసినా

## చిగురించిన జీవితం

ఆశ్చర్యపడాల్సిందేమీ వుండదు. తనని ఉద్యోగం లోంచి వూడబీకించగలరు... నలుగురి సమక్షంలో అవమానించి, బలవంతంచేసి సీత మెడలో తాళి కట్టించగలరు ... తనని జైల్లో పడేయించగలరు... అలాగని, సీతని పెళ్లి చేసుకుంటేనో...? అబ్బే ... అది మరీ ప్రమాదం. సంసారమనే మురుగు గుంటలో పడ్డమా? అదెప్పటికీ కానేరదు. అటువంటి పొరపాటు, తాను జీవితంలో చెయ్యడు ... చెయ్యకూడదు. ఈ బోడి వుద్యోగం లేకపోతే, మరోచోట ఎక్కడైనా దొరుకుతుంది. ఈ వూరే అన్న మాటేమిటి? మరో వూళ్ళో దొరుకుతుంది. ఇంక వుపేక్షించరాదు. రేపు శ్రీధర్ వచ్చినా రావొచ్చు ... ఏమైనా తను వెంటనే ఈ వూరికి గుడ్‌బై కొట్టేయాలి ... అన్న నిర్ణయాని కొచ్చేశాడు, యిన్ని ఆలోచనల తరువాత. లేచి, చకచకా సామాను సర్దడం ప్రారంభించాడు.

### 6

మరుసటిరోజు సాయంకాలం, టిప్‌టాప్‌గా ముస్తాబై, శ్రీనివాస్‌కోసం ఎదురుతెన్నులు చూస్తూవుంది సీత. శ్రీనివాస్‌తో క్రితంరోజు సాగిన సంభాషణంతా తలిదండ్రులతో చెప్పింది కూడా. అందుకే, వాళ్లు ఆసక్తితో అతని రాక కోసం చూస్తున్నారంటే, వింతేమీ లేదు.

చీకటిపడింది. ఏడు దాటింది. ఎనిమిది దాటింది. కాని, శ్రీనివాస్ రాలేదు. సీత మొహంలో విషాదచ్ఛాయలు క్రమంగా ముసురుకున్నాయి. ఆమె నయనాల్లో నీరు గూడు కట్టుకోవడం ప్రారంభమయ్యింది. యశోదమ్మ పరిస్థితీ అలానేవుంది సుమారు. నిజమేమరి! కూతురులోని ఆవేదన, ఆరాటం, ఆమె అర్థంచేసుకోగలిగింది, విషయం తెలుసునుగాబట్టి.

"అమ్మాయ్, శ్రీనివాస్ యింతవరకూ రాలేదేమిటే?" అడిగాడు రామరాజు.

జవాబు చెప్పగలిగే శక్తిని, యేనాడో కోల్పోయింది సీత. కాని, యేదో జవాబు చెప్పాలికదా! శక్తినంతా కూడదీసుకుంది.

"వస్తాననే చెప్పారు నాన్నా!" అనిమాత్రం అనగలిగింది.

రామరాజు, బరువుగా ఓ నిట్టూర్పు విడిచాడు. శ్రీనివాస్ పట్ల అతనిలో యింతవరకూ వుంటూ వచ్చిన అభిమానం, అనుమానంగా పరిణమించింది.

"నువ్వేమీ అనుకోపోతే, ఓ విషయం చెబుతానమ్మా సీతా! శ్రీనివాస్ విద్యాధికుడే కావొచ్చు. కాని, అతని మనసు మాత్రం అతని విద్య ఔన్నత్యాన్ని అందుకోలేదేమో ననిపిస్తోంది. అతనిలో నిజాయితీ, నిశ్చలత, బాగా తక్కువేమోనని నా సంశయం. పోనీలే! ఇప్పటికయినా అతని నిజస్వరూపం బైటపడింది. నువ్వూ, మేంకూడా అదృష్టవంతులమే! అతణ్ణి మర్చిపో అమ్మా! అతనికంటె అన్ని విధాలా అధికృత గలవాడు, నీకు భర్తగా దొరుకుతాడు. లోకం గొడ్డుపోలేదు." అన్నాడు.

సీతకి, భోరున యేడ్వాలనిపించింది. శ్రీనివాస్ అసలు రూపం బైటపడేలోపునే తరుణం మించి పోయినట్టు, తండ్రితో యెలా చెప్పడం? తాను తల్లి కాబోతోందని, శ్రీనివాస్ ప్రతిరూపం తనలో పెరుగుతోందని, ఎలా తెలియజెయ్యడం? ఆ రహస్యం తెలిస్తే, ఆయన తట్టుకోగలడా? తనని క్షమించగలడా? ధర్మంచాలక శ్రీనివాస్ నిజంగానే తనని మోసగిస్తే, తనకి దారేమిటి? తనేం చెయ్యాలి? ... ఇలా ఆలోచిస్తూవుంటే, ఆమె కళ్లనుండి అప్రయత్నంగా అశ్రుధారలు చెక్కిళ్ల మీదికి జాలువారినయ్. వాటిని, ఆ చీకట్లో రామరాజు గమనించలేదు. చప్పున సీత మొహం ప్రక్కకి తిప్పుకొని, చీరచెంగుతో కళ్లొత్తుకుంది.

"అంతేలెండి నాన్నా..." అతికష్టంమీద జీరవోయిన స్వరంతో అనేసి, అక్కణ్ణించి లేచి లోపలికి వెళ్లిపోయింది, సీత.

"అమ్మాయి బాగా దిగాలుపడిపోతోంది యశోదా! అందుకే, యీ ప్రేమ వ్యవహారాలంటే, నాకు గిట్టవు..." విసుగ్గా అన్నాడు, రామరాజు.

భర్త యిలా అనడం, యశోదమ్మకి ఉక్రోషం తెప్పించింది.

"అందుకేగామోసు, వాళ్లిద్దర్నీ స్వేచ్ఛగా తిరగనిచ్చారు! అమ్మాయిని నేను మందలించితే, మీరేమో దాన్ని వెనకేసుకొచ్చి, నన్నే కూకలేసేవారు ... మర్చిపోయారా అప్పుడే...?"

"ఔనమకో! కాని, మరీ అంత మమకారం పనికిరాదేమో!"

అప్పుడే శ్రీధర్ స్కూటర్ని గేటు ముందుంచి లోపలికి వచ్చాడు.

"ఒరేయ్ అబ్బాయ్, శ్రీనివాస్ ఎక్కడుంటున్నాడో తెలుసా?" అంది, యశోదమ్మ.

"తెలుసునమ్మా! ఏం?"

"నువ్వెళ్లి వున్నపాటున అతణ్ణి తీసుకురా!"

"మనచుట్టూ అతడు ప్రదక్షిణ చెయ్యాలి గాని, అతడికోసం మనం ప్రాకులాడ్డం యేమిటే యశోదా?" తమ అంతస్తుని దృష్టిలో పెట్టుకుని అన్నాడు, రామరాజు.

"ఔనమ్మా! అతడే వస్తాడులెద్దూ!" తండ్రికి వంతపాట పాడుతూ అన్నాడు, శ్రీధర్.

"అతనితో పెళ్లి విషయాలు మాట్లాడాలిరా! నువ్వెళ్లి తీసుకొద్దూ!" అంది కొడుకుని వుద్దేశించి.

ఎదురుప్రశ్న వెయ్యకుండా, శ్రీధర్ వెనక్కి తిరిగాడు. స్కూటర్ కదిలింది.

రామరాజు, భార్యకేసి మూటిగ చూస్తూ "ఇదేం బాగుండలేదు యశోదా! మనం అతడి కోసం ప్రాకులాడితే, మనమే చులకనైపోతాం తెలుసా?" అన్నాడు కాస్తంత చిరాకుగా.

యశోదమ్మ, నిస్పృహతో ఓ నిట్టూర్పు విడిచింది. తనింక ఆ రహస్యాన్ని తనకీ, కూతురుకే పరిమితంగా వుంచుకోకూడదనుకుంది. కాని, సీత అభ్యర్థన గుర్తుకొచ్చింది. సీత దీనంగా తనని యింకా అదే స్వరంతో అభ్యర్థిస్తున్నట్టే కళ్ల ముందు కనిపించింది. ఇప్పుడే తొందరపడి చెప్పడం అనుచితమేమో ననిపించిందా కన్నతల్లికి. కృత్రిమమైన ఓ మందహాసాన్ని తెచ్చిపెట్టుకుంది.

"ఆఁ ... యేమీ లేదులెద్దూరా! ఎవరికున్న

(40వ పేజీ చూడండి)

# కలలూ — సంకెలలూ

(18వ పేజీ తరువాయి)

గోరింటాకు పండేదాకా వ్యవధి ఏది, తెల్లారి దాకా వ్యవధానమేది! ఎంత చీకటితో లేపినా ఆలశ్యం చేసేశారని యింటిళ్లిపాది మీదా ఊరంత అలక. ఆదరా బాదరా కాలకృత్యాలు తీర్చేసుకుని కడుపునిండా చద్దెన్నం కొట్టెయ్యడం. ఇక అన్ని వీధులూ మనవే. ఇక వయసులోఉన్న పిల్లల్ని చూసి వెర్రెత్తిన ఆ వెన్నెలలో మన ఆటలే ఆటలు. ఒక రకమా, ఓ లోకమా! నీకు జ్ఞాపకముందీ, అ రోజుల్లో, రామారావుపేట వీధుల్లో మనం ఆడుకుంటూంటే, వాళ్లని కూడా ఆటలో చేర్చుకోలేదని మన వయసు మగపిల్లలు చేసే అల్లరీ! కొళాయి చెరువు తోటలోంచి పల్లేరుకాయలు ఏరితెచ్చి మనం ఆడుకునే అన్ని దారుల్లోనూ జల్లేవారు. అప్పుడేకాదు, ఎప్పుడూ పరుస్తూనే ఉన్నారు. ఆడదాని జీవితంలో మొగాళ్లు, ముళ్లు!

ఏమిటో అన్నిరకాల పండుగలు వస్తాయి వెడతాయి. కాని దేనికీ కన్నెమనసుతో యింత దగ్గరతనం నాకు కనపడలేదే శకూ! ఉయ్యాలలూగి, ఉపవాసముండి, ఆ తదియ రాత్రి, ఆ చంద్రుడి కోసం అలా అలా చూస్తూ కూచోడం ఎంత కష్టం! ఆడదాని బతుకులోని నిత్య నిరీక్షణకి అదే మొదలేమో! కలువరేకు కళ్లతో చూడగా చూడగా దర్శాగా దయచేస్తాడు ఆ చలవరాతి దేవుడు! వారికి పూజ చేసి అట్లు నైవేద్యం పెడితేగాని కన్నె పిల్లల కడుపు నిండదు, కలలు పండవు!

నిన్న చూడ్డంతో పాటు రేపే అట్ల తదియ అని గుర్తు రాగానే ఆ పాత వాసనలన్నీ మరొకసారి మత్తెక్కించాయ్ శకూ! అందులో కలుపుకోడానికి గోంగూర పచ్చడి, ఉల్లిపాయ పులుసే కాదు, అసలు చద్దెన్నమే లేక పోవచ్చు. నంజుకుని తినడానికి తియ తియ్యని చెరుకు పాకమే కాదు, పుల పుల్లని అట్లే దొరక్కపోవచ్చు. కాని మనం ముగ్గురం ఉన్నాం. మన కళ్లల్లో యింకా తడి ఉంది. మన గుండెల్లో యింకా సందడి ఉంది. రేపు తెల్లారుఝామున లేచి ఆ వెన్నెల్లో ఆరుబయట ఒకరి కళ్లల్లోకి ఒకరు చూస్తూ కూచుందాం. ఇక నన్ను వాగించకు, అడ్డు చెప్పకు, ఆలశ్యం చెయ్యకు. ఓ సిటీబస్సు అందకపోతే దాని బాబు మరోటి, పద మీ రేవతి దగ్గిరకి ఎగిరిపోదాం.'

'బాగుందే, మీరు పెళ్లికి వెళ్లరూ, ఇక్కడిలా కబుర్లు చెబుతూ కూచుంటే అక్కడ మీకు వేళయిపోడంలేదూ?

'ఇంతసేపూ నేను గొంతుక చించుకున్నందుకు యిదా నీ కబురు! భేష్! సెలయేరులా ఉండేదానివి చింత మొద్దులా తయారయావేమిటే తల్లీ! నిన్న నీ నోట విని మరిది భోగ భాగ్యాలు విని మా వారికి మతి పోయిందనీ, యీ పెళ్లి వ్యవహారం అంతా నువ్వు మా యింటికి రాకుండా అల్లిన కట్టు కథ అనీ యింకా బోధపడలేదా నీకు! ఆయనకి తప్పింది గాని నాకు తప్పుతుందా నీతో! పద, పద. నిన్ను చాలా అడగాలి.'

'అదికాదే!'

'మరి ఏది అవునూ! ఇంత నాన్పుడు ఎప్పుడు ప్రవేశించింది నీలో?'

'నీకూ నాకూ కుదిరితే మా చెల్లికి కుదిరి చావొద్దూ? ఇంత ఉత్సాహమూ యిలా నీరు కారిపోడం నేను భరించలేకుండా ఉన్నాను. కాని ఏం చేయను! మా రేవతి అవస్థ అనుకోకుండా అలా అయింది.'

'ఏం ఉన్నట్టుండి ఏం పట్టుకొచ్చిందీ, నీకా, మీ రేవతికా?'

'దాని ఆడపడుచుకి పురుడొచ్చిందని కబురొచ్చి, అది మధ్యాహ్నమే తుని బస్సు ఎక్కేసింది!'

'సె-హ-భా-ష్!' అని పకపక నవ్వుతూ అంది ఇందిర.

'ఇక మనకి మిగిలింది ఒకటే, శంకర మఠం! ఏం అలా తెల్లబోతావ్, నీకేకాదు. ఎన్ని మొట్టికాయలు తిన్నా యింకా అక్కడికి చేరేలా నాకూ గుండె గట్టిపడలేదు. ఇక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో నిజంగానే ఉంది శంకరమఠం అని. ఎప్పటికైనా అందరూ చేరకపోతారా అని కాబోలు విశాలంగానే కట్టించారు. దీపాలు పెట్టేవేళకి కిట కిటలాడుతూ కళకళ లాడుతూ ఉంటుంది గాని యీ వేళకి బిక్కు బిక్కుమంటూ ఉంటుంది. పద దాన్ని కాసేపు అలంకరిద్దాం.'

దార్లో కిళ్లీషాపులో కూల్‌డ్రింక్స్ తాగి అక్కడికి చేరుకున్నారు వాళ్లిద్దరూ. ఆ ప్రశాంతతా ఏకాంతమూ చూసి శకుంతల ముచ్చట పడింది.

'ఇప్పుడు చెప్పవే... ఎప్పుడో పెళ్లినాడు చూశాను మీ శ్రీవారిని. అప్పుడే ఓ జీవితం అనుభవం అయిపోయిందాన్లా కనిపిస్తున్నావు ఎలా చూస్తాడు మీ ఆయన నిన్ను? ఎక్కడేం చెప్పేసుకుంటారో అని ఆడాళ్ల వెంట పడడుగా మావారిలా? నీమటుకు నిన్ను బతకనిస్తాడుగద!'

ఇందిర్ని చూసి, శ్రీధర్ మీద ఆ విసుర్లు వింటున్నకొద్దీ శకుంతలకి అరికాలిమంట నెత్తికెక్కుతోంది. దీని పుట్టింటారి సిరి సంపదలు ఎవరెరగరని! తన పెళ్లయిన ఏ ఆరేడేళ్లకో చచ్చిచెడీ అయింది. ఆఖరికి రెండో పెళ్లి వాడికైనా యిచ్చేద్దామని వాళ్లమ్మ సిద్ధపడింది. ఎవడికి తెలియని



భాగోతం! ఏప్పుడు ఏ నక్కని తొక్కిందో నవమన్మథుణ్ణి చేపట్టింది. ఏం పోయే కాలమా! ఆశకి అంతుండొద్దూ, దీని దరిద్రగొట్టు బతుక్కి ఏం తక్కువొచ్చిందని! నిన్న వాళ్లిద్దర్నీ అలా చూస్తేనే మతి పోయింది. ఇలాంటి వాళ్ల యిల్లెలా ఉంటుందో అని వాళ్లు ప్రయాణం పెట్టుకున్నారని తెలిసినా ఓసారి కళ్లతో వచ్చి చూస్తేగాని ఉండలేక పోయింది. నిజానికి అది యిల్లా యింద్రభవనంగాని! వంట గదిలో గ్యాస్‌స్టవ్వూ, కుక్కరూ, గ్రైండరూ... డ్రాయింగ్‌రూంలో సోఫాలూ, కుర్చీలూ, ట్రాన్సిస్టరూ... పడకగదిలో డన్‌లప్ పరుపులు గల డబుల్‌కాటూ ... ఎక్కడి కక్కడ కొళాయిలూ సీలింగ్ ఫేన్లూ... అన్నీ చూపించి 'ఇంకా టేప్ రికార్డరూ, గాడ్రెజ్ సేఫూ, ఫ్రిజిడెయరూ కొనలేకపోయానండీ... అవిలేని యిబ్బంది రోజూ పడుతున్నాం...ఇంకో ఏడాదికి ఎలాగా అమరుస్తాననుకోండి' అనే అతని కబుర్లూ...ఆధునిక సంసారంలో ఏవేం కావలసి ఉంటుందో అతనికన్న తెలిసిన వాళ్లెవరని! ఇవన్నీ వీళ్లు అమర్చుకున్నది ఎన్నేళ్లలో? మూడేళ్లయిందో లేదో! తన మొగుడూ ఉన్నాడు, పదేళ్లయింది పెళ్లై తనకి సిద్ధింపజేసినవి ఏమిటి! తలుచుకోడానికి కూడా సిగ్గుపడిపోయింది శకుంతల.


'ఏమిటో అనేం అనుకుంటాం శకూ... ఏమీ జరగదు...ఎలాగో యీడుస్తాం బతుకులు...ఉన్నపాటున ఉరేట్టుకోలేం కదా! ఏమంటావ్ మాటాడవేం మట్టి బుక్కడం లాగ?'

ఈ సారి శకుంతల ఊరుకోలేక పోయింది. మట్టిబుక్కడం మహా సర్పమై తిరగబడింది. పోనీ పోనీ కదా అని ఇంతసేపూ దిగమింగిన విషమంతా తిప్పితిప్పి కొట్టింది. మూల మూల బూజులన్నీ దులిపేసింది. పాచి పాచి కడిగేసింది.

'ఇంకా ఏం చాలలేదనే నీకా ఏడుపు! నీ కున్న స్వతంత్రం సౌభాగ్యం ఏ ఆడదాని కుందే?' అని నిలదీసింది.

'డబ్బు అనేది సుఖానికి కలికితురాయి కావచ్చు, గీటురాయి మాత్రం కాదు. ఎంత మాత్రం కాదు, శకూ! నీలో చూపుమాత్రమే మిగిలింది, పరిశీలన మాత్రం ఎక్కడికో పారి పోయింది— నీతో ఎలా చెప్పడమో బోధ పడ్డంలేదు' అంటూ అతి నెమ్మదిగా ఆరంభించింది ఇందిర.

'ఎన్నాళ్లకీ నాకు పెళ్లయీ గీత కనపడ లేదని— మా నాన్నగారు ఉన్నదంతా ఊడ్చి పెట్టి పదివేలిచ్చి నాకు పెళ్లి చేశారని వినే ఉంటావు. మా మావగారి ఆర్థిక పరిస్థితి కూడా అంతంతమాత్రమే. మావారి ఎమ్మెస్సీ పూర్తి అయేసరికే ఆయన చతికిలబడ్డారు. తమగోతిలోకి దిగిపోయినా సాటి సంసారిని కొంతవరకైనా లేవనెత్తుదామని నాన్నగారు శక్తికి మించిన ప్రయత్నంచేశారు. కాని మా వారు తన తండ్రిని ఆడబ్బులో వేలు పెట్ట నివ్వలేదు. రొక్కం అయితే అడుగుతారని అప్పటికప్పుడే అన్నీ కొనేశారు. ఇవన్నీ మొదట్లో తెలియలేదు నాకు. ఈ యాంత్రిక జీవనం చక్రాల చప్పుడులో అయినవాళ్ల ఆక్రందన నాకూ వినపడలేదు అప్పట్లో... ఈయన వెనక ముగ్గురు ఆడపిల్లలూ యిద్దరు మొగపిల్లలూ...తండ్రి ఎన్ని ఉత్తరాలు రాసినా 'నా కనీసవసరాలు తీరనివ్వండి' అని యీయన జవాబు! 'అలాగే, మేమందరం కట్టకట్టుకు చచ్చేక'అని ముసిలాయన రాసి ఊరుకున్నారు. నెలకి పాతిక రూపాయలైనా పంపమని కన్న తల్లి వచ్చి కన్నీళ్లతో అడిగితే కాణీ మిగలడం లేదు పొమ్మన్నారు. 'నెలకి ఏభై రూపాయిల రికరింగ్ డిపాజిట్ కడుతున్నాం కదండీ' అని నేను అడిగినందుకు ఆవిడా యిలా గుమ్మం



ఇది నీ ఏడుపా! చంపేశావ్! మా ఫాక్టరీ సైరన్ మోత కాబోలనుకుని డ్యూటీకి బయలుదేరాను!


దిగగానే నా చెంప ఛెళ్లుమంది! ఇక అత్త వారిపట్ల మా వారి ఆదరణ వేరే చెప్పాలా! ఏ పండుగకి పిల్చినా రైలు ఖర్చులు కాక కనీసం టెర్లిన్ సూట్ పెట్టితీరాలి. మావాళ్లకి యీయనొక్కరే అల్లుడు కాదుకదా! పోనీ యీయన యింత గణిస్తున్నారు కదా తెలీ కుండా ఏమైనా కూడబెట్టి పుట్టింటికి తరలిద్దామా అంటే పైస పైసకీ పద్దు! ఇందాక నువ్వు చూశావ్ గదా వాడు కాక మరో ఆడమనిషి ఇరవైనాలుగ్గంటలూ నామీద కాపలా! కాని నా ప్రయత్నం నేను మానలేదు సుమా! ముందు నేర్చుకుని, క్రమంగా నేనూ టీచరుగా గణిస్తానని, ఆయన్ని మోసబుచ్చి కుట్టు స్కూల్లో చేరేను. నేర్చుకోడానికి ఆ గుడ్డలే యింటికి తీసుకొస్తున్నానని అందర్నీ నమ్మించి, ఎదురింట్లో మిషనుంటే అక్కడ జాకట్లూ అవీ కుట్టడమే కాదు, పాపం ఆవిడ సాయంతోనే కుట్టుకూలి రాబట్టేదాన్ని ... నువ్వు నమ్మవ్...ఆర్నెల్లు వేళ్లూ కాళ్లూ ముక్కలు చేసుకుని ఓ రెండొందలు పోగుచేసి, పెద్ద పండుగ ముందు మా నాన్నకి చేరేశాను తెలుసా! ఇదిగో ఇదీ నా యింట్లో నా స్వేచ్ఛ ... ఇదే నేను అనుభవించే సంపద!'

ఒక్క నిమషం ఊరుకుని మళ్లీ అంది.

'ఇన్ని చెబుతున్న దాన్ని నే నెందుకింకా తిరగబడలేదో నాకే ఆశ్చర్యం ... చచ్చీ చెడీ నా భారం ఒదుల్చుకున్నారు నాన్నగారు. మళ్లీ అక్కడికే వెళ్లనా! ఓ డిగ్రీ అయినా లేదు... వీధినపడిన ఆడదాన్ని సంఘం ఎంతటి సానుభూతితో ఆదరిస్తుందో వింటున్నాం. చూస్తున్నాం...సర్దుకుపోడంతప్ప గత్యంతరం లేదనే చచ్చు సంస్కారం పుట్టి పెరిగేను. ఎలా, ఎలా తెగించను! అలా కాదని ఎన్నాళ్లు, ఎన్నాళ్లని భరించను! వేయి నాలికల అగ్ని వేదిక గాని కేవలం పిడికెడు పీలిక కాదే యీ గుండె! అంతే కాదు...'

అలా ఎక్కడిదాకా వెళ్లునో దూరం నుంచి వస్తున్న పని కుర్రాణ్ణి చూడగానే చటుక్కున లేచి నిలబడింది ఇందిర.

'అదిగో ఎలా తెలిసిందో ఆ వెధవ ఖుటే వస్తున్నాడు. ఇక నే వెడతాను. నీ గురించి ఎన్నైనా వినాలనుకున్నాను — నీ వ్యవహారం ఏమిటో అడ్డదిడ్డంగా ఉంది అంతా...సరేలే ...మా యింటి ఎడ్రసు సరిగాచెప్పి రేవతిని పంపించు ఓసారి. అన్నట్టు ఊళ్లో లేదన్నా


డెట్ ఉతికే బిళ్ల
సబ్బు కంటె $1\frac{1}{2}$ రెట్లు ఎక్కువ శక్తివంతమైనది
ఉప్పు నీళ్లలో కూడ.
new!
det
detergent washing cake
డెట్ ఉతికే పౌడరు
ఎంచుకొందుకు వీలుగా ఎన్నో సైజుల ప్యాకులు.
మీరు చేయవలసినదంతా బట్టలను తడిపి
జాడించడమేను. మీ చేతులను మృదువుగా కూడ
ఉంచుతుంది.
NEW!
TRIPLE ACTION
white
det
WASHES WHITEST
ఎన్ - డెట్
మరకలను తొలగించే ఎన్‌జైమ్ ఉతికే
పౌడరు. గుణకరమైనది కాని పోని వెయ్యదు.
enzyme
det
washes away stubborn stains
ఇదివరకు ఎన్నడూలేనంత తెల్లదనము—డెట్ ఉత్తమ తయారులతో!
Shilpi HPMA 6A/74 Tel

## కలలూ — సంకెలలూ

వ్గా, పోనీ మీ మరిదికి చెప్పు. నీ పిల్లల గురించి అడగడమే మర్చిపోయాను. అంతా బాగున్నారుగా! ఈసారి యిలాకాక ఓ పది రోజులు ఉండేలా రా ఇంకా బాగా గడుపుదాం... వస్తా.'

గబగబ వెళ్లిపోతున్న ఇందిర్ని చూస్తూ అలాగే ఉండిపోయింది శకుంతల. ఇంటికి చేరేదాకా అలా ఆలోచిస్తూనే ఉంది.

'ఏమని చెప్పగలదు రేవతి గురించి, ఎన్నేళ్లయినా కన్యగానే ఇంట్లో పడుందనే కటిక నిజమా! తన గురించి ఏం చెబుతుంది, పిల్లల్ని యింటిదగ్గర అట్టేపెట్టి, వైద్యం నిమిత్తం మొగుణ్ణి విశాఖపట్నం తీసుకొచ్చిందనే కఠోరసత్యమా!

తన బతుకు తనకే హేళనగా తోచింది. దిగ్భ్రమ కలిగించే ఆ జంటముందు దిష్టిబొమ్మలాంటి తన బతుకుని బయటపెట్టుకోలేక ఏవేవో లేనిపోనివి కల్పించి చెప్పింది. ఒక అబద్ధం నిలబెట్టడానికి అలా అలా ఎన్నో కల్పనలు చెయ్యవలసి వచ్చింది.

అంతకుముందు తన బతుకేదో ప్రెసిడెంటు పెళ్లాంలా వెలిగిపోయిందని కాదు, యింతగా అప్పుల పాలై దినదినగండంగా దిగజారిపోయి మాత్రం లేదు! అదిగో ఆరు నెలనాడు తన భర్తకు జరిగిన ప్రమాదంతో అన్ని అవస్థలూ ఆరంభమయ్యాయి. ఆ సైకిల్ యాక్సిడెంట్‌లో ఆయన కుడికాలి ముడుకు దగ్గర ఫ్రేక్చరయింది. ఎన్ని నెలలు గడవనియ్యి. ఎన్ని వందలు తగలెయ్యనియ్యి... ఆ వాపు తియ్యదు. ఆ బాధ తగ్గదు. అక్కడ సరిగ్గా అతుక్కోడమంటూ జరగదు. ఎంతో ఆశతో యీ ప్రైవేటు నర్సింగ్ హోమ్‌కి వస్తే యీ ఆర్థో పెడిక్ సర్జన్‌గారు వందలకి వందలే మేసి, ఎక్స్‌రేలు తెగతీసి 'మొదట్లో సరిగ్గా వైద్యం జరిగింది కాదు. ఇన్ని నెలలు గడిచేక మళ్లా యధాస్థితికి వచ్చే అవకాశాలు తక్కువేమరి!' అని శలవిస్తున్నారు!

డబ్బున్నవాళ్లకేం ఎన్ని ఉపన్యాసాలయినా యిస్తారు! వేళకి కావలసిన తిండీ గుడ్డా అమరి పోతూ ఉంటే వినేవాళ్లుండాలి గాని వాళ్ల కబుర్లకేం కరువు,

నర్సింగ్ హోం చేరుకుంటున్న కొద్దీ శకుంతల గుండె వేగంగా కొట్టుకోజొచ్చింది. ముందురోజు సాయంత్రం నుంచీ ఆ రోజు సాయంత్రం వరకూ— ఇందిరా, శ్రీధర్, వాళ్ల యిల్లూ... ఇవన్నీ తనదుఃఖం నుంచి తనని తాత్కాలికంగానైనా వేరు చేసి ఉపశాంతి కలిగించాయి. ఏ కోరికా తీరని ఎడారి లాంటి జీవితంలో వడగాడుపు లాంటి ఈ కుదరని రోగం ఒకటి! దాన్తో పాటు తప్పుచేశానేమో అనే భావన ఒకటి ఆమెని క్రుంగదీయ సాగింది. ఎప్పుడో ఒంటిగంటకి యిచ్చిన కాఫీ. పొద్దుట సరిగ్గా ఆ దెబ్బదగ్గర కెలికి ఏవో లోషన్లు వేసికడిగి కట్టుకట్టేరు. ఎంతో ఓర్పుగల మనిషయినా భరించలేక గిలగిల లాడిపోయాడు. ఇంతలావున వాచి పోయింది. పాపం ఇప్పుడెలా ఉందో...కాస్త దూరాన ఉన్న వస్తువు వెళ్లి తీసుకోలేని దుస్థితి. ఇంకా తన ఊరినుంచి సాయంగా ఉంటుందని పైడమ్మని తీసుకొచ్చిందిగాని...

ఆమె హడలిపోతున్నట్టే అతను ఒక్కడే ఉన్నాడు.

'ఎలా ఉంది సలుపు? పైడమ్మ ఏదీ?'

"'ఇంతసేపూ ఉంది. 'మాయాబజారు' సినిమా వచ్చిందని తెలిసి నేనే దెబ్బలాడి పంపించాను. పిచ్చిముండ, ఓపట్నాన వెళ్లదే! పుసిర్ది యింకా ఎన్నాళ్లు నిలుస్తుంది ఆ చూపు! ఇలా దగ్గరగావచ్చి కూచో... అలా ఉందేం మొహం! మీ ఫ్రెండు యిల్లు సుళువుగా తెలిసిందా? ఇంకోగడీ ఉండి రాకపోయావా... ఏ బీచ్‌కయినా వెళ్లకపోయారా? సరేలే లేచి మొహం కడుక్కో...పైడమ్మ చేత కాఫీ తెప్పించాను. ఫ్లాస్కులో ఉంది. తాగుదువుగాని..."

అన్నీ మరచిపోయి, బుగ్గన చెయ్యి పెట్టుకుని అలా మొగుణ్ణి చూస్తూ కూచుండి పోయింది శకుంతల.

ఇన్నేళ్ల తన కాపరంలో, ఎదుటివాళ్లని యిబ్బంది పెట్టే ఒక్క కోపరేఖ చూడలేదు. ఆ మొహంలో... ఆస్తిలేదు, ఆరోగ్యంలేదు, అందానికి ఆస్కారంలేదు ... ఎప్పటికైనా యీ స్థితి బాగుపడుతుందనే భరోసాలేదు... అయితేనేం!

ఎన్నికలలయితేనేం, కన్నీటి చుక్కలా కరిగిపోయేది ఆడదాని బతుకు. అది ఏడు రంగుల మాలికగా ఒక్క క్షణమైనా ఒళ్ళు విరుచుకోవాలంటే కట్టుకున్నవాడి కరుణ కిరణం ఒకటే, ఒక్కటంటే ఒకటి చాలు! చాలదా?

'శకుంతలా!' మొగుడి పిలుపుతో త్రుళ్లిపడి లేచింది ఆమె.

'లే,లే, మొహం కడుక్కుని కాఫీ తాగు... సీసా పట్టుకుని తొందరగా బూత్ దగ్గర కెళ్లు. లేకపోతే పాలు దొరకవ్. వచ్చేటప్పుడు, యిదిగో చీటీ. డాక్టరుగారు ఏదో ఆయింట్‌మెంట్ రాసిచ్చారు తీసుకురా... అన్నట్టు అన్నయ్యకీ, అమ్మకీ ఉత్తరాలు రాసి ఉంచాను. లైటయిపోయింది. హెడ్ పోస్టాఫీస్‌లో పడేసిరావాలి. తొందరగా డబ్బు రాకపోతే ఇబ్బంది పడిపోతాం.'

'నీలాంటివాణ్ణి కట్టుకున్నాక నాకు యికయిబ్బందికాక మిగిలిందేమిటి!' అన్నట్టు మూతి విరిచి, శకుంతల సబ్బూ, తువ్వాలూ తీసుకోడానికి లేచింది.

# దేవుడు చేసిన పెళ్ళి

పస వున్న చిత్రం
పసందైన చిత్రం
పల్లె జీవితంలో
ప్రతిరోజూ చూసే
పంతులమ్మా
పోస్టుమానూ
ప్రాతిపదికకాగా
ఒకరికిద్దరై
మెప్పు వడుశిందా శారద
శోభాయమానంగా చేశాడా
శోభనా చలపతి
మరో చలపతి
చక్ మోహనరంగా గా.
సంగీతాన్ని
సంగీతంగా
వినిపించాడు
వీనుల విందుగా
రాజనాలు లాంటి
రమ్యమైన మాటలు
సత్యమైన మాటలు
సత్యానంద్ మాటల మూటలు
కథ గొల్లపూడిది
కెమెరా కన్నప్పది
పోటీపడ్డారిరువురూ
నే చెపుతా
నే చెపుతానంటూ
ప్రయోగాత్మకాలంటే
పాయసంలా భావిస్తాడో
నిర్మాత పూర్ణచంద్రుడు
రాటు దేలాడు దర్శకుడు
రమణీయంగా చిత్రించాడు
రామారావు
పెళ్ళంటే
'దేవుడు చేసిన పెళ్ళి" అంటే
పదిమందీ చేరావిగా మరి
'ఆధ్వర్యమే 'లక్ష్మీ" కనుక
అడ్డు లేదు ధనరాసులకు

వల్లభకోటి సుబ్బారావు
విజయవాడ.




నువ్వు 'సీత' వా ?
కాను.
మరి 'రాధ' వా ?
రాధనీ కాను.
అయితే, నువ్వెవరివి ?
నిజమే, ఇంతకీ నే నెవర్ని ?

నీ ముందు రెండు ఉత్తరాలు !
నీకు ఎటువంటి 'ఆసక్తి' లేని వ్యక్తుల దగ్గర నించి వచ్చిన స్టైల్, లైఫ్‌లెస్ ఉత్తరాలు!
ఉత్తరాల గురించి మర్చిపో...
కానీ...
నువ్వు రావ్‌ని మర్చిపోగలవా? ఈ క్షణంలో?
లేను...రావ్‌ని నేను ఎలా మర్చిపోగలను ?...

ఎప్పుడెప్పుడు నీకు నీలోని 'సీత భాగం' పైకి తొంగిచూస్తూ వుంటుంది. శేఖర్ విశాల హృదయం, అతనికి నీ మీదవున్న అనురాగం, నమ్మకం, నీకు శేఖర్ విలువని చాటిచెప్తాయి.
అప్పుడు ...
నువ్వు 'సీత'లా పవిత్రంగా పతివ్రతలా వుండాలని అనుకుంటావ్, కానీ...

"సెకర్ ..." మంటూ నీ ముందు ఉత్తరం !
నువ్వు నిర్లిప్తంగా విప్పిన ఉత్తరంలో, "అన్‌ఎక్స్‌పెక్టెడ్" గా రావ్ !
'మున్నీ !"
(టయిన్‌లో రమ్ + విస్కీ కలిపి తాగుతూ, మెల్లిగా రెండోజులకి ఇల్లు చేరాను. నీ కంపెనీ నన్ను ఎంత ఎక్స్‌టసీలో ముంచి వేసిందో నేను మాటల్లో చెప్పలేను. ఆ అనుభూతిని జెన్ బుద్ధిజంలో 'సెటోరి' అంటారు. ఇట్ ఈజ్ నథింగ్ లైక్ 'నిర్వాణ' నువ్వు నా పక్కనే వున్నా, లేకపోయినా వున్నట్లు అదేమిటో ఇన్‌ఎక్స్‌ప్లికబుల్ ! ఏవో విషన్స్ కలర్స్, ఎరుపు —
బియాండ్ వర్డ్స్.
మున్నీ ఐయామ్ ఎలోన్ —
ఎక్కడో —
హిమాలయాల మంచు చరియలు !
డోన్ట్ మిసండర్‌స్టాండ్.
రావ్.
వెనక్కి వెళ్ళు —
ఎంతో ఎంతో వెనక్కి నడువు.
ఓ మనసా !
ఎసిమిలేట్ యువర్ సెల్ఫ్ !
ఆవులు ఆహారాన్ని నెమరువేసుకున్నట్లు,
తొందరలో మింగిన గడ్డిని వంట పట్టించుకుని, జీర్ణం చేసుకోడానికి తాపీగా కూర్చుని నములుతూ ...
కచ కచ, పచ పచ ...
పచ కచ, కచ పచ ...
నీ లేత నీలిరంగు వెంకటగిరి చీరని మార్చి నీ ఎరుపు గద్వాల్ చీరని కట్టుకోమని, మేచింగ్‌గా ఎర్రటి గాజు గాజులని వేసుకోమని రావ్ నిన్ను రిక్వెస్ట్ చేస్తున్నాడు.
నువ్వు ...

బహుశః, సీత + రాధ = - నేను.
(అనుకుంటాను.)

అంటే ?

నేను రామాయణం చదువుతున్నప్పుడు రాము భక్తురాలినీ, భాగవతం చదువుతున్నప్పుడు కృష్ణభక్తురాలినీ అయిపోతూ వుంటాను.

అంటే ?

నా హృదయంలో —

రాము, కృష్ణులిద్దరికీ స్థానం వుంది.

*   *   *

ఇప్పుడు

నువ్వు నీ ఇంట్లో

వీధి తలుపుకి దగ్గిరగా వేసివున్న పడకకుర్చీ మీద ...

పోస్ట్‌మేన్ అడుగుల సవ్వడి,

తరువాత

తలుపు క్రింద సందులోంచి, 'సర్‌ర్...' మంటూ

తన రాకని తెలియపరుస్తూ వచ్చే ఉత్తరాల ధ్వని కొరకు వేచి వున్నావ్.

అదుగో ...

'సర్‌ర్...' మన్న శబ్దం ...

ఇంకొక క్షణంలో,

నీ ముందు ఉత్తరాలు !

నీ గుండె వేగంగా కొట్టుకుంది.

నువ్వు అప్రయత్నంగా కళ్ళు మూసుకుంటావ్.

నీ కళ్ళల్లో, నీ మనస్సు లోతుల్లో ఇంద్రధనుస్సు రంగుల్ని చూస్తావ్.

కానీ...

నువ్వు ఆ రంగుల్లో —

పూర్తిగా మునిగిపోక ముందే,

నీ కళ్ళని తెరుస్తావ్, ఆత్రుతని చంపుకోలేక !

రావ్‌ని మర్చిపోదామన్నా,

మర్చిపోనీకుండా—

మవ్వు వుంటున్న యిదే 'గృహం'లో, నీ కొరకు రావ్ వేసిన ఆ తోటలో, అందులోని ప్రతి మొక్కలో, మీ ఆయన రోజూ త్రాగే విల్సు ఫ్లేక్ సిగరెట్ల పొగలో, ఖాళీ బీర్, బ్లేక్‌నైట్ విస్కీ సీసాలలో, రావ్ మీ ఆయనకి కానుకగా యిచ్చిన జెంబూ ఏష్‌ట్రే లో, మీ డ్రాయింగ్ రూమ్‌లో అకు పచ్చగా అందంగా, అల్లుకొన్న 'డబ్బు మొక్క' లో యింకా, యింకా...ఎన్నిట్లోనో నీకు రావ్ కన్పిస్తున్నాడు, ఇప్పుడు, అంటే ఈ క్షణంలో...

"అమ్మా"...

పాప నీ వొళ్ళో కూర్చుని హోమ్ వర్క్ చూపిస్తోంది. నీ గుండె కోత గాయం, నీ మనస్సులోని సంఘర్షణ, ఐదేళ్ళ నీ పాపకి అర్థం కాదు.

కానీ...

నీ భర్త శేఖర్ ?

శేఖర్‌కి నీ మీద వున్నఅపారమైన ప్రేమ? శేఖర్‌కి నీ మీద వున్న ప్రేమని తల్చు

"ఎక్సస్ ఆఫ్ ఎనీ థింగ్ ఈజ్ బేడ్"...

శేఖర్ విలువ గురించి నువ్వు 'అతి' గా ఆలోచించినప్పుడు నీకు మధ్య మధ్యని రావ్ విలువ కూడా ఎందుకో గుర్తుకి వస్తూ వుంటుంది.

అప్పుడు ...

నీకు నీ హృదయంలోని రెండో వేపున వున్న 'రాధ' కూడ గుర్తుకి వస్తుంది.

కానీ ...

నీలో యిద్దరికీ స్థానం వుంది కదూ ?

సీత ! — ... రాధ !

హే భగవాన్ !

నేను పూర్తిగా సీత నెందుకు కాను ? !

పోనీ ...

పూర్తిగా రాధనైనా అయాను కాను !?!

నేను సగం సీతని !


సగం రాధనీ !

నేను సీతారాధమ్మని ...

మళ్ళీ అదుగో ...

పోస్ట్‌మేన్ అడుగుల సవ్వడి !

ఈవెనింగ్ పోస్ట్ కాబోలు !




'ఎందుకు యిప్పుడు మళ్లీ (డన్ మార్చటం' అని అంటూనే రావ్‌ఇచ్చకి హిప్నటైజ్ అయిపోతావు.

ఎర్రని చీర కుచ్చెళ్ళని దోపుకుంటూ — నీ భర్తని తల్చుకుంటావ్.

ఆఫీస్‌లో నీ కోటిగుండెల శేఖర్ !

నీది, నీ శేఖర్‌ది విడలేని వివాహ అనుబంధం.

రావ్, శేఖర్‌లది అపారమైన స్నేహబంధం.

ఆ స్నేహానికి 'మూల్యం' కట్టగలవా నువ్వు ?

అయినా, అన్నీతెలిసి, అర్థం చేసుకుంటూ కూడ రావ్‌ఇచ్చకి దాసీగా ఎందుకు మారిపోతున్నావ్ ?

ఎందుకు ?

అది ప్రేమా?...పిటీయా ?...ఆరాధనా?

మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్

ఎడ్మిరేషన్...లవ్...లైకింగ్-ఆర్ మేడ్

?...

యూ. ఎస్. ఏ ?

చైనా ?

జపాన్ ?

ఇండియా ?

ఎక్కడ ?

అన్సర్...స్సర్...ర్...

నీకు కాళ్లలోంచి వణుకు,

గుండెని కోస్తున్న బాధ,

నీరసం...

రావ్ అడుగుతున్నాడు నిన్ను—

'ఏం అలా వున్నావ్ ?' అని.

నువ్వు జవాబు చెప్పలేకపోతావు.

గుండె గొంతులో అడ్డుకున్నట్లుంది.

నీకు నీ మీద అసహ్యం కల్గుతోంది.

నీ కళ్లల్లో అప్రయత్నంగా నీళ్లు.

# ఇంతకీ నేనెవర్ని?

రావ్ హడావిడి.

గ్లూకోస్,...బెరిన్ మాత్ర...హార్లిక్సు...

తెల్ల మొఖం వేసుకుని నీ కేసి చూస్తున్న పాప.

ఈ ఇంట్లో—

శేఖర్ లేకుండా...

రావ్‌తో ...

నీకు ఏదో భయం.

భయంలోనే బలం.

"లెట్స్ గో అవుట్..."

'నీకు నీర్సంగా వుంటే వద్దులే' రావ్.

'లేదు. అయామ్ ఆల్‌రైట్, పదండి.'

నువ్వు, పాప, రావ్

ఒకే రిక్షాలో ...

గేలార్డ్‌లో లంచ్...తందూరీ,...మలాయ్ కోఫ్తా...కట్‌లెట్స్...

* * *

ఆరు సంవత్సరాల క్రితం

నీకు పెళ్లయిన కొత్తలో, నువ్వు శేఖర్‌తో కలసి ఇదే 'గేలార్డ్' లో తిన్న మసాలా దోసెని మర్చిపోగలవా ? ఇప్పుడు ? ఈ క్షణంలో ?

లేను

ఎప్పటికీ మర్చిపోలేను.

నేను శేఖర్‌కి అన్యాయం చేస్తున్నానా ?

శేఖర్‌కి అంతా తెల్సు.

తెలిసినా, తెలీనట్టు నటిస్తాడు.

నాకు కూడ నాలోని 'వీక్‌నెస్' తెల్సు.

అందుకే

నేను శేఖర్‌ని ఎంతగానో బతిమాలాను.

నన్ను రావ్‌తో వంటరిగా వదిలి వెళ్లిపోవద్దని.

శేఖర్ తొణకడు.

నిండుకుండ.

రావ్‌ని నన్ను యిలా 'ఫ్రీగా' వదిలేసి ఎందుకు వెళ్లిపోతున్నాడు ?

నా ఇంటెగ్రిటీని డౌట్‌చేస్తూ 'స్పయింగ్' చేయటానికి తెలుగు సినిమా హీరో కాదు నా శేఖర్ !

రావ్ మీద శేఖర్‌కి గురి

నా మీద శేఖర్‌కి నమ్మకం.

శేఖర్‌కి నా మీద వున్న ఈ నమ్మకాన్ని నేను మాత్రం దుర్వినియోగ పరుస్తానా ?

రావ్ శేఖర్‌కి కలలోనైనా ద్రోహం చెయ్యగలడా ?

పులి, మేక, గడ్డి —

నదిదాటి వెళ్లాలి.

చిన్నపడవ, ఇద్దరే ఎక్కాలి.

మూడోమేళంతో మునుగుతుంది పడవ.

గడ్డిని మేక తినేస్తుంది.

మేకని పులి తినేస్తుంది.

అన్నిటినీ సురక్షితంగా ఒడ్డుకి చేర్చాలి.

ఎలా ? ఎలా ?

సాల్వ్ ...

* * *

మెమోరియల్ గార్డెన్స్ !

తాంతియా టోపీ స్మారక సమాధి.

నువ్వు లాన్‌లో సిమెంట్ బెంచీమీద కూర్చొని వున్నావ్.

మేకపిల్లలకి హార్లిక్స్ బిస్కట్లని తిని పిస్తూ, పాపని ఆడిస్తూ రావ్

నీకు సన్నగా ఏమిటో చెప్పలేని బాధ గుండెల్లో ...

మళ్లీ గాభరా,

నీర్సం, వణుకు.

రావ్ తోటమాలి అనుమతితో పువ్వుల మొక్కల్ని త్రవ్వి తీస్తున్నాడు నీ కోసం !

నీ ఇంట్లోని నీ తోటకోసం !

నీకు గాభరా ఎక్కువైంది.

'వెళ్లిపోదాం'

'అప్పుడే ?' అంటున్నాడు రావ్.

'నాకు అదోలా వుంది'

మళ్లీ రిక్షా.

రిక్షాలో ముగ్గురం.

నీకు రాను రాను గాభరా ఎక్కువౌతోంది.

అగర్వాల్ మెడికల్ స్టోర్స్ ...

నువ్వు రిక్షావాడిని ఆపమంటావు.

'లిబ్రియమ్' తెచ్చిపెడతారా ?

రావ్ రిక్షాదిగి, మాత్ర తెచ్చిపెట్టాడు.

గ్లాసుతో నీళ్లు.

నువ్వు మాత్రని మింగావు.

'ఎలావుంది' ? రావ్.

'ఇంటికి పోదాం' .

మౌనంగా పాప, నేను, రావ్, ఇల్లు చేరుకున్నాం.

ఇల్లు.

ఇంట్లో రావ్ తను తెచ్చిన మొక్కల్ని కుండీల్లో పాతుతున్నాడు.

వీధితలుపు చప్పుడు.

గడియని తీస్తావ్ నువ్వు.

శేఖర్ !

అన్నీతెలిసీ తెలీనట్లు విశాలంగా నవ్వుతూ శేఖర్.

ఇప్పుడు నలుగురం.

పాప, రావ్, శేఖర్, నేను.

టీ, బిస్కట్లు.

నీకు గాభరా తగ్గి సడన్‌గా రిలీఫ్ కల్గుతుంది.

కానీ ...

శేఖర్ యూనియన్ మీటింగ్ అంటూ, నువ్వు అప్పటివరకూ అనుభవించిన 'రిలీఫ్'ని అకస్మాత్తుగా భంగపరుస్తూ వెళ్లిపోయాడు.

నీకు బాధ.

బాధలో భయం.

ఏమిటీ పరీక్ష నాకు ?

పాప ఆడుకుంటూనే ఆదమరచి నిద్రపోయింది.

ఇంక మిగిలింది ఇద్దరం !

నేను, రావ్ !

రావ్ ఒక అయస్కాంతం.

నా ఇనపగుండెని తనవైపు లాగుతున్నాడు.

మనస్సుకీ, ఆత్మకీ ఎక్కడా పొత్తు కుదరటంలేదు. రెండూ సమానాంతరంగా పోతున్నాయి.

శేఖర్ అర్ధరాత్రి మీటింగ్‌నించి వచ్చే వరకూ మంత్రముగ్ధలా రావ్‌మాటలు వింటూ కూర్చున్నావ్ నువ్వు.

* * *

రేపు రావ్ వెళ్లిపోవాలిట.

రావ్ డ్రాయింగ్ రూంలో పార్టీ వర్కర్సుతో డిస్కషన్స్‌లో వున్నాడు.

శేఖర్ ఉదయమే మళ్లీ మీటింగ్ అంటూ వెళ్లిపోయాడు.

పాప ప్రశాంతంగా నిద్రపోతోంది.

రాత్రి గంట పది.

మిగిలింది వంటరిగా నువ్వు.

రావ్ వెళ్లిపోతే కలిగే 'లోటు'ని తల్చుకుని బాధపడుతూ రావ్ బట్టల్ని సర్దుతున్నావ్ నువ్వు. అకస్మాత్తుగా రావ్ నీ గదిలోకి వచ్చాడు.

నీ బాధనీ, నీలోని విషాదాన్ని, నీ చిరునవ్వు వెనుక దాచుకోవటానికి సమయం యివ్వకుండానే, నీ ముందు నీ ముఖంలోని విషాదాన్ని చదువుతూ రావ్ !

నీ కళ్లల్లో అనుకుండా, ఆపుకోలేనన్ని నీళ్లు ! ఆ విషాద సమయంలో —

నీ కన్నీళ్లలో —

రావ్ నీకు రావ్ మీద వున్న 'ప్రేమ' ని చూడగలిగాడేమో !

కానీ ...

నీ హృదయంలోని 'సీత' ని చూడగలిగాడో లేదో రావ్ ?

ఏమో !

రావ్ హఠాత్తుగా నిన్ను తన వైపుకి తిప్పుకుని ముద్దు పెట్టుకోబోతూ వుంటే, వారించి, వెక్కివెక్కి ఏడుస్తున్న నీ హృదయంలోని 'రాధ' రాధ ప్రక్కనే ఒదిగివున్న 'సీత'ని కూడ చూడగలిగిన రావ్ ఎడ్వాన్స్ కాలేకపోయాడు.

నీకు సడన్‌గా రావ్ నించి రిలీఫ్ !

దీని కంతటికీ అర్థం ఏమిటి ?

మళ్లీ నీలో దుఃఖం గట్లు తెంచుకుంది.

గిల్ట్ ...

సిన్ ...

శేఖర్—

రావ్ భార్య

రావ్ పిల్లలు—

వీళ్లంతా నన్ను అర్థం చేసుకోగలరా ?

శేఖర్‌కి అంతా చెప్పాలి.

అంతా...

అంతా —

మా యిరువురి నడుమ ఎటువంటి 'ముడి' పడకూడదు.

అలసి ఆకలితో వచ్చిన శేఖర్‌కి

కడుపునింపుకోమని కన్నీళ్లతో అందించిన చేదు నిజాన్ని శేఖర్ జీర్ణం చేసుకుని నవ్వుతున్నాడు.

ఎప్పటిలా

స్ఫటికంలా స్వచ్ఛంగా ,

'స్పందన'కి అతీతుడిలా

వెన్నెల సౌరభంలా

విశాలంగా...

నా కన్నీళ్లని పన్నీరుగా మారుస్తూ, తన బాహువులలో నన్ను బంధిస్తూ, మన యిరువురి నడుమ వేరెవరూ రాలేరని అభయమిస్తూ, నన్ను తనలో ఏకం చేసుకుంటూ, నాకు నాలోని 'సీత'ని మళ్లీ నాకు గుర్తుకు తెప్పిస్తూ నా శేఖర్.

* * *

సామాన్లు సర్దటం అయింది.

రావ్ వెళ్లిపోతున్నాడు.

ఇంతజరిగినా ఏమీ జరగనట్లు, ఎప్పటిలా నిర్మలంగా అందరం స్టేషన్‌కి 'సీ ఆఫ్' కి బయలుదేరాం.

స్టేషన్...

## గులాబీ పూలు

— జి. రామలక్ష్మి

గులాబీపూలంటే తలలో పెట్టుకునే వనుకునేరు. కాదు, ఇదిఒక తీపి పిండివంట. ఇదిముఖ్యమైనదీ, మీకు ఇష్టమైనదీను.

**కావలసిన వస్తువులు :** బియ్యంపిండి ఒక కిలో, మైదాపిండి అర్ధ కిలో, పంచదార ఒకకిలో, యాలకులు 10.

**తయారుచేసే విధానము :—** పైనచెప్పిన ప్రకారము, బియ్యంపిండీ, మైదాపిండీ బజ్జీలపిండిలాగా కొద్దిగా, పల్చగా తడిప్పెట్టుకోవాలి. (బజ్జీల పిండిలాగా ఉంటే చాలు). తర్వాత స్టౌమీద బాణలిఉంచి, నూనెనుపోసి, ఇనుప గులాబీ వ్వును పైన పొడుగాటి కాడని పట్టుకునీ, నూనెలో మునుగునట్లుగా ఉంచాలి. (ఈ ఇనుప గులాబీపువ్వును, బజారులో, ఎక్కడపడితే అక్కడ అమ్ముతారు వెల రూపాయి.) ఇదికూడా నూనెతోపాటు మరిగి, బాగా వేడి ఎక్కుతుంది. నూనెబాగా మరిగాకా, యీ గులాబీ పువ్వును అందులోనుంచీ తీసీ, మనము కలుపుకునీ ఉంచుకున్న పిండిలో ముంచి, వెంటనే నూనెలో మళ్లీ ఈ గులాబీపువ్వును ముంచాలి. ఆ వేడికి, గులాబీపువ్వు (అంటే, దానికి అంటుకున్న పిండి) ఊడీ, చక్కగా, పెద్దగా, గుల్లగుల్లాగ, విచ్చుకుంటుంది యిలాగే అన్ని గులాబీపూలు తయారుచేసుకున్నాక, పైనచెప్పిన పాళ్ల ప్రకారము పంచదారని లేతపాకం పట్టాలి (అంటే లేతపాకం ఉంటేచాలు.) తర్వాత ఈ గులాబీపూలను అందులో వేసి ఒక ఐదు నిమిషాలు ఉంచి, వేరే తీసెయ్యాలి. యివి చాలా రుచిగా, అచ్చు గులాబీపూల లాగానే ఉంటాయి. తయారు చేయటంకూడా సులభమే. నెలరోజులయినా నిలవఉంటాయి. పెద్దలూ, పిల్లలూ యీ స్వీట్ పిండివంటను ఎంతగానో యిష్ట పడతారు.

# ఇంతకీ నేనెవర్ని?

రైలు...

గ్రీన్ లైట్...

కదిలిపోతున్న రైల్లో రావ్.

నీ గుండెనికోస్తూ, ఆ బాధలో, ఎడబాటులో నీకు మళ్లీ నీలోని 'రాధ'ని తట్టి లేపుతూరావ్ అతి దూరంగా వెళ్లిపోతున్నాడు.

అందమైన నీలాకాశం లాంటి నీ హృదయంలో, కారుమబ్బులా ప్రవేశించిన రావ్ ప్రేమజల్లు నీపై కురిపించి, సప్త రంగుల ఇంద్ర ధనుస్సుని సృష్టించి వెళ్లిపోతున్నాడు నీ నించి దూరంగా.

* * *

రావ్ ...




నీకో మెసేజ్ ...

నువ్వు నా హృదయానికి పులిమిన రంగులు మెల్లిగా మెల్లి మెల్లిగా కరిగిపోయి ఎప్పటిలా నా హృదయం అందమైన నీలాకాశంలాగానే విశాలంగా వుంటుంది. కానీ ...

కొద్ది క్షణాలు సప్త రంగులతో మెరిసిన ఇంద్రధనుస్సు 'ఇంకలేదు' అన్న వెల్తి మాత్రం కల్గుతూ వుంటుందేమో అప్పుడప్పుడు.

అప్పుడు ...

నా హృదయంలో నీకొఱకు ఏర్పడ్డ 'సాఫ్ట్ కార్నర్' మేల్కొని లేస్తుందేమో!

కానీ ...

రావ్,

నువ్వు అప్పటికి నాకు ఒక జ్ఞాపకంగా మాత్రమే మిగులుతావు.

కానీ —

ఆ జ్ఞాపకం

సూర్యుడి లాంటిది;

అంటే —

అతి పవిత్రమైనది, ఎట్ ద సేమ్ టైమ్ భస్మం చేయగల శక్తి కలది.

అర్థం అవుతోందా నీకు ?

నేను చెప్తున్నది ?

నీకు ఏమి చెప్పినా,

ఎలా చెప్పినా,

చెప్పినా, చెప్పకపోయినా,

నీకు అంతా అర్థం అవుతూనే వుంటుంది.

నిజమేనా ?

'ఎగ్రీ' అవుతావు కదూ ?

ఉదయించిన సూర్యుడు, అందమైన సాయంత్రంగామారి అంధకారమైన రాత్రిలో ఎలా మాయమైపోతాడో అలాగే ...

నువ్వు

నా హృదయంలో ఒక "సాఫ్ట్ కార్నర్" గా ఉదయించి, అందమైన సాయంత్రం లాంటి అనుభూతిని నాలో కల్గించి, అంధకారమైన రాత్రిలాంటి ఎడబాటుతో అస్తమించావు నువ్వు నాలోంచి.

ఇప్పుడు నీ గొంతు నాకు విన్పించదు.

నిన్ను నేను చూడలేను.

ఎంత అంధకారం !

ఎంత దూరం !

మన మధ్యని ఇప్పుడు.

అంటే,

ఈ క్షణంలో—

కానీ...

ఆ అంధకారంలోనే తరచి తరచి చూస్తే మిణుకు మిణుకు మని మెరుస్తూ కన్పించే ఒకే ఒక్క ఆకాశదీపం లా నువ్వు మెరుస్తూ వుంటావు.

నా హృదయంలో అప్పుడప్పుడు,

అంటే—

అదే—

సప్తరంగుల ఇంద్ర ధనుస్సు నీలాకాశంలో యికలేదు అన్న వెల్తి కల్గినప్పుడు...

# చిగురించిన జీవితం

(30 వ పేజీ తరువాయి)

ఆత్మాభిమానం వారికుంటుంది." అనేసిందితేలిగ్గా.

రామరాజు మరేం మాట్లాడలేదు. అతనిమెదడు ఆలోచిస్తూనేవుంది. శ్రీనివాస్ మనస్తత్వాన్ని అకళింపు చేసుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాడు.

కొద్ది క్షణాల తర్వాత, శ్రీధర్ వచ్చాడు.

"శ్రీనివాస్ రాలేదా !" ఆతృతగా అడిగింది. యశోదమ్మ.

"ఏదో టెలిగ్రామ్ వచ్చిందట... వూరి కెళ్లినట్టు ప్రక్కింటాయన చెప్పాడు." అన్నాడు శ్రీధర్.

యశోదమ్మ తెల్లబోయింది. ఆమె మొహంలో ఏదో అవ్యక్తమైన భయం తొంగిచూసింది.

"అదేమిటి ? వూరికెళ్లి వచ్చినట్టు సీతతో చెప్పాట్ట. మళ్లీ వెళ్లడమేమిట్రా ?" ఆరాటంతో అందామె.

"వెళ్లాయి అక్కడికి వెళ్లిందా !" అదోలా చూస్తూ అన్నాడు శ్రీధర్.

"అవున్రా ! నిన్నను వెళ్లింది. ఇవ్వాళ మనింటి కొస్తానని చెప్పాట్టకూడాను."

"అయ్యుండొచ్చు. ఏదో టెలిగ్రామ్ వచ్చినట్టు తెలిసిందిగా ! ఎక్కడికో వెళ్లివుంటాడు. వచ్చేస్తాడులే..." అనేసి లోపలికి వెళ్లిపోయాడు. శ్రీధర్.

"అవును యశోదా ! వస్తాడులే... పద లోపలికి" అంటూ లేచాడు, రామరాజు.

విషయం తెలీదుగాబట్టి, తండ్రీ కొడుకులకి ఆరాటం యెట్సాగూ వుండదు. ఎటొచ్చీ, తాను సీతతోపాటు కుమిలిపోతోంది.... ఇప్పుడేం చెయ్యడం? శ్రీనివాస్ తిరిగి వస్తాడనే ఆశతోనే ఎదురుచూడాలి.. తప్పదు.. అనుకుంటూలోపలికి నడిచిందియశోదమ్మ. ఆమె మొహంలో కత్తివేటుకి నెత్తురుచుక్క లేనట్టుగా అగుపిస్తోందంటే ఆశ్చర్యంలేదు.

"సీతా !" కేకవేసింది.

తన గదిలో మంచం మీద ఒరిగి కుమిలి కుమిలి విలపిస్తోన్న సీత చప్పునలేచి మొహం, కళ్లుఒత్తుకుని "వస్తున్నానమ్మా..." అంటూ కేకవేసింది.

(ఇంకా వుంది)

# కొత్తనెత్తురు పుంజుకుని వెస్టిండీస్ క్రికెట్ జట్టును రెండు సార్లు ఓడించిన భారత్ క్రికెట్ జట్టుకు జే జే లు !

## క్రికెట్ సంవత్సరం

1975 జనవరి 1వ తేదీ. భారతీయ క్రికెట్ చరిత్రలో మరో మరపురాని రోజు. క్రికెట్‌లో గజ ఆటగాళ్ళుగా పేరుగాంచిన వెస్టిండీస్ ఆటగాండ్రను భారతీయ ఆటగాండ్రు అనూహ్యమయిన రీతిలో వోడించిన రోజు అది.

వెస్టిండీస్ జట్టు భారత పర్యటనకు వస్తుందన్న వార్త విన్నప్పుడే వాళ్ళ ధాటికి ఈ నాటి మన క్రికెట్ ఆటగాండ్రు ఏం తట్టుకుంటారబ్బా అన్న సందేహం ఈ దేశంలో చాలామందికి కలిగింది. వెస్టిండీస్ జట్టులో ల్లాయిడ్ (కెప్టెన్) ఫ్రెడరిక్స్, కల్లీచరన్, గ్రీనిడ్జ్, రిచర్డ్స్, గిబ్స్, ముర్రే వంటి మేటి ఆటగాండ్రు వున్నారు. బెంగుళూరులో జరిగిన మొదటి టెస్టులోను, న్యూఢిల్లీలో జరిగిన రెండవ టెస్టులోను భారత్ వోడి పోవడం, మన జట్టులో చాలా మార్పులు రావడం, పై సందేహం బలపడడానికి దారి తీసింది. అయితే కలకత్తా టెస్టు ఈ సందేహాన్ని పటాపంచలు చేసిందనే చెప్పాలి.

మొదటి రెండు టెస్టుల్లో వెస్టిండీయుల పై పుణ్యాన్ని చవిచూసిన మన ఆటగాండ్రు, ముఖ్యంగా కెప్టెన్ మన్సూర్ అలీఖాన్ పటవుడీ తమ వ్యూహాన్ని మార్చుకుని ధైర్యంగా 'వాడి' ని పెంచుకొన్నారు. బవులింగ్‌లో చంద్రశేఖర్, బేడీ, మదన్‌లాల్, బ్యాటింగ్‌లో విశ్వనాద్ ప్రభృతులు విజృంభించారు. విశ్వనాద్ రెండవ ఇన్నింగ్స్‌లో అపూర్వమయిన రీతిలో బ్యాట్ చేసి, 139 పరుగులు సాధించాడు. వెస్టిండీస్ రెండవ ఇన్నింగ్స్‌లో ఆ జట్టు నాయకుడు ల్లాయిడ్ చంద్రశేఖర్ బవులింగ్‌లో అవుట్ కావడంతోటే భారత విజయానికి మార్గం సుగమమయింది. చంద్రశేఖర్ మూడు వికెట్లను, బేడీ నాలుగు వికెట్లను పడగొట్టి భారత్‌కు 85 పరుగుల తేడాతో విజయాన్ని సాధించాటు.

## జట్టులో కొత్త 'నీరు'


ఆ తర్వాత మద్రాసు టెస్టు వచ్చింది. మొదటి ఇన్నింగ్స్‌లో రెండు జట్లూ కూడా చాలా తక్కువ స్కోరు చేశాయి. ఆట ఫలితం ఎలా వుంటుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 190, వెస్టిండీస్ 192 పరుగులు చేశాయి. రెండవ ఇన్నింగ్స్‌లో భారతీయ బ్యాట్స్‌మన్‌లు ముఖ్యంగా విశ్వనాద్ (46) గయక్వాడ్ (80) ఫూవ్‌రీ (35) లు ప్రశంసనీయంగా బ్యాటు చేసి జట్టుకు మంచి స్కోరు (256 పరుగులు ) సంపాదించి పెట్టారు. అప్పటికి ఇంకా రెండు రోజులకు పైగా వ్యవధి ఆట ముగియడానికి వున్నది.

## "స్పిన్" తిరిగిన "పిచ్"

## స్పిన్నర్ల విజృంభణ

వెస్టిండీస్ గెలవగలదేమోనన్న అనుమానం ఆట ప్రారంభమయిన మూడవ రోజు లేకపోలేదు. కాని నాల్గవ రోజు ఆట మొదలయిన కొద్ది సేపటికే భారత్ విజయం ఖాయమని తేలిపోయింది. బంతిని "స్పిన్" చేయడంలో అసమానులయిన "స్పిన్ త్రయో" ప్రసన్న, బేడీ, చంద్రశేఖర్ మళ్ళీ తమ సత్తా చూపించారు. వెస్టిండీస్ వికెట్లు ఒక్కటొక్కటే వెంట వెంటనే పడిపోనారంభించాయి. 51 పరుగులతో కల్లీచరన్ రన్‌అవుట్ కావడంతో వెస్టిండీస్ పని అయి పోయింది. 154

అనుభవం



మన్సూర్ అలీఖాన్

పరుగులకే ఆ జట్టు అవుట్ కావడం, 100 పరుగుల తేడాతో భారత్ బ్రహ్మాండమయిన విజయాన్ని సాధించడం జరిగాయి. ఇందుకు "మాన్ ఆవ్ ది మ్యాచ్" అయిన విశ్వనాద్, యువ ఆటగాడు గయక్వాడ్, స్పిన్ త్రయో చంద్రా, ప్రసన్న, బేడీలే కారణం. ప్రసన్న ఒక్కడేనాలుగు వికెట్లను పడగొట్టాడు. కొత్తరికార్డు స్థాపించాడు. బేడీ మూడు వికెట్లను, చంద్రా రెండు వికెట్లను పడగొట్టారు.

కలకత్తా టెస్టులో భారత్‌కు మళ్ళీ, క్రికెట్ రంగంలో, మాజీ కెప్టెన్ ఘులాం మహ్మద్ చెప్పినట్టు "మంచి రోజులు" ప్రారంభమయినాయి. భారతీయ క్రికెట్‌కు, కెప్టెన్ పటవుడీకి మళ్ళీ పూర్వపు పేరుప్రతిష్ఠలు రావాలని అందరి ఆకాంక్ష.

— వెంకట్రావ్.




మదన్‌లాల్, ఘావ్రీలు బౌలింగ్ ప్రారంభించటానికి కాస్తయినా పనికొస్తారు అనిపించుకున్నారు కాని ఓపెనింగ్ బాట్స్‌మన్ యింకా సరిగ్గా జోడీ కుదరలేదు. పరిగెత్తేవాళ్లు కాకపోయిన గట్టిగా నిలబడే 'ఓపెనర్' లు భారత్‌కు కావాలి. వెతకటం లేదా తయారుచేయటం మంచిది.

# ప్రశ్నావళి

## కె. రామలక్ష్మి

**జి. ఎస్. ఆర్. కడప.**

రాత్రింబవళ్ళు కష్టపడి చదివాను. దైవాన్ని కొలిచాను కాని...

ప్రయత్నం ఫలించి కాలేదు. అంతేనా ? చూడు తమ్ముడు—పరీక్షలు పాసవడానికి తెలివితేటలుకాదు ముఖ్యం—తగిన సమాధానాలు రాయకల్గడం. అవి గుడ్డిగా పాఠాలు చదివితేరావు అర్థం చేసుకుంటూ చదవాలి. ఉత్సాహం చంపుకోకుండా—చదవాలి. ఓసారి నిరుత్సాహ పడ్డావంటే . . . ఇంక ఎప్పటికీ పాసవలేవు.

**ఎల్. వి. ఆర్. ఖమ్మం —**

ఈ మధ్య ఒక అబ్బాయి పెళ్లి చూపులకు వెళ్ళాడట. అబ్బాయి కూర్చోటానికి చాపవేశారట. అమ్మాయి మహ చక్కగావచ్చి కుర్చీలో కాలు మీద కాలు వేసుకుని కూర్చుందట. ఈ ఘోరం సహించలేక గిరుక్కునతిరిగి వచ్చేశాట్ట. మీ ఆడజాతి యిలా రెచ్చిపోడం సహించలేం.

అందుకే ఆడది కూడా ఓ 'మనిషి' అని గుర్తించడం అలవాటు చేసుకోమంటున్నాం సార్...అయినా

ఈ 'రమా ప్రభా రాజబాబు కామెడీ సీను' నిజమే అయితే మీ ఫ్రెండు అలా ఉడుక్కుని ఉండ కూడదు.....'ఇద్దరం కుర్చీల్లోనే కూర్చుందాం' అని ఉండాలి. అలా అలంకరించిన బొమ్మల్లా మీముందు కూర్చుని—మీరూ—మీ చుట్టాలూ—జూలో జంతువుని చూసినట్టు చూస్తుంటే—మండి పడకుండా సిగ్గు నటిస్తూ కూర్చుంటున్న అమ్మాయిలు మనస్సులో ఎంత కుమిలి పోతుతున్నారో ఆలోచించండి.

**ఎన్. వి. కె. తాళ్ళపొద్దుటూరు —**

బీదవాడు లక్షాధికారి కావాలంటే దొంగ నోట్ల ప్రెస్ బట్వాడా చేస్తే బాగుంటుందా ? అర్జెంటుగా తెలపాలి.

ఈసరికి జైల్లో లేకపోతే—విను తమ్ముడూ—ఇలాంటి తెగించే పని చేయడానికి డబ్బున్న వాడే కావాలి !

**బి. ఎస్. కావలి.**

ఎప్పుడూ తప్పులు వెతుకుతూ, మాటలతో నొప్పించే భర్తను ఏమనాలి ?

పెట్టి పోషించి భరిస్తున్నాను అంచేత ఆమాత్రం సాధించకపోతే తన అధారిటీ కనిపించడం ఎలా ? అని కొందరు మగవాళ్ళు ఉప్పులో పప్పువేశావనో, పెరుగులో రాయి వచ్చిందనో సాధిస్తారు... మీరు మండిపడ్డంమానేసి ఆ సాధింపు ఇగ్నోర్ చేయండి! ఎదుటివారి మీద అధారిటి చెలాయించాలని చూసే వాడు ముందు తనకు తను మాస్టరవ్వాలన్న పరమసత్యం యిట్టే గ్రహిస్తారు!!

**ఎ. పి. కాశీబుగ్గ.**

రచయితలకు, రాజకీయాలకు సంబంధం ఏమిటి ?

ఉండకూడదు. రాజకీయపు పార్టీలకి కట్టుపడ్డ రచయిత—ఆమేరకు స్వేచ్ఛను అరికట్టుకుంటాడు. తనపార్టీ ఆదేశాం ప్రకారం రాసే రచయితకి పార్టీయే ముఖ్యంగాని తన చుట్టూ మనుషులుకాదు.

**ఎమ్. వి. ఎస్.ఎన్., బి.కె.వి.ఆర్. పాలకొల్లు.**

ఇన్నాళ్లనుంచి ప్రశ్నావళి చదువుతున్నాను. ఆడవారిని వెనకేసుకువచ్చి మగవారిని తేలికగా తీసిపారవేయడం ఏమీ బాగాలేదు. మా మగవారిమంతా కలిసి...

రామలక్ష్మి దురభిమాన సంఘం పెలకొల్పతారా ? కానివ్వండి !

**వి. ఎస్. కె. చిత్తూరు.**

ఆడదాన్ని అబల, మహిళ, స్త్రీ అన్నారు. వీటిలో మీరు ఏ తెగకు చెందుతారు.

స్త్రీ అనండి పోనీ !

**జగదీష్ కర్నూలు.**

ఈ ప్రపంచంలోని బలములన్నిటికంటే గొప్ప బలం ఏది ?

బుద్ధిబలం....

**కె. డి. ఆర్. ఏలూరు.**

మనలో ఆడదానికి యిచ్చే గౌరవం మగవాళ్లకు ఇవ్వరు ఎందుచేత.

మగవాడు పుట్టుకలోనే ఆ గౌరవానికి అర్హుడని మీ వుద్దేశ్యం ! అందుచేత.

**వి. ఎస్. ఆర్. నిజామాబాద్.**

మనిషి బ్రతుకుపై ఏ పరిస్థితులలో విరక్తి కల్గుతుంది ?

సాధారణంగా తన ఏ ప్రయత్నానికి ఎవరు అడ్డుతగిలినా మనిషికి విరక్తి పుడుతుంది. ఆవిరక్తి నుంచే పంతం, పట్టుదల, దీక్ష—కక్ష—అన్నీ తలెత్తుతాయి. అంచేత విరక్తి చావుకిదారి చూపుతుందని అనుకోనక్కరలేదు.

ప్రశ్నావళికి సందేహాలు పంపేపాఠకులు కార్డుపై ప్రశ్నావళి,సంపాదకుడు: ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ - 520003. అన్న చిరునామాకు మాత్రమే వ్రాయాలి. సం.

ఎస్. కె. ఆర్. విజయవాడ.

మనిషిగా పుట్టి మనిషిగా పెరిగిన ప్రతి మనిషికి ఈర్ష్య సహజ సంపద గదా? ఇది లేని వ్యక్తి యిలలో కలడా?

కలడు కలడన్నా మీరు నమ్ముతారా?! ఈర్ష్య అనేక కష్టాలకి కారణం కావచ్చు. కాని అదే వ్యక్తుల అభ్యున్నతికి, రాజ్యాల పురోగతికి కూడా కారణం.

బి. టి. ఆర్. రాయగడ.

నాకేదో భయంగా వుంది మేడమ్. ఈ కరువు కాలంలో పాపం మీ అమ్మాయిల కందరికీ ఎలా పెళ్ళి చేస్తారోనని

డు నాట్ వర్రీ యువర్ సెల్ఫ్ హెచ్ త్రినాథ రావూ....మేం చేయగల్గినంత మంది పిల్లల్నే— కన్నాం.

ఎమ్. ఎల్. ఎలమంచిలి.

రోజు రోజుకి దిగజారిపోతున్న మన దేశంపై మీ వ్యాఖ్య.

కళ్ళకి కనిపించే పరిస్థితులపై వ్యాఖ్య ఎందుకు? ఏదేశ పరిస్థితులు దిగజారడంలేదు ప్రపంచంలో. మనం ఇంకా ఎన్నోరెట్లు మెరుగు! అమెరికాలో వాటర్‌గేటు, రష్యాలో మహా రచయితల గతి, అరబ్బుల మానెగసులు, ఇజరేల్‌లో గోల్డ్, బ్రిటన్‌లో బొగ్గుగని పనివారలు... ఏదేశంలో పరిస్థితి మనకంటే మెరుగ్గావుందో ఆలోచించి చెప్పండి స్వామీ....

ఎమ్. జె. ఆర్. కొత్తగూడెం.

మీకే రాకెట్టులో ప్రయాణంచేసి చంద్రునిమీద దిగే అవకాశంవస్తే, మీరు ఆ అవకాశాన్ని వినియోగించుకుంటారా?

అస్సలే వినియోగించుకోలేను. నాకు జెయింట్ వీల్ ఎక్కడమే భయం!!

కె. ఆర్; కె. ఎస్., కె. జె,

కె. ఎమ్. కె. పి. కాజూరు.

ఉత్తమ గుణ మంటే ఏది?

ఉండదగినది!

ఆంధ్రుల అభిమాన మహిళ మీరు అంటే నమ్ముతారా?

ఎలా నమ్మను? ఆంధ్రుల ఆరాధ్య రచయిత్రి సులోచనారాణి. ఆంధ్రుల అభిమాన మహిళ ముప్పాళ రంగనాయికమ్మ. ఆంధ్రుల ఉత్తమ రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి...వీరందర్నీ పెట్టుకుని నేను కలికంలోకి కూడా రాను!!

వి. కె. డి. కాశీబుగ్గ.

గాంధీజీ బోధించిన సూక్తులలో అంటరానితనం ఎంతవరకు రూపుమాసిపోయింది.?

అక్కడికి గాంధీ బోధించిన అన్ని సూక్తులూ అమలులోకి వచ్చేసి నట్టేనా? బ్రదర్, కాగితం మీద రూల్‌చేసి ఇది పాటించండి అని చెప్తే కొన్ని ఇలాగే వుంటాయి. సాంఘిక చైతన్యానికి చట్టంకాదు ముఖ్యం... మనుషుల హృదయ చైతన్యం.

---

ఎస్. వి. కె, తాళ్ళప్రొద్దుటూరు

బీదవాడు లక్షాధికారి కావాలంటే దొంగనోట్ల ప్రెస్ బటవాడాచేస్తే బాగుంటుందా? అర్జెంటుగా తెలపాలి.

ఈసరికి జైల్లో లేకపోతే — విను తమ్ముడూ — ఇలాంటి తెగించేపని చేయటానికీ డబ్బున్నవాడే కావాలి!

---

ఎస్. డి. పి. ఎస్. హులెబీడు (చిత్తూరు)

చదువుతున్న విద్యార్థికి, పశువులు కాయు బాలునికి భేదమేమిటి?

విద్యార్థి నాలుగ్గోడల మధ్య కూర్చుని నేర్చుకుందామని ప్రయత్నిస్తున్నాడు. పశులు కాచే బాబు ప్రకృతినుంచి నేర్చుకుంటున్నాడు.

కె. ఎ. వి. మార్కాపురం.

స్త్రీ ఒక ఆదిశక్తి అంటాను దానికి మీరు ఏమంటారు?

ఆ తరతరాలుగా అణగ ద్రొక్కబడి యిప్పుడే మిగిలిన కొనవూపిరిని పుంజుకొని తలెత్తాలని తాపత్రయ పడుతున్న ఆదిశక్తి.

కె. ఎస్. ఆర్. అమృతలూరు.

మీకు కష్టంగా తోచిన ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా వుండడం మీ ప్రత్యేకత అనుకుంటాను. ఇంతకుముందు రెండు లెటర్సురాస్తే సమాధానం ఇవ్వలేదు.

అందుచేత తమరి ప్రశ్నలు కష్టతరంగా వుండి బుట్టదాఖలా చేశానని నిర్ణయించేశారు! ఏం మనుషులండీమీరు!...ప్రపంచపు వింతలో ఏ 'తొమ్మిదో' వింతో ఏమిటి? అంటూ ఆడిగారా? తెలియకపోతే కనీసం 'నేనే' సార్! అనేనా చెప్పేస్తానుగాని ఊరుకుంటానా!! లేక 'మీజీతం ఎంత? మీ వారు ఎంత సంపాదిస్తారు?' మీరె న్నాళ్ళు రాస్తారు' అంటూ ఏమైనా అడిగారా?"

ఎమ్. ఈ. విజయనగరం.

నేను జానపద, సాంఘిక కథలు, మాటలు, స్క్రీన్‌ప్లే వ్రాయగలను...సినీ పరిశ్రమలు వారికి పరిచయం.....

మంచిది. ఈ వార్త వింటే సినీ పరిశ్రమ మిమ్ములను పిల్చిసత్కరిస్తుంది!

ఎన్. ఎమ్. ఎస్. చిత్తూరు.

నమ్మలేని నిజాలు ఎటు వంటివి?

మా ఆడవాళ్ళు చెప్పే నిజాలు.

ఎ. ఎస్. ఏ. పొద్దుటూరు.

కొరత అనేది కాగితాలకి కూడా వచ్చింది. ఇంకా రానిది దేనికి?

రాజకీయ నేతల ఉపన్యాసాలకి!!

సి. ఎస్. కె. ఆర్. — అవంచ

కవితకూ కథకూ గల భేదం ఏమిటి?

కవిత భావావేశానికి ప్రతీక. కథ సన్నివేశానికి రూపకల్పన.

---

## మినీ ఇంటర్వ్యూలు


'తెలుగు సినిమాలు ఒట్టి బోర్! హీరో హీరోయిన్లు మరీ ముసలాళ్ళు! హిందీలో కొత్తకొత్త తారలు వస్తున్నారు! హిందీ సినిమాల్లో పాటలు ఎక్కువ బాగుంటాయి!'



అంటుంది విజయవాడ అమ్మాయిల కాలేజీలో చదువుకుంటున్న యు. బి. గీత.

'విజయవాడ చాలా రకాలుగా అభివృద్ధి చెందుతోంది గానీ... రోడ్లు మాత్రం బాగుపడేలా లేవు! యిక యీ వూరు గతి యింతేనేమో...' అంటూ నిరాశను వ్యక్తంచేసింది గీత. కో ఎడ్యుకేషన్ మంచిది అన్నది — యీమె నమ్మకం.

'పట్టుదల వుంటే సాధించలేనిది ఏదీ లేదు! ఆసక్తివుంటే నేర్వలేనిది ఏదీలేదు!!' అంటున్నాడు డి.వి. కోటేశ్వరరావు (హైదరాబాద్)



కథలు రాస్తాడు. బొమ్మలు వేస్తాడు. పాటలు పాడతాడు. 'చదువుకున్న రోజుల్లో చదువువిలువ తెలియలేదు! కానీ ఇప్పుడు తెలుస్తోంది! అందుకే ప్రైవేట్‌గా ఎమ్.కామ్., కంపెనీకోర్సులు చదువుతున్నా!' అన్నాడు. శివాజీగణేశన్ లాంటి నటుడు ఇండియలోనే లేడని అతని అభిప్రాయం!

[గీతా]

## గడ్డి తినే మనిషి!

పీటర్ బరోకి చెందిన నూరుకిలోల బరువున్న 54 ఏళ్ల వాల్టర్ కార్నీరియస్ అనే ఆయన వారానికి 24 పౌనులు సంపాదించుకుంటాడట. (అనగా 432 రూపాయలన్నమాట.) అయినా సరే తన ఆదాయం చాలా తక్కువని, తిండికే చాలదనీ చింతించి, పర్యవసానంగా ఆయన గడ్డి తినటం అలవాటు చేసుకున్నాడట. ఎదిగే ధరలుచూస్తే ఇంతకన్నా మంచి వుపాయంలేదు అన్నాడటాయన. ఇది బాగానే వుంది కానీ ప్రతివాడు గడ్డి తినడం ప్రారంభిస్తే ఆ గడ్డి భూమ్మీదమాని ఆకాశంమీద మొలవనారంభించదా! నాచురల్లీ!!

# పాలిటిక్స్ డైరీ

### మఫ్టీ దొంగ

3 వ తేదీరాత్రి మద్రాసులో ఓ బస్సులో ఎక్కుతున్న ప్రయాణీకుని జేబులో చెయ్యిపెట్టి ఓ మేధావి 150 రూపాయలున్న పర్సుకాజేశాడట. పసికట్టిన తోటి ప్రయాణీకులా మేధావిని పట్టుకుని ఆరాతీస్తే ఆతను పోలీసు కానిస్టేబులని తెలిసిందట. ఆ కానిస్టేబులు మఫ్టీలో వున్నాడట వాటీజ్!

### చేపెరిగిన మిశ్రా

జనవరి రెండో తేదీన రైల్వేమంత్రి యల్లెన్ మిశ్రా సమస్తిపూరు వెళ్లడానికి ధర్భాంగ విమానాశ్రయంలో దిగగానే ఆయన స్నేహితులు, హితులు, శ్రేయోభిలాషులు అందరూ కలిసి సమస్తిపూరు వెళ్లద్దని అక్కడ ఆయనకోసం ఆపద ఎదురుచూస్తూంటుందని భయంగా వుందని చెప్పారట. అవన్నీవిని "పోనిండి ప్రజాసేవలో చనిపోతేపోతాను" అని వెళ్లి అన్నంతపనీ చేశారు. అయితే అంతాపద జరుగనున్నదని తెలిసినప్పుడు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకున్నది!

### కాశ్పేసే క్రోధం

మధుర పోలీస్స్టేషనుకు చెందిన నాయక్ జగన్నాథన్ అనే కానిస్టేబుల్ మీద కొన్ని నేరాలుండడం వల్ల ఆతన్ని తాత్కాలికంగా పనిలోంచి తొలగించారట. దాంతో ఆతనికి తిక్కరేగి జనవరి మూడోతేదీ పోలీసుస్టేషనుకు వెళ్లి రైఫిలుతో చటాల్న అక్కడున్న సబిన్స్పెక్టరుమీద, సెంట్రీమీద పేల్చాడట. వారిద్దరూ పిల్లి మొగ్గలేసి ప్రమాదాన్ని తప్పించుకున్నారట. బహుశా వీరిద్దరూ చనిపోయి వుండుండాలని ఆ జగన్నాథన్ తనుకూడాను కాల్చుకున్నారట. తత్ఫలితంగా ప్రమాదస్థితిలో ఆసుపత్రిలో వున్నాడట. ఆవేశంలో నైపుణ్యం పోతుందని ఆర్యులన లేదా!

### వజ్రాల ఎగుమతి

విదేశాలకు వజ్రాలు, నగలు ఎగుమతిచేసే వ్యాపారంలో మనదేశం మరి కాస్త ముందడుగు వేసిందట. 1974 ఏప్రియల్‌నుంచి జూలైవరకూ వున్న నాలుగునెలల కాలంలో 29.09 కోట్ల విలువచేసే వజ్రాలూ, నగలూ ఎగుమతి చేసిందట.

### ముస్లిం స్త్రీలు అధిక సంతానవతులా!?

హిందూ స్త్రీలకన్నా ముస్లిమ్‌స్త్రీలు ఎక్కువగా సంతానవతులని (అనగానేమి?) కలకత్తాలో కె. యల్. బసుమిక్, ఆత్రేయ బసుమిక్ అనే యిద్దరు విజ్ఞానవేత్తలు నిర్ణయించారుట. హిందూ స్త్రీలలోకన్నా ముస్లిమ్ స్త్రీలలో శారీ

రికంగా పిల్లలను కనే శక్తి ఎక్కువవున్నట్లు వారు కనుగొన్నారట. వీరు 218 మంది హిందూ స్త్రీలను 223 మంది ముస్లిం స్త్రీలను పరిశీలించి తేల్చారట.

**మొసలి నోట్లో చెయ్యి**

జోహాన్స్‌బర్గ్‌లో ఆక్కమెఫేరి అనే వో యువకుడు డిశంబరు 30 వ తేదీన వో చెరువు ఒడ్డున నడిచి వెళ్తుండగా చూసిన వో మొసలి చటాలున వెన్నంటి అతని కుడి పిరుదును పట్టేసిందట. అతను పులిక్కిపడి, ఏదో పడిందని కుడిచేత్తో తోసెయ్య బోయేసరికి పిరుదు వొదిలి, అతనిచేతిని పట్టు కుందట చాలాసేపు దానితో పోరాడి జేబులోని చిన్న చాకుతో దాన్ని చంప యత్నించి, కుదరక, ఇహ ఆత్మ రక్షణకోసం ధైర్యంగా తన కుడిచేతిని మోచేతివద్దకు ఆచాకుతో కోసేసుకుని, మొసలినోట్లో ఆ చెయ్యి వదిలేసి, బయట పడ్డాడట, అతనిప్పుడు సాంగ్వే స్విడిష్ మిషను ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నాడట— బ్రేవో!!



# * ఉత్తరాలు *

## లిటిల్ మాస్టర్

సెంచరీ చేశాడు విశ్వ
ప్రతిబాలు కొడతాడు స్క్వేర్ కట్
గ్రౌండు బాల్స్‌తో కొడతాడు సింగిల్
ఫుల్‌టాస్ చేస్తాడు ఫోర్సు
బంపర్‌ను కొడతాడు సిక్స్
అలసి తాగుతాడు డ్రింక్స్
ఆలోచించి ఆడతాడు డిఫెన్స్
తెలిసి ఎప్పుడూ చేయడు మిస్స్
మరో సెంచరీకి ఉన్నాయి హోప్స్

పులిపాకమూర్తి (అమృతలూరు)

## ముఖచిత్రం

ది 17—1—75 తేదీగల పత్రిక ముఖచిత్రం చాలా గొప్పగా వుంది. పత్రికకి కొత్త రీతుల సింగారాలు చేయటంలో ఇటీవల మీరు చాల బాగుగాసఫలీకృతులవుతున్నారని మా మిత్రులు చాల మందిఅంటున్నారు.

మాటర్ మాత్రమేగాక దాని మేటర్ కూడా బాగా స్వీటుగా వుంది. కాస్త కారం అనే సీరియస్‌నెస్ కలిపిన రుచులు కొత్తరుచులను కొనగలవని మా బోంట్ల ఆశ.

నూత్నవత్సర అభినందనలు స్వీకరించండి.

పి. వి. రావు నేలకొండపల్లి, (ఖమ్మం జిల్లా.)

## సంక్రాంతి

సంక్రాంతి ప్రత్యేక సంచిక ముఖచిత్రము అద్భుతముగా వున్నది. సినిమా ముఖాలు చూసి చూసి విసిగిన కొందరికి మలయమారుతమువంటిది ఈ చిత్రము.

దగా పడిన తమ్ముళ్ళు కథ దయనీయంగా వున్నది. ఎందరో కదా ఈ దగాపడిన తమ్ముళ్ళు.

జి. సాయిమణి. హైద్రాబాద్.

## సీరియల్

శ్రీ సూరత్తు వేణుగోపాలరావుగారి డైవోర్స్—70 నాటకం బాగుంది. ఇటువంటి నాటకములను ప్రచురిస్తున్నందులకు ఆంధ్ర సచిత్ర వారపత్రికను అభినందించాలి.

పి. రాజనర్సయ్య (హైదరాబాద్)

* * *

“20—12—74 వ సంచికలో ముగిసిన హేమలతగారి సీరియల్ ‘ఇద్దరమ్మాయిల కథ’ మా కెంతో నచ్చింది. హేమలతగారు అనిత పాత్రద్వారా కొన్ని నగ్న సత్యాలను చెప్పించారు. ముఖ్యంగా ‘చక్కటి క్రమశిక్షణ, మంచినడవడి పిల్లలప్పుడే అలవడాలి’ అనునది ఒక మచ్చుతునక.

ఈ నవలద్వారా ‘వోడలు బళ్ళు అవుతాయి, బళ్ళు వోడలవుతాయి’’అని రచయిత్రిగారు బుజావు చేశారు.

కె. రామస్వామి, సి. కె. ప్రసాద్ (ఆదోని)

“అహం—అనురాగం” సీరియల్ (10.1.75) రచన చాలా అసహజంగా సాగుతోంది. జీవితంలో మొదటి రాత్రి ఎంత మధురమైనదో అనుభవజ్ఞులందరికీ తెలిసినదే. ఆ అనుభవం కొరకు వేచివుండే దంపతుల ఆరాటం కూడా సుమధురమైనదే.ఎంతటి నిరుపేద దంపతులు వారికి తగ్గ వసతులతోనే స్వర్గం చవి చూస్తారు ఆ రాత్రి. పెళ్లి కాగానే ఇంటికి వచ్చిన కొడుకును కోడలును నిర్దయగా వంట ఇంట్లో చింకి చాపమీద తమ ప్రథమ ప్రణయానుభూతుల్ని పంచుకోమని ఎంతటి కఠినాత్మురాలయిన తల్లి కూడా అనలేదు. అలా చూస్తూ నెల రోజులు గడపలేదు.

కె, రత్నాజి, లోయర్ సీలేరు. (కొత్తగూడెం.)

## కథలు

10—1—75 సంచికలో నాకు “మరో ప్రపంచం” కథ బాగ నచ్చింది. ఈ నాటి నిరుద్యోగ సమస్య—నిరుద్యోగుల అగచాట్లను చాల చక్కగా నిరూపించారు రచయిత. ఇప్పుడు జరిగే ఇంటర్వ్యూలు, నామ మాత్రమేగాని, ఎప్పుడో అవి, ఎవరి రెకమెండేషన్లతోను, ఎవరికో ఖాయమై పోయి వుంటాయి. కలలోని “మరో ప్రపంచం” నిజంగా మన దేశములో వచ్చిననాడు, ప్రతి ఒక్కనిరుద్యోగి, ఉద్యోగి మన స్ఫూర్తిగా సంతోషిస్తాడు.

పుల్లగూర సుబ్రహ్మణ్యం (కదిరి)

* * *


10.1.75 వారపత్రిక మొదటి తేదీకల్లా రావడం, అందులో మీ శుభాకాంక్షలందుకోవడం నిజంగా పాఠకుల అదృష్టం. “మరో ప్రపంచం’ కథ చాలా బాగుంది. కథలో “మరో ప్రపంచం” లోకి వెళ్ళిన యింజనీరుపేరు ఏమిటో రచయిత తెలుపనే లేదు.

మాడభూషి ఢిల్లీబాబు, (తిరుమల)

* * *

13—12—74 సంచికలోని పాటకు పాటే మందు అన్న వేలూరి భారతిగారి కథ హాస్యరస భరితంగా వుంది.

వి. ప్రకాశరావు పాలంపేట (ములుగు)



Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna

## తండ్రిని సంజాయిషీ అడిగిన తనయుడు

కొడుకు తప్పు చేస్తే, అతడిని శిక్షించే అధికారం తండ్రికి వుంది కానీ, తండ్రి నేరస్తుడయితే, అతడిని ప్రశ్నించే హక్కు కుమారుడికి లేదా ?

"ఏ నేరస్తుడూ తన నేరాన్ని ఒప్పుకోడు నాన్నా ప్రతివాడూ వుత్తముడ్నే అని వాదించి, చేసిన పాపం కప్పిపుచ్చుకోటానికి ప్రయత్నిస్తాడు మీరు అన్యాయం చేశారు మీకు హృదయం లేదు ఓ అమాయకురాలి జీవితంలో నిప్పులు పోశారు

నా తండ్రి కొండలాంటి గుండెలో వెన్న దాచుకున్న దేవుడని భ్రమపడ్డాను కాని, కర్కోటకుడని తెలిసిన తర్వాత నోరెత్తకుండా ఎలా వుండగలను" అంటూ తండ్రిని గద్దించాడు తండ్రి విస్తుపోయాడు

ఈ భయంకర నిజాన్ని నిలదీసి అడిగిన తనయుడిగా కృష్ణ, నేరం చేసిన తండ్రిగా కృష్ణ పోటీపడి నటించిన యీ ఘట్టం త్రిమూర్తి ప్రొడక్షన్స్‌వారి "అభిమానవతి" చిత్రంలో అగుపిస్తుంది తండ్రి పాత్రలో కృష్ణ అసాధారణంగా నటిస్తున్నట్టు వార్త అభిమానవతిగా, అగ్రనటి అత్యుత్తమంగా నటిస్తున్నట్టు వార్త

"అభిమానవతి" చిత్రానికి రామలక్ష్మి రచనా రమణీయత ఎంత మధురమైనదో, చక్రవర్తి సంగీతం అంతే తీపిది అంటున్నారు ఈ చిత్రం డూ... దర్శకత్వ ప్రతిభను అడుగడుగునా ఎరుకపరుస్తుంది ఈ చిత్రానికి జి సాంబశివరావు, బాబ్జి నిర్మాతలు శ్రీ ఫిలింస్ విడుదల

## హనుమంతరావు విజయం

ఢిల్లీలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం జరిగింది అదే సమయాన వ్యాపారరీత్యా పాల్గొనే చిత్రాల ప్రదర్శనకూడా జరిగింది

పద్మాలయా అధినేత జి హనుమంతరావు అయిదు చిత్రాలను విదేశాలకు అమ్మడం జరిగింది "అల్లూరి సీతారామరాజు, మోసగాళ్లకు మోసగాడు, మంచివాళ్లకు మంచివాడు, దేవుడు చేసిన మనుషులు" చిత్రాలను ఉత్తర ఆఫ్రికా, ఆ నాలుగుతోపాటు "పండంటి కాపురం" చిత్రాన్ని నైజీరియా కొనడం జరిగింది ఇరాక్, ఇరాన్ దేశాలు కూడా పై నుదహరించిన చిత్రాలను కొనడానికి సుముఖంగా వున్నట్టు తెలిసింది మన సంగీతంపట్ల, నృత్యంపట్ల ఆ దేశాలవారికి మక్కువ ఎక్కువ అన్న నిజాన్ని యిటీవల హనుమంతరావు పత్రికా సమావేశంలో వెల్లడించారు

విదేశాలకు తెలుగు చిత్రాలను పంపిణీచేసే వ్యాపార సంస్థను స్థాపించే వుద్దేశ్యం హనుమంతరావు కున్నట్టు ఆయన మాటల్లో స్ఫురించింది

చలనచిత్రోత్సవం పట్ల, నిరాశ నిస్పృహలను వ్యక్తంచేశారు, హనుమంతరావు బాధ్యతారహితంగ అక్కడి కార్యక్రమాలు జరిగినందుకు తన బాధను వెల్లడించారు

ఒక వ్యక్తి నిర్మించిన అయిదు చిత్రాలు విదేశీయులను ఆకర్షించి, అమ్ముడయాయంటే ఎంత గొప్ప విషయంగా పరిగణించాలి ?



"వయసొచ్చిన పిల్ల"లో
చంద్రకళ, ఎస్. రంగారావు

## లక్షన్నర సెట్లో మల్లికార్జునరావు షూటింగు

గత వారం జెమినీ స్టుడియోకు వెళ్లాను అక్కడ దర్శకుడు మల్లికార్జునరావు కనిపించారు తన వర్ణ చిత్రం షూటింగు చూడమని పిలిచారు

సెట్లోకి అడుగుపెట్టాను నలువైపులా అందమైన అలంకరణలతో దేవేంద్రుని సభా మండపమా అనిపించింది అంతటి వైభవంగా వుండిన సెట్టు ఖరీదు ఎంతని, కళా దర్శకుడు కళాకర్‌ను అడిగాను లక్షన్నర అన్నాడాయన

లక్షన్నర వెచ్చించి నిర్మించిన ఆ సెట్లో కృష్ణ, లత, చంద్రమోహన్, గిరిబాబు పాల్గొన్న పాటను, మరికొన్ని దృశ్యాలను మల్లికార్జునరావు చిత్రీకరించారు

"అనురాగ శిఖరాన ఆలయం
ఆ గుడిలోన ఆనంద జీవనం
సంసార దీపం
సంతోష రూపం" అనెడి ఆరుద్ర రాసిన పాటను నృత్య దర్శకుడు హీరాలాల్ అత్యద్భుతంగా చిత్రీకరించారు

మల్లికార్జునరావు తీసే చిత్రాలలో క్వాలిటీతో పాటురిచ్‌నెస్‌కూడా కనిపిస్తుంది ముఖ్యంగా ఈకలర్ చిత్రానికి ఆయన ఎంత ఖర్చుకయినా సిద్ధపడ్డారు

ఈ చిత్రంలో మంజుల, సత్యనారాయణ, కాంతారావు, రాజబాబు, అంజలీదేవి ముఖ్య తారాగణం వి ఎస్ ఆర్ స్వామి, సత్యం, ఆరుద్ర లాంటి వుద్దండులు సాంకేతిక సారథులు

— శ్రీనివాస్



"ఆడదాని అదృష్టం"లో ఒక దృశ్యం


నవతా చిత్ర వారి
జమిందారు గారి అమ్మాయి
దర్శకత్వం: సింగీతం శ్రీనివాసరావు నిర్మాత: యన్. కృష్ణంరాజు
అన్నపూర్ణా పిక్చర్స్
సహ నిర్మాతలు: డి. శ్రీరంగరాజు, ఆర్. విజయరామరాజు
ANNAPURNA